శుక్రవారం
25 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 306

www.vijayakranthinews.com

విజయక్రాంతి

సచిత్ర సకుటుంబ దినపత్రిక

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



మదర్ అండ్ డాటర్ ఫ్యాషన్ 8

గణతంత్ర దినోత్సవాలపై

దాడికి ప్లాన్

- జైషే మహ్మద్ కుట్రను భగ్నం చేసిన ఢిల్లీ పోలీసులు

ఢిల్లీ: రిపబ్లిక్ డే ఉత్సవాలను ఆనందోత్సాహాలతో జరుపుకునే భారతీయులపై పెద్ద ఎత్తున దాడి చేయాలని జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జమ్మూకశ్మీరులోని శ్రీనగర్, ఆ పరిసర ప్రాంతాల్లో గ్రెనేడ్ దాడులు జరిపిన ఓ ఉగ్రవాది దేశ రాజధాని నగరం ఢిల్లీలో పెద్ద ఎత్తున దాడులు చేసేందుకు సన్నాహాలు చేసినట్లు తెలుస్తోంది. ఢిల్లీ పోలీసులు ఈ కుట్రను గురువారం భగ్నం చేశారు.

ఢిల్లీ పోలీసులు మీడియా సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన ఓ ఉగ్రవాది ఢిల్లీలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఆ సమాచారం ఆధారంగా ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ బృందం దర్యాప్తు చేశారు. ఈ ఉగ్రవాది ఇటీవల శ్రీనగర్, పరిసర ప్రాంతాల్లో జరిగిన గ్రెనేడ్ దాడుల సూత్రధారి అబ్దుల్ లతీఫ్ గణాయ్ అని నిర్ధారణ అయింది.

అబ్దుల్ లతీఫ్ గణాయ్ గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఢిల్లీలో ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో శ్రీనగర్ తరహా దాడులు చేసేందుకు కుట్ర పన్నాడని ఢిల్లీ పోలీసులు తెలిపారు.

ఆదివారం రాత్రి ఆ ఉగ్రవాదిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద నేరపూరిత పుస్తకాలు, ఇతర వస్తువులు ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గణాయ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా జమ్మూకశ్మీరులోని బందిపొరలో మరొక ఉగ్రవాది హిలాల్ను అరెస్టు చేసి, రెండు ఐఈడీ/గ్రెనేడ్లను స్వాధీనం చేసుకున్నామని, తెలిపారు. హిలాల్ ఇప్పటికే ఢిల్లీలో రెక్కీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఉగ్రవాదులకు సంబంధించిన సమాచారాన్ని జమ్మూకశ్మీరు పోలీసులకు అందజేశామని తెలిపారు. అనంతరం ఆ రాష్ట్ర పోలీసులు గ్రెనేడ్ దాడులతో ప్రమేయమున్నవారిని అరెస్టు చేశారని చెప్పారు.

కొచ్చర్‌పై.. సీబీఐ కేసు

- చందా భర్తతోపాటు వీడియోకాన్ గ్రూప్స్ ఎండీపై ఎఫ్ఐఆర్ నమోదు
- ఐసీఐసీఐ, వీడియోకాన్ క్విడ్ ప్రోకో కేసులో ముమ్మర దర్యాప్తు
- వేణుగోపాల్ ధూత్, దీపక్ కొచ్చర్ కార్యాలయాలపై సీబీఐ దాడులు

ముంబై: ఐసీఐసీఐ బ్యాంకు మాజీ సీఈఓ చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్లపై సీబీఐ కేసు నమోదు చేసింది. వీడియకాన్ గ్రూప్స్ ఎండీ వేణుగోపాల్ ధూత్‌పై కూడా సీబీఐ గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. వీడియోకాన్ రుణాలకు సంబంధించిన కేసులో వీరిని నిందితులుగా ఆరోపిస్తూ సీబీఐ కేసులు పెట్టింది. దీనికి ముందు మహారాష్ట్రలోని ముంబై, ఔరంగాబాద్‌లో ఉన్న వీడియోకాన్ కార్యాలయాలపై గురువారం ఉదయం సీబీఐ దాడులు చేసింది. అలాగే చందా కొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్ నేతృత్వంలోని న్యూపవర్ కంపెనీ ఆఫీసుల్లోనూ సీబీఐ సోదాలు చేసినట్లు తెలుస్తోంది. 2012లో వీడియోకాన్ గ్రూప్ రూ.3,250 కోట్ల రుణాలు పొందింది. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) నేతృత్వంలోని 20 బ్యాంకుల కన్సార్షియం వీడియోకాన్‌కు రూ.40 వేల కోట్లు రుణం ఇచ్చింది. ఐసీఐసీఐ బ్యాంకు ఇచ్చిన రుణం కూడా దీనిలో భాగమే. అయితే వీడియోకాన్‌కు రుణం మంజూరులో కొచ్చర్ కుటుంబం లాభపడిందని ఆరోపణలు రావడంతో ఈ విషయం వివాదాస్పదమైంది. చందా కొచ్చర్ భర్తకు చెందిన కంపెనీలో వీడియోకాన్ ఎండీ వేణుగోపాల్ కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టిన నెలల తర్వాత వీడియోకాన్‌కు రుణం మంజూరైనట్లు ఆరోపణలు వచ్చాయి. చందాకొచ్చర్ భర్త, మరో ఇద్దరు బంధువులు నిర్వహిస్తున్న న్యూపవర్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వీడియోకాన్ గ్రూప్ నుంచి అక్రమంగా నిధులు బదిలీ అయినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. చందా కొచ్చార్ భర్త దీపక్ కొచ్చార్ కొన్నేళ్లుగా వీడియోకాన్ గ్రూప్‌లో అనేక లావాదేవీలు నిర్వహించినట్లు ఇంతకు ముందు సెబీ చేపట్టిన ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దీనికి తోడు దీపక్, వీడియోకాన్ చీఫ్ వేణుగోపాల్ ధూత్ న్యూపవర్ సహా ఇతర అనుబంధ సంస్థలకు సహవ్యవస్థాపకులుగా, ప్రమోటర్లుగా ఉన్నారు. దీంతో వీడియోకాన్ గ్రూప్‌నకు రుణాల జారీలో ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ చీఫ్ చందా కొచ్చర్ కుటుంబ సభ్యులు క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారనే అభియోగాలపై ముమ్మర దర్యాప్తు చేస్తున్న సీబీఐ గురువారం ఈ ముగ్గురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. క్విడ్ ప్రోకో ఆరోపణలపై సీబీఐతోపాటు ఈడీ, సెబీ, తీవ్ర నేరాల పరిశోధన సంస్థలు కూడా విచారణ జరుపుతున్నాయి.

జీవితమంతా.. గుణపాఠాలు

చందా కొచ్చర్ 1961 నవంబర్ 17న రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జన్మించారు. ఆమెకు ఒకసోదరి, ఒక సోదరుడు. అయితే 13 ఏళ్ల వయస్సులోనే తండ్రి గుండెపోటుతో మరణించారు. దీంతో కుటుంబ బాధ్యతలన్నీ ఆమె తల్లి భుజాన వేసుకున్నారు. చందా కొచ్చర్ బాల్యం నుంచి కూడా చదువుల్లో మేటి. స్థానిక సెయింట్ ఏంజెల్ సోఫియా స్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. తర్వాత ముంబై జైహింద్ కాలేజీ నుంచి బీఏ చేశారు. 1982లో కాస్ట్ అకౌంటెన్సీ అనంతరం జమునాలాల్ బజాజ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ నుంచి మేనేజ్‌మెంట్ డిగ్రీ పొందారు. ముంబైలో స్థిర నివాసం ఏర్పరచుకున్న ఆమె , బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో తన సహాధ్యాయి, పవన శక్తి వ్యాపారవేత్త అయిన దీపక్ కొచ్చర్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. ఒక అమ్మాయి, ఒక అబ్బాయి.

ప్రతి అడుగు విజయం వైపే..

చందా కొచ్చర్ పిన్న వయసులోనే ఐసీఐసీఐ బ్యాంక్ సీఈఓ పదవిని అధిరోహించిన ఘనత తను సంపాదించారు. 1984లో ఇండస్ట్రియల్ క్రెడిట్ అండ్ ఇన్వెస్ట్మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఐసీఐసీఐ) సంస్థలో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరిన చందా ఉద్యోగ తొలినాళ్ళలో సంస్థ జౌళి, కాగితం, సిమెంటు విభాగాలలో పనిచేశారు. 1993లో కొత్తగా బ్యాంకు ప్రారంభించాలనుకున్నపుడు సంస్థ యాజమాన్యం ఈమెను సంస్థ బ్యాంకింగ్ కోర్ కమిటీకి బదిలీ చేసింది. 1994లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేశారు. కొచ్చర్ పనితనాన్ని గమనించిన మేనేజింగ్ డైరెక్టర్, సి.ఈ.ఓ కె.వి. కామత్ ఆమెకు మంచి అవకాశం ఇచ్చారు. (తరువాయి 5లో)



4137 పంచాయతీలకు

నేడే రెండో విడత పోలింగ్

- ఉదయం 7గంటల నుంచి 1గంట వరకూ
- వేర్వేరుగా సర్పంచ్, వార్డు సభ్యుల బ్యాలెట్లు
- 29,964 పోలింగు కేంద్రాల ఏర్పాటు
- 673 వెబ్ కెమెరాలు
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- మధ్యాహ్నం 2గంటల నుంచి కౌంటింగ్
- అనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక

విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీల్లో శుక్రవారం రెండో విడత పోలింగు జరగనున్నది. రాష్ట్రవ్యాప్తంగా 4137 గ్రామ పంచాయతీల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 7గంటలకు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ పోలింగు నిర్వహిస్తారు. ఓటర్లకు సర్పంచులు, వార్డు సభ్యులకు బ్యాలెట్ పత్రాలు వేర్వేరుగా ఇవ్వనున్నారు. తొలి విడత పోలింగులో సర్పంచు, వార్డు సభ్యుల బ్యాలెట్లు ఒకేసారి మడత పెట్టి పోలింగు సిబ్బంది ఇచ్చింది. దీంతో చాలా మంది ఓటర్లు ఓటు వేయకుండానే ఖాళీ బ్యాలెట్ పత్రాలను బాక్స్‌లో వేసినట్లు కౌంటింగులో తేలింది. ఈ నష్టాన్ని నివారించేందుకు సర్పంచు, వార్డు సభ్యుల బ్యాలెట్ పత్రాలను వేర్వేరుగా ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. పోలింగు అనంతరం మధ్యాహ్నం 2గంటల నుంచి సర్పంచు, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నది. ముందుగా వార్డు సభ్యుల ఓట్లను లెక్కిస్తారు. తర్వాత సర్పంచుల ఓట్లను లెక్కించనున్నారు. కౌంటింగు అనంతరం వార్డు సభ్యులు ఉప సర్పంచును ఎన్నుకుంటారు. దీంతో అయా గ్రామ పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి కానున్నది. సర్పంచు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం మూడు విడతల పోలింగు పూర్తయిన తర్వాత చేపట్టాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో 4137 గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేసింది.

రాష్ట్రవ్యాప్తంగా 29,964 పోలింగు కేంద్రాలను ఏర్పాటు చేసింది. 673 వెబ్ కెమెరాలను అమర్చించింది. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసు బలగాలను మోహరించింది. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు భద్రత పెంచినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. తొలి విడత పోలింగు జరిగిన పొరపాట్లను సవరించి రెండో విడతలో ఎలాంటి తప్పులు జరగకుండా ఎన్నికల సంఘం జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. ఎన్నికల సిబ్బందికి వసతి, భోజన ఏర్పాట్లను ఎక్కడికక్కడా ఏర్పాటు చేసింది. తొలి విడతలో స్థానిక అధికారులు పోలింగు సిబ్బందిని పట్టించుకోకపోవడంతో కొన్ని జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు అధికారులకు షోకాజ్ నోటిసులు పంపించారు. దీంతో ఉదయం పోలింగు ప్రారంభం నుంచి కౌంటింగు పూర్తయ్యే వరకూ అన్ని రకాల చర్యలు తీసుకోనున్నది. గెలిచిన అభ్యర్థులు ర్యాలీలను నిర్వహించకుండా నిషేధించింది. వైన్‌షాపులు, డిజేలాంటి సౌండ్ బాక్సులు, విందు వినోదాలను పూర్తిగా నిషేధించింది. లెక్కింపు పూర్తయిన తర్వాత గెలిచిన అభ్యర్థులకు అధికారులకు సర్టిఫికేట్లు ఇవ్వనున్నారు. ఉప సర్పంచు ఎన్నిక తర్వాత సంబంధిత గ్రామాల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి కానున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

ధర్మాసనం నుంచి

తప్పుకున్న జస్టిస్ సిక్రీ

- పిటిషన్‌ను నేడు విచారించనున్న మరో బెంచ్



ఢిల్లీ: సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా మన్నెం నాగేశ్వరరావు నియామకాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించే బెంచ్ నుంచి తప్పుకుంటున్నట్లు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏకే సిక్రీ గురువారం ప్రకటించారు. ఈ పరిణామంతో ఈ పిటిషన్‌ను శుక్రవారం ఈ మరో బెంచ్ విచారించనుంది. 'ఈ పిటిషన్ను విచారించలేను. దయచేసి నా పరిస్థితి అర్థం చేసుకోవాలి' అని పిటిషనర్ తరపు న్యాయవాది దుష్యంత్ దవేతో జస్టిస్ సిక్రీ పేర్కొన్నారు.

ఇప్పటికే తప్పుకున్న సీజే రంజన్ గొగొయ్

సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మను తప్పించి ఆయన స్థానంలో తాత్కాలికంగా నాగేశ్వరరావును నియమించాలని జనవరి 10న నిర్ణయం తీసుకున్న ఉన్నతస్థాయి కమిటీలో జస్టిస్ సిక్రీ కూడా ఉన్నారు. బెంచ్ నుంచి జస్టిస్ సిక్రీ తప్పుకోవడం తీవ్ర నిరాశకు గురి చేసిందని దుష్యంత్ దవే వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ రంజన్ గొగోయ్ ఇప్పటికే బెంచ్ నుంచి తప్పుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు జస్టిస్ సిక్రీ కూడా వైదొలగడంతో ఈ పిటిషన్ను విచారించేందుకు సుప్రీంకోర్టు సుముఖంగా లేదన్న భావన ప్రజల్లో కలిగే అవకాశముందన్నారు.

ఘనంగా నాలుగోరోజు హోమం

- ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న ఎర్రవెల్లి
- పాల్గొన్న ముఖ్యమంత్రి దంపతులు

విజయక్రాంతి, హైదరాబాద్: దేశం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహిస్తున్న సహస్ర మహాచండీ యాగము నాలుగవ రోజు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. సుమారు 300మంది ఋత్వికుల వేద మంత్రోచ్చారణతో రాజశ్యామలహోమం, బగళాముఖీ హోమం, అభిషేకం ఘనంగా జరిగాయి.. ఉదయం యాగశాలలో సతీసమేతంగా ప్రవేశించిన ముఖ్యమంత్రి మొదట రాజశ్యామల మాత మంటపంలో పూజలు నిర్వహించారు. శ్రీ మహాకాళి, మహాలక్ష్మి , మహా సరస్వతి, స్వరూపిణిగా శ్రీ రాజశ్యామలాదేవిని సువర్ణ మంత్ర పుష్పాంజలితో సీఎం దంపతులు ప్రార్థించారు. సర్వ మంగళ మాంగల్యే, శ్రీ రాజశ్యామలా దైవేయ నమస్తే, అంటూ ఋత్వికులు వేదోక్తంగా ప్రార్థనలు చేశారు. రాజశ్యామల మంటపంలో ముఖ్యమంత్రి దంపతులకు వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం మహారుద్ర మంటపంలో జరిగిన పూజలో సీఎం పాల్గొన్నారు. మహారుద్ర సహిత రుద్ర ఏకాదశిని పఠన రుద్ర నమకం, రుద్ర చమకం పటించారు. పంచాక్షరి జపంలో భాగంగా శివశివ శంకర భూత పతే, శంకర శివ, శంభో మహాదేవ, హరహర మహాదేవ అనే ప్రార్థనలు యగ శాలలో మారుమోగాయి.

బ్రహ్మ స్వరూపిణి బగళాముఖి మంటపంలో..

ముఖ్యమంత్రి దంపతుల సమక్షంలో వేదపండితులు, ఋత్వికులు పూజలు చేశారు. గౌరీ నారాయణ నమస్తుతే, పీతాంబర దేవీ నమస్తుతే, జయతే, విజయతే, జయ విమలే బగలే అంటూ దేవిని స్తుతించారు. శతమానం భవతే అంటూ పండితులు సీఎం దంపతులను దీవించారు. నవగ్రహ మంటపంలో ఆదిత్య హృదయం పఠనం, సూర్య నమ స్కారాలు నిర్వహించారు. చండీమాత ప్రధాన యాగశాలలో రాజరాజేశ్వరి మాత ప్రార్థన చేశారు. భువనేశ్వరి, బ్రహ్మాండ కుటుంబినీ, శ్రీ గణనాథ పార్వతీ నందన, పాపవిమోచన అంటూ ప్రార్థనలు నిర్వహించారు. ఋత్వికులు 400 సార్లు చండీ సప్తశతి పారాయణము పటించారు. వేదపండితులు యాగం వీక్షించడానికి వచ్చిన భక్తులకు సుభాషితాలు వినిపించారు. యాగ విశిష్టతను వివరించారు. మహాహారతితో కార్యక్రమాలు ముగిశాయి. పాల్గొన్నారు.ఈ కార్యక్రమాలన్నీ శృంగేరి పీఠాధిపతులు, శారదా పీఠాధిపతుల దివ్య ఆశీస్సులతో విద్వదాహితాగ్ని బ్రహ్మశ్రీ మాడుగుల మాణిక్య సోమయాజులు గురువు గారి పర్యవేక్షణలో జరుగుచున్నవి. పూజా కార్యక్రమాలు వేద పండితులు పురాణం మహేశ్వర శర్మ, మంగళంపల్లి వేణుగోపాల శర్మ, శాస్త్రుల వెంకటేశ్వర శర్మ, ఫణి శశాంక శర్మ, గంగవరం నారాయణ శర్మ, జి.కామేశ్వర శర్మ, కాసుల చంద్ర శేఖర శర్మ ల నిర్వహణలో అత్యంత వైభవంగా జరుగుచున్నవి.





అధికారంలోకి వస్తే..

24 గంటల్లో 50,000 ఉద్యోగాలు

- దేశ వ్యాప్తంగా పక్కాగా అమలు చేస్తాం
- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తాం
- ఎస్పీ, బీఎస్పీతో కలిసి పని చేస్తాం
- ప్రియాంక రాజకీయ ప్రవేశంతో పార్టీలో కొత్త ఉత్సాహం
- యూపీ తూర్పుకు చెందిన నేతే తదుపరి సీఎం
- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పష్టం
- సొంత నియోజకవర్గం అమేథీలో ముగిసిన రెండు రోజుల టూర్

అమేథీ: కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 24 గంటల్లోనే దేశ వ్యాప్తంగా 50,000 ఉద్యోగాలు సృష్టిస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని తన సొంత నియోజకవర్గం అమేథీలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలతో రాహుల్ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. 'నేను ఉత్తరప్రదేశ్ ప్రజలకు ఓ విషయం చెప్పాలనుకుంటున్నాను. యువత, రైతులు చాలా సమయాన్ని వృథా చేసుకున్నారు. బీజేపీ ప్రభుత్వం కొలువుదీరేలా చేశారు. ఆ ప్రభుత్వం వ్యవస్థను నాశనం చేస్తోంది. ఇప్పుడు వారిని గద్దెదించండి. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలుపుతాం' అని ఆయన అన్నారు. యూపీలో బీఎస్పీ, ఎస్పీ కూటమి గురించి కూడా రాహుల్ స్పందించారు. మా మూడు పార్టీల భావజాలం ఒకటేనని ఆయన అన్నారు. బీజేపీని ఓడించడానికి బీఎస్పీ, ఎస్పీతో కలిసి పనిచేయాలని అనుకుంటున్నామని రాహుల్ స్పష్టం చేశారు. 'మాయావతి, అఖిలేష్ అంటే నాకు చాలా గౌరవం. మా ముగ్గురి లక్ష్యం ఒక్కటే. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.




గత లోక్‌సభ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెరవేర్చలేదు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన 24 గంటల్లో 50,000 ఉద్యోగాలను సృష్టిస్తాం. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన 10 రోజుల్లోపే (తరువాయి 5లో)

దిమాక్ ఖరాబ్



కేంద్రంలో హంగ్ ?

- ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే కేంద్రంలో బీజేపీకి షాక్
- ఎన్డీఏకు 99 సీట్లు తగ్గే అవకాశం
- యూపీఏకు 106 సీట్లు అదనం
- ప్రభుత్వ ఏర్పాటులో ఇతర పార్టీలే కీలకం
- ఇండియా టుడే, కార్వీ ఇన్సైట్స్ 'మూడ్ ఆఫ్ ది నేషన్ పోల్' సర్వేలో స్పష్టం



న్యూఢిల్లీ: దేశంలో ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం వస్తుందని సర్వేలో వెల్లడైంది. ఎన్డీఏ కూటమికి మెజారిటీ బాగా తగ్గుతుందని ఇండియా టుడే కార్వీ ఇన్సైట్స్ నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ది నేషన్ పోల్'లో తేలింది. ఈ రోజు లోక్‌సభ ఎన్నికలు జరిగితే ఎలాంటి ఫలితాలు వస్తాయనే దానిపై దేశవ్యాప్తంగా ఈ సర్వే నిర్వహించారు. 2014 ఎన్నికలతో పోలిస్తే (తరువాయి 5లో)

అఖిలేష్.. గోమతీ నదీ స్కాం

- నాలుగు రాష్ట్రాల్లో ఈడీ సోదాలు

లక్నో : ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గోమతి నది అభివృద్ధి పథకంలో అక్రమాలు సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌ను వెంటాడుతున్నాయి. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన కాలంలో చేపట్టిన ఈ పథకంలో అక్రమాలు జరిగినట్లు నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం 4 రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించింది. ఈడీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర ప్రదేశ్లోని లక్నో, నోయిడా, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో సోదాలు జరుగుతున్నాయి. స్థానిక పోలీసుల సహకారంతో ఈ సోదాలు నిర్వహిస్తున్నారు. సాక్ష్యాధారాలు, దస్తావేజులను పరిశీలిస్తున్నారు. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం గోమతి నది సుందరీకరణ పనుల పథకంపై దర్యాప్తుకు ఆదేశించడంతో సీబీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తోంది.



ఈ నేపథ్యంలో ఈడీ గత మార్చిలో మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. అలహాబాద్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అలోక్ కుమార్ సింగ్ నేతృత్వంలోని విచారణ కమిటీ కూడా గోమతి నది అభివృద్ధి ప్రాజెక్టులో అక్రమాలు జరిగినట్లు ఆధారాలు ఉన్నాయని పేర్కొంది. ఈ కమిటీ తన నివేదికను 2017 మే 16న ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా పోలీసులు అదే సంవత్సరం జూన్ 19న కేసు నమోదు చేశారు.

విజయ క్రాంతి
శుక్రవారం 25 జనవరి 2019
హైదరాబాద్



శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః


శ్రీ వికారి నామ సంవత్సరం	సూర్యోదయం	: ఉ. 06:49	యోగం	: అతిగండ 14:48	
ఉత్తరాయణం	సూర్యాస్తమయం	: సా. 06:07	కరణం	: కౌలవ 07:31 తైతుల 18:18	
హేమంత ఋతువు	పక్షము	: కృష్ణ పక్షం	రాహుకాలం	: ప. 11:04, మ: 12:28	
పుష్య మాసం	తిథి	: పంచమి 18 :18 తదుపరి షష్ఠి	యమగండం	: సా. 03:16, 04:39	
	నక్షత్రం	: ఉత్తర ఫల్గుని 16:25	వర్జ్యం	: ఉ. 12:21, 01:52	
			అమృతకాలం	: ఉ. 09:48, 11:16	



సూక్తి సుధ

ఆలోచనలు ఉన్నప్పుడే, అది పరధ్యానం. ఆలోచనలు లేనప్పుడు, అది ధ్యానం.

-రమణ మహర్షి





రామకృష్ణ తీర్థం




తిరుమల పర్వతాలు అడుగడుగునా తీర్థాలతో విరాజిల్లుతుంది. అందులో కొన్ని ముఖ్యమైన తీర్థాలలో రామకృష్ణ తీర్థం అతి ముఖ్యమైనదిగా చెప్పుకుంటారు. ఈ తీర్థాన్ని దర్శించడం కొంచెం సాహస యాత్ర చేయడం వంటిది.

నామజపమే సులువైన మార్గం

ల నుండి పాపవినాశనంకు బస్సులో వెళ్లిన అక్కడ నుంచి డ్యామ్ దాటి ఉత్తర దిశగా కాలి నడకన ఐదు కిలోమీటర్లు గోవింద నామాన్ని జపిస్తూ అడవిలోని కొండలను ఎక్కుతూ సులువుగా ప్రయాణం చేయవచ్చు. వెళ్లిన దారిలో ఈతచెట్లు, మోగిచెట్లు, బిల్లుడు, పరికి, బూడిద పండ్ల చెట్లు, ఎర్ర చందనం, ముష్టి చెట్లతో పాటు ఎన్నో ఔషధ మొక్కలను దాటుకుంటూ వెళ్ళితే సనక సనంద తీర్థం. ఇక్కడ సన్నని దారిగా తియ్యనైన నీరు, నీరు కొంచెం తాగి కొన్ని బాటిల్లలో నింపుకొని ముందుకు వెళ్ళుతూ ఉంటే చెట్ల మధ్య నుండి పక్షుల కిల కిల రావాలు, అది ఆలకిస్తూ ముందు వెళ్ళితే అన్నదాన బండలొస్తాయి. ఇది ఉత్తర దిశగా వెళ్ళేతీర్థాలకు కూడలి వంటిది ఇక్కడ రామకృష్ణ తీర్థంకే, తుంబుర తీర్థంకి అన్నదానం, త్రాగు నీరు ఏర్పాటు చేస్తారు. అక్కడ కొంత విశ్రాంతి తీసుకొని గోవిందా గోవింద అని గోవింద నామం జపిస్తూ ముందుకు కదిలి వాయువ్య దిశగా కొండను ఎక్కి, కొండ అగ్రభాగాన చేరి, కరకాయ, ఎర్రచందనం, బిక్కిజాయ, ఈతచెట్లతో బాటు మరెన్నో చెట్లను చూస్తూ కొంత దూరం నడిచిన తరువాత ఒక లోయలోకి మార్గం కనబడుతోంది.

మరపించును హిమవంతుని..

గోవిందా.. గోవింద అని ఆ లోయను ముందుకు చూసిన రాళ్ళు రప్పలతో పెద్ద పెద్ద గుండ్లుతో చెట్ల పొదల్లో దారి సరిగ్గా కనిపించక కొంచెం భయం కలుగుతుంది. కానీ గోవింద నామ మహిమ వల్ల మనకు ధైర్యం కలిగి మనతో ఆ శ్రీ నివాసుడే ఉండి నడిపిస్తున్నాడా! అన్నట్టు నిర్భయంగా తోడు నడిచే మనుషులతో లోయలోకి దిగేందుకు ఉపక్రమిస్తే, గోవిందా.. గోవింద అంటూ దిగుతున్న కొద్ది మనలో ఉత్సాహం పెరుగుతుంది. ఎప్పుడు తీర్థాన్ని చూస్తామా అని తొందర ఒకవైపైతే, అలా అని తొందర పడి దిగలేము ఎందుకంటే అంతా జారుడు బండలు వర్షాల వల్ల అక్కడ కృద సన్నని జలపాతాలు పాచి పట్టిన బండలు మధ్యలో అక్కడక్కడా నిచ్చెనలు మొత్తం 7,8 నిచ్చెనలు దిగవలసి ఉంటుంది. అందువల్ల గోవిందా.. గోవిందా అని నెమ్మదిగా మనసు భగవంతునిపైన ఆలోచన ఆడుగులపైన ఉంచి కిందకు దిగాలి. ఆఖరి నిచ్చెనను దిగి, ఆ లోయను చూస్తే తీర్థాన్ని వర్ణించడం కష్టమే. చెప్పలేని ఆధ్యాత్మికమైన ఆనందానుభూతి లోనవుతాము. రాత్రివేళలో చూస్తే పౌర్ణమి వెన్నెలలో ఆ పర్వతం వెండి కొండ



వలె తళతళలు మెరిసిపోతూ హిమాలయాలలా తలపోస్తాయి. గోవిందా! ఇంత సౌందర్యాన్ని ఇంత దూరాన ఎందుకు దాచావయ్యా? అని అడుగుదామా అనిపిస్తుంది. దిగిన వెంటనే ఎదురుగా కొండ సూర్య కిరణాలకు నిలువెత్తు 18 కేరెట్ల బంగారు గోడలా ఉంటుంది.

ఈ కొండకే కొంచెం రుచి ఏర్పడి ఉంటుంది. ఆ భాగంలోనే శ్రీ రామకృష్ణుడి ఆర్యామూర్తి విగ్రహాలను ప్రతిష్టించబడి ఉన్నాయి. కింద విశాలమైన చలువ బండలు, స్వచ్ఛమైన తియ్యనైన ఔషధ గుణాలు కలిగిన నీటి కాలువల గలగల శబ్దం, విసనానిగ్ని గోవిందా.. గోవింద అంటూ ప్రవహిస్తూవుందా అనిపిస్తుంది.. అక్కడ మరి రెండు నిచ్చెనలున్న లోయలోకి దిగితే కొలను. ఈ కొలను ఎంతో స్వచ్ఛ మైనదిగా ఉంటుంది. 20,30అడుగులు లోతు ఉన్నా అడుగు భాగం స్వచ్ఛంగా కనబడుతోంది.

విశేషం

దారిలో గోవింద నామాన్ని జపిస్తూ మూడు మునకలు వేసి శ్రీవారి తిరునామాన్ని శిరస్సున ధరించి పైకివచ్చి రామకృష్ణుడిని సేవించుకొనిన, తితిదే అర్చకులు వచ్చి శ్రీ వారిని ధూప దీప నైవేద్యాలతో సేవించుకొంటారు. ఆ దృశ్యాన్ని చూసి బ్రహ్మానందాన్ని పొంది మనం వెంట తెచ్చుకున్న పదార్థాల ను శ్రీ వారికి నైవేద్యంగా చూపి గోవింద నామాన్ని తలుచుకొంటూ ఆరగిస్తూ ఉంటే వాటి రుచులు రెట్టింపై మన మనసుకు ఉల్లాసపరుస్తుంది. రండి.. రారండి.. భక్తులారా తీర్థాన్ని దర్శించి ఎన్నోజన్మల నుండి చేసిన పాపాల నుంచి విముక్తిని పొందుదాం.. గోవిందా.. గోవింద.

- వాసుదేవ

ధనం లేకపోతే ఈ జీవితమే లేదన్న భ్రాంతి తగదు

చాణక్యం

శ్లో॥ యస్యార్థా స్తస్య మిత్రాణి యస్యార్థా స్తస్య బాంధవాః
యస్యార్థాః స పుమాన్ లోకే యస్యార్థాః స చ జీవతి॥

ధనమున్న వానికే మిత్రులు, బాంధవులు ఉంటారు. ధనమున్న వాడే పెద్ద మనుష్యుడుగా పరిగణిస్తారు. ధనమున్న జీవితమే గొప్ప జీవితం. డబ్బు లేకుండా ఏ పని సరిగా జరగదు. డబ్బున్నవాని వెంట బంధువులు, మిత్రులు చేరుతారు. ధనం పరమాత్మకాకున్ననూ దాని మహిమచే గానం చేయుదురు అని చాణక్యుల వారు తమ నీతి శాస్త్రంలో తెలియచేస్తున్నారు. ఇంకా భర్తృహరి మహాకవి ఈ విధంగా తెలియచేస్తున్నారు.

శ్లో॥ యస్యాస్తి విత్తం స నరః కులీనః స పండితః స శ్రుతవాన్ గుణజ్ఞః।
స ఏవ వక్తా స చ దర్శనీయః సర్వే గుణాః కాంచన మాశ్రయంతే॥

ధనవంతుడే గొప్ప కులముగలవాడుగాను, పండితుడుగాను, శాస్త్రజ్ఞుడుగాను, గుణవంతుడుగాను, వక్తగాను, అందగాడుగాను, పరిగణిస్తారు. గుణాలన్నీ బంగారాన్ని ఆశ్రయించే ఉంటాయి. అది కలవాడే సర్వోపరిగా విరాజిల్లుతున్నాడు. ధనము అవశ్యకమే. దానిని న్యాయమార్గాన సంపాదించవలెనని తెలియచేస్తున్నారు. పూరాతన కాలంలో ఏమోగానీ ప్రస్తుత పరిస్థితుల్లో ధనానికి అత్యంత పెద్ద పీట వేస్తున్నారు. ధనం లేని వానిని పూచిక పుల్ల మాదిరిగా చూస్తున్నారు. అందుకని ఏదో రకంగా ధనం సంపాదించే వారు ఎక్కువయ్యారు. ఆ సంపాదించడంలో ధర్మపద్ధతిలో, అన్యాయంగా గాకుండా న్యాయంగా సంపాదించాలని పెద్దలు హితవుపలుకుతున్నారు. ఇప్పటి పరిస్థితుల రీత్యా కానీ ధర్మం, న్యాయం చూడకుండా యథేచ్ఛగా సంపాదిస్తున్నారు. అలాంటి వారికే పరిస్థితులు కూడా కలిసివస్తున్నాయి. ఇలా సంపాదించిన వాళ్ళ చుట్టూ కూడా బంధువులు, స్నేహితులు చేరుతున్నారు. ధనమున్నవారినే సంఘంలో పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్నారు. ప్రాచీన కాలం నుండి ధనం అవసరం అంతలేకపోయినా ప్రస్తుత కాలంలో మాత్రం ధనం లేక పోతే ఈ జీవితమే లేదన్న భ్రాంతిలో ఉంటున్నారు. ఈ ధనం కోసం అనేక సంపాదించే వారే ఎక్కువమంది ఉన్నారు.

- యామిజాల సుబ్రహ్మణ్యం

ముంజాలుడు – లఘుమానసము (శక.854)

వేద విజ్ఞానం

భాగం-84

ముంజాలుడు దక్షన్‌వాసి. బృహన్మాన సానికి సంక్షిప్తరూపంగా లఘుమానస మును సంకలనం చేశాడు. బెరూని పేర్కొ నిన దానిని బట్టి, శక.854కు అయనాంశ ప్రమాణం 6డిగ్రీల 50', అయన వార్షిక గతి 1'గ అందులో తీసుకోవడం జరిగినది. దీన్ని బట్టి, ముంజాలుని ఉద్దేశ్యంలో, అయనాంశన్య సంవత్సరం శక.444 సంవత్సరము అని తెలుస్తోంది. బెరూని ముంజాలుని 'పుంజల్' అని సంబోధించాడు. గణక తరంగిణి కర్త తాను లఘుమానసం చూసినట్టు, అందులో అనుష్టుప్ ఛందస్సులో 60 శ్లోకములు ఉన్నట్టు, ఇది శక.854కు చెందినట్టు, తెలియచేశాడు. అయితే ఈ గ్రంథంలో ముంజాలుని పేరు ఎక్కడా లేదు. కాని ముగింపులో, ముంజాలుడు అనే పేరు లేకపోయినా, ఆఖరి పాదములో "ముంజాలభట్టు గ్రంథం సమాప్తం" అని ఉంది. కోల్‌బ్రూక్ ఉజ్జయినికి చెందిన ఖగోళశాస్త్రవేత్తల సహాయంతో ఖగోళశాస్త్రవేత్తల కాలాలను నమోదు చేశారు. దాని ప్రకారం, ముంజాలుడు శక.854గా గుర్తించడం జరిగింది. భాస్కరాచార్యుడు ముంజాలుడు సూచించిన విషువద్బృత్తగతిని తెలియచేశాడు. దీన్నిబట్టి, ఆల్‌బెరూని పేర్కొన్న లఘుమానసకర్త ముంజాలుడు ఈ ముంజాలుడు ఒకరే. మరీచి వ్యాఖ్యానమును రాసిన మునీశ్వరుడు, ఒకచోట ముంజాలుని శ్లోకము లను ఉదహరించినాడు. "ఖగోళ పదార్థములు ఆకాశంలో ఉత్తరము నుండి దక్షిణానికి, మరల దక్షిణము నుండి ఉత్తరానికి చరిస్తుండడంతో వాటి ఖగోళ అక్షాంశాలలో చిన్న తేడాలు వస్తాయి.

ఖగోళ మధ్యరేఖయు, క్రాంతి వృత్తము ఖండించుకునే (లగ్న) బిందువు మేషరాశి యొక్క ప్రారంభంగా (మేషాదిగా) తీసుకుంటారు. అది తూర్పును సూచిస్తుంది. రెండవ ఖండన బిందువును తులారాశి యొక్క ప్రారంభంగా (తులాదిగా) తీసుకొంటారు. ఈ రెండు బిందువుల 'పాతముల' విలువ 'సున్న' ఉంటుంది. ఆ పాతముల విలువ ఎన్నటికీ మారదు.

–డా॥ రేమెళ్ల అవధానులు

కార్యక్రమం

నెల రోజుల కిందట మధుర వెళ్లిన సర్వాధికారి నిరంజనానందస్వాములు నాలుగైదు రోజుల కిందట పట్నం వెళ్లారట. అక్కడున్న రమణభక్తులలో ప్రముఖులైన వారిలో ఆలోచించి సెప్టెంబర్ ఒకటవ తేదీకి నిర్ణయించిన స్వర్ణోత్సవానికి నడవవలసిన కార్యక్రమ మంతా పట్టికగా రాసి పంపగా నిన్న ఉదయం తెచ్చి వినయవిధేయతలతో శ్రీ భగవానులకు సమర్పించి చేతులు జోడించి నిలిచాడు టి.కె.దొరసామయ్యరు. ఆ లేఖలో ఉత్సవ దినం ఉదయం ఏడు గంటలు మొదలు రాత్రి ఏడింటివరకు జరుపవలసిన కార్యక్రమం రాసి ఉంది. హైకోర్టు జడ్జీలు, ఇంకా పేరుగల పెద్ద మనుష్యులు, ఎందరో ఉపన్యాసకులుగా నిర్ణయం పబడ్డారు.


ఆ లేఖలో ఉత్సవదినం ఉదయం 7.00 గంటలు మొదలు రాత్రి 7.00 గం.ల వరకు జరపాల్సిన కార్యక్రమం రాసి ఉంది. హైకోర్టు జడ్జీలు, ఇంకా పేరుగల పెద్ద మనుష్యులు, ఎందరో ఉపన్యాసకులుగా నిర్ణయం పబడ్డారు. మునిసి సుబ్రహ్మణ్యయ్యర్, ఎందరో ఉపన్యాసకులుగా నిర్ణయించారు. మునిసి సుబ్రహ్మణ్య య్యర్, బూదలూరి కృష్ణమూర్తి అయ్యర్‌గార్ల పాటకచేరీ, ఇంకా ఏమేమో కార్యక్రమ పట్టికలో ఉందని, భగవాన్ ఆదంతా పరిశీలనగా చదివి మందహాసంతో 'సరిపోయింది. వ్యవధిలేని కార్యక్రమం. పోనీ నాకెందుకు, ఏమున్నా చేసుకోనీ, నాకు మాత్రం బయటకు వెళ్లి వచ్చేటందుకు వ్యవధి ఇస్తే చాలును. అయినా ఈ పెద్దలంతా వచ్చి ఉపన్యాసాలిస్తారంటే, దేన్ని గురించి మాట్లాడుతారట్టా? ప్రసంగించటానికి ఏమున్నది? ఉండేది మౌనం. మౌనాన్ని గురించి మాటలతో ఎట్లా చెప్పటం? ఇంగ్లీషులో, సంస్కృతంలో, అరవంలో, తెలుగులో, మళయాళంలో, అలే అప్పా! అన్ని భాషలలో మాట్లాడుతారు. గొప్పగొప్పవారు ఈ.. పోనీ, మనకెందుకు. మననేమీ మాట్లాడమనకుండా ఉంటే అంతే చాలు అన్నారు భగవాన్. ఆ భక్తుడు వాన్ని సెలవిస్తే మానేస్తామన్నాడు వినయంగా. 'ఓహో, సరి సరి. ఇదంతా నేను రావాలన్నానా ఒకటి వద్దనటానికి? ఏమైనా చేసుకోండి. వారి ఇష్టం. మీ ఇష్టం. నన్ను మాత్రం ఏ ఉపన్యాసానికి నియమించకుండా ఉంటే అంతే చాలు. ఇలా సోఫా మీద కూర్చుంటాను. ఏమైనా చేసుకోండ'న్నారు భగవాన్ చిరునవ్వుతో. 'జెను స్వామీ! వాస్తవమే. భగవాన్ ఎదుట నోరెత్తి ప్రసంగించటం ఎవరికీ సాధ్యపడదు.అయినప్పటికీ ఇంత భాగ్యం లభించిందే అని మా సంతోషం వెలిబుచ్చటానికే ఇదంతాను' అంటూ నమస్కరించి వెళ్ళాడా భక్తుడు.



– సూరి నాగమ్మ (రమణాశ్రమ లేఖలు)

ధర్మ సందేహాలకు సమాధానాలు

స్తోత్రమంటే ఏమిటి? శ్రీవిష్ణు, లలితా సహస్రనామాల వైశిష్ట్యం ఏమిటి?



'నమస్కారం, ఆశీర్వాదం, అభిప్రాయ దృఢవ్యక్తీకరణ, పరాక్రమ నిరూపణ, భగవదైశ్వర్య వివరణ, ప్రార్థన – ఆరు లక్షణాలతో కూడిందే స్తోత్రం' – అన్నాడొక మహాపురుషుడు. స్తోత్రంలో ఆయా దేవతల పరతత్త్వం, విభూతి (మహిమ) విశేషంగా చెబుతూ, దేవతాశక్తి పొందుపరచిన బీజాక్షరాలలో స్తోత్రాలు చెప్పారు. కాబట్టి స్తోత్ర పఠనం వల్ల ఆయా దేవతా బీజాక్షరాలను కూడా పఠించినట్లవుతుంది. ఆ బీజాక్షరాలు శరీరంలోని వివిధ స్థానాల్లోని దేవతల వద్ద ఉంచడం వల్ల, ఆయా షట్చక్ర కేంద్రాలు శక్తివంతమవుతాయి. బీజాక్షర జపఫలం లభిస్తుంది. స్తోత్రం ముఖ్య ఉద్దేశ్యమేమిటంటే ఆయా దేవతల గుణాలు మళ్లీ మళ్లీ మననం చేయడం వల్ల భక్తిభావన స్థిరమవుతుంది. ఆ బీజ మంత్రాల ధ్వనులు పరిసరాలను కూడా దేవతాశక్తితో నింపేస్తాయి.

విష్ణు సహస్రనామాల్లో విష్ణుతత్త్వం. లలితా సహస్తనామాల్లో పరమేశ్వరితత్త్వం విశేషంగా ప్రస్తావించారు. ఈ రెండు సహస్తనామాల్లో చాలా శక్తి ఉందని సాధకుల అభిప్రాయం. కోర్కెల సాధనకు, ఐశ్వర్యానికి – లలితాసహస్రనామం, గ్రహబాధల నివారణ, కష్టనివారణ, విజయానికి – విష్ణు సహస్రనామం పఠించాలి. అయితే ఒక్కో నామానికి ఒక్కో కోర్కెను తీర్చే సామర్థ్యం ఉందని పెద్దల అభిప్రాయం. కేవలం పఠనమే కాకుండా ఆయా నామాల వెనుక ఉన్న రహస్యాలను కూడా తెలుసుకోవాలి. అప్పుడే సంపూర్ణ దైవశక్తి అనుభూతిని పొందగలుగుతాం.

ఉదయం గాని, సాయంత్రంగాని కాళ్లు చేతులు కడిగి, ముఖంపై కూడా తిలకధారణ చేసి, దేవునిముందు దీపం పెట్టి ఈ సహస్ర నామాలను పఠించాలి. సహస్ర నామాలకు గురూపదేశం అవసరం లేదు. తప్పులు లేకుండా చదవాలి. ఆడవారైనా, మగవారైనా ఈ సహస్ర నామాలు పఠనం చేయొచ్చు.

ఈ దేవతా స్తోత్రాలు ఏదైనా ఫలం ఆశించి చదివితే ఫలశ్రుతి కూడా ప్రతిసారీ చదవాలి. నిష్కామంతో చదివితే ఫలశ్రుతి స్తోత్రం చదివిన ప్రతిసారి చదవాల్సిన అవసరం లేదు. లలితా సహస్రనామ పఠనానికి ముందు దేవీ అపరాధస్తోత్రం తప్పక చదవాలన్న నియమం లేదు. కానీ లలితా సహస్రనామ స్తోత్రం చదివేముందు ఈ క్రింది విధంగా చదివి నమస్కరించాలి.

డా॥ పి. భాస్కర యోగి

పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి!
తెలియనివన్నీ తెలుసుకోండి..

1. జనకుడికి మరోపేరు?
2. కౌరవుల తరపున రాయబారం నడిపినవాడు?
3. కైకసి, విశ్రావసు దంపతుల కుమారులు?
4. పుత్రకామేష్ఠియాగం వల్ల కలిగే ప్రతిఫలం?
5. బిందు సరోవరం నుండి గంగ తూర్పు దిక్కుకి ఏ ఏ పాయలుగా వెళ్ళింది?
6. హిరణ్య కశిపుని కుమారుడు?
7. అత్రికి శివాంసగా జన్మించినవాడు?
8. చిత్రకేతుడి పట్టపు రాణి?
9. అకూతి, ప్రజాపతి దంపతుల కుమారులు?
10. పులస్త్య బ్రహ్మ భార్య?

సమాధానాలు

1.సీరధ్వజుడు
2. సంజయుడు
3. రావణుడు, కుంభకర్ణుడు, విభీషణుడు
4.పుత్రుడు సంతనా యోగం
5. హ్లాదినీ, పావనీ, నళిని
6. ప్రహ్లాదుడు
7.దూర్వాసుడు
8.కృతద్యుతి
9.యజ్ఞుడు, దక్షుడు
10.హవిర్భుక్క

వారాహి దేవి

హృదయ స్థానంలోనే బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఇంద్రుడు ఉన్నారు. వీరిని అక్షర స్వరూపమైన పరబ్రహ్మగా చెప్పబడింది. అనాహత పద్మం హృదయ స్థానంలోనే ఉంటుంది. జీవి 'హృదయరహస్యం' అనేది సృష్టిలోని వింత. దీన్నే 'దహరాకాశం' అంటారు. హృదయంలోని ఆకాశరూపిణిని ఆకాశ శూన్యమని, శూన్యమంటే అంతరిక్షమని, ఈ అంతరిక్షంలో నుండే సర్వం ఆవిర్భవిస్తున్నాయనీ అర్థం.

హృదయ స్పందన ఈ రహస్య స్థావరం నుండే ఉద్భవిస్తుంది. ఈ స్పందనను బట్టి ఊపిరితిత్తులు సంకోచించి, వ్యాకోచిస్తుంటాయి. తద్వారా శ్వాస ప్రసారం జరగడం, ధమనులు మంచి రక్తాన్ని, సిరలు చెడు రక్తాన్ని హృదయానికి తేవడం వంటి ముఖ్య రక్తప్రసరణా కార్యక్రమాలు ఈ హృదయంలో నిర్వర్తించబడుతాయి. హృదయానికి అధీశ్వరిణిగా, ఆజ్ఞాకారిణిగా పరమేశ్వరియే ఉంటుంది. జ్యోతిషపరంగా హృదయాన్ని సింహరాశితో చెబుతారు. హృదయాన్ని అధిష్టించి ఉన్నది. కాబట్టి హృదయాన్ని ఆసనంగా చేసుకొని ఉన్నదని అర్థం. సింహాసనేశ్వరీ అని 'హృదయస్థా' అని కూడా అంటారు. ఇక్కడ ఆమె వాయుతత్వాన్ని (అనాహతం) నియంత్రిస్తుంది. అతి రహస్య స్థావరమైన హృదయంలో శ్రీవిద్యా అనంత రూపిణియై వికసిస్తుంది. హృదయంలోని వాయుతత్వం కారణంగానే మన అభిప్రాయాలను, ఆలోచనలను పంచుకుంటాం. మనిషి శరీరంలో 'పాపం' అనే వాసన లేని అత్యంత పవిత్రమైన స్థానం ఇదే. మణిపూరంలో పరాశక్తి చైతన్యం పొంది అనాహత కమలాన్ని, చేరి అక్కడ సాధకుని పంచ ఉపచారాలను గ్రహిస్తుంది. దానిని ఛేదించినపుడు మంగళకర ధ్వనులతో సూక్ష్మశరీరం కూడా కల్పితమని, నిజరూపం కాదని 'జ్ఞానోదయం' అవుతుంది. హృదయ స్థానంలోని ప్రాణేశ్వరియే ఇక జీవులను నడిపిస్తుంది. పంచప్రాణాలను నడిపించే పరాశక్తి స్వరూపం ఇక్కడే ఉంటుంది.

మన మనసులోని భావాలు తెలుసుకోవడం గొప్పకాదు. ఎదుటివారి హృదయంలోను భావాలను తెలుసుకోవడమే



గొప్ప. భావం, అభిప్రాయం రెండూ వేర్వేరు అర్థాలను ఇస్తాయి. భావం మన ఒక్కరికి సత్యమనిపిస్తుంది. అభిప్రాయం నలుగురితో కలిసిఉండేది. హృదయస్థానం సూర్యునికి గుర్తు. హృదయం వికాసాన్నిస్తుంది, విజ్ఞానాన్నిస్తుంది. దీనికి సూర్యుని కిరణాలవలె ప్రసరించే శక్తి వుంది.

ఏ క్షణంలోనైనా, ఏ స్థానంలోనైనా ఉన్నా కూడా మన ఆలోచనలనుబట్టి, భావననుబట్టి ఒక రూపాన్ని స్ఫురింపచేసే శక్తి హృదయానికి ఉంది. శ్రీలలితా పరమేశ్వరి హృదయాంతర్వర్తి, హృదయనివాసి. హృదయం రంగు ఎరుపు, తెలుపు కలిసిన పాటల వర్ణంలా ఉంటుంది. ఇది ప్రేమకు చిహ్నమైన గులాబి రంగు. ఈ హృదయానికి అధిపతి సూర్యుడు. తాను మంచి

త్రిగుణాత్మక స్వరూపిణి

దామిడి కుసుమవర్ణంలో(అరుణ వర్ణం) ఉంటాడు. ఆకాశ స్వరూపం, ఆనందకోశ దేవతా స్వరూప నివాసం ఉన్నది ఇక్కడే. సహస్రారాలలోని, చంద్రమండలంలోని వెన్నెలనే 'అమృతం' అంటారు. ఈ సుధాశృతిసుషుమ్న మార్గం వెంబడి ఆజ్ఞా, విశుద్ధి, అనాహత, మణిపూర, స్వాధిష్టాన, మూలాధార చక్రాలను సమస్త నాడీ మండలాలనూ తడుపుతుంది. అంటే అమ్మవారు అనాహతంలో ఉండి ప్రజ్ఞావాక్భవ కూటముఖ పద్మాన్ని దాటి కామరాజకూట హృత్పద్మాన్ని చేరుతుంది. ఈ స్థితిని 'హృత్ పుండరీకం' అంటారు. ఈ హృత్ పుండరీక దహరాకాశంలోని మాతృక పంచమీ దేవతయే వారాహి. పరమాత్మ స్వరూపురాలైన లలితాపరమేశ్వరి నిలయం ఇదే. ఇంతటి అత్యంత పవిత్రమైన స్థానమే హృదయ ప్రదేశం.



- సి. విజయలక్ష్మీ రాజా

విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరం: ఎమ్మెల్యే

విజయక్రాంతి, ముషీరాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ పాటించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. గురువారం ముషీరాబాద్ నియోజకవర్గం రామ్ నగర్ లోని కాకతీయ హైస్కూల్‌లో క్రీడాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఠా గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఒక చదువుకే పరిమితం కాకుండా ఆటలు, క్రీడలతో రాణించాలని అలానే సామాజిక సేవ కార్య క్రమంలో పాల్గొనాలని కోరారు.

ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డుపై గుంతలు పూడ్చివేత

విజయక్రాంతి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం రోజున లక్షెట్టిపేటకు వెళ్లే బైపాస్ రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చిరు వ్యాపారస్తులు, స్థానిక ప్రజలు ట్రాఫిక్ ఎస్సై భావానీ సేన్‌కు తెలపడంతో ఈ విషయాన్ని ట్రాఫిక్ సిఐ రమేష్‌బాబుకు దృష్టికి తీసుకెళ్ళారు. ప్రజల కొరిక మేరకు ట్రాఫిక్ సిఐ ఆదేశాలతో ట్రాఫిక్ ఎస్సై భావానీ సేన్ రోడ్డుపై గుంతలను తానే స్వయానా తన సిబ్బందితో మొరంతో మరమ్మత్తులు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై భవానీ సేన్ మాట్లాడుతూ కమ్యూనిటి పోలిసింగ్‌లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకుంటామని అన్నారు. ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు, సమస్యలు ఎదురైన పోలీసు శాఖకు తెలియపరిస్తే సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి: కలెక్టర్

విజయక్రాంతి, మిర్యాలగూడ : ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల్లో పీఓ, ఏపీఓలు బాధ్యతగా వ్యవహరించాలని, ఓట్ల లెక్కింపు సమయంలో గుర్తుపై ఓటు ముద్ర సక్రమంగా ఉందో, లేదో చూసుకోవాలన్నారు. గుర్తుకు కాకుండా గీతలపై ఓటు గుర్తులుంటే వాటిపై అందరి సమక్షంలోనే నిర్ధారించాలన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికల సిబ్బంది ముందుగా పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లి ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. 2 గంటల నుంచి వార్డుల వారీగా ఓట్ల లెక్కింపు చేసి సర్పంచ్ ఎన్నిక ప్రకటించాలన్నారు. ఆ తర్వాత వార్డు మెంబర్లతో సమావేశమై ఉపసర్పంచ్‌ను ఎన్నుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో జగన్నాధరావు, తహసీల్దార్ కార్తీక్, సర్వేయర్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, ఎంపీడీఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ



విజయక్రాంతి,వనపర్తి: ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో విద్య నభ్యసిస్తున్న 8,9 తరగతుల విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్యాలను పెంపొందించేందుకు గాను కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్వేతామహంతి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా జిల్లాలోని 22 వేల మంది 8,9 తరగతుల విద్యార్థులకు ఫిబ్రవరి మొదటి వారంలో కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమే తెలిపారు. హైదరాబాద్ కు చెందిన డీజీ, టీటి సంస్థ ద్వారా శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. డీజీ సంస్థ 76 కేంద్రాల ద్వారా ఐదు కంప్యూటర్లతో శిక్షణ నిర్వహిస్తుండగా ఇందులో పని చేసే శిక్షకులు అందరిని ఆయా పాఠశాలలకు కేటాయించి విద్యార్థులకు శిక్షణ ఇప్పించనున్నారని ఆమే తెలిపారు. ఈశిక్షణ లో భాగంగా 14 సంవత్సరాలు పూర్తైన విదార్థులకు కేంద్ర ప్రభుత్వం తరుపున 3 వేల పారితోషకం తో పాటు సర్టిఫికట్ ఇవ్వడం జరుగుతుందని ఆమే చెప్పారు. ఈ శిక్షణలో భాగంగా కంప్యూటర్‌లో వర్డ్, ఎక్సేల్, ఇంటర్నెట్, మెయిల్, ఫైలింగ్ తదితరు అంశాలపై శిక్షణ ను ఇవ్వటం జరుగుతుందని ఆమే వివరించారు.ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని గ్రామం మొత్తం ఇంటర్‌నెట్ చేయడం జరుగుతుందని ఆమే వెల్లడించారు.

ప్రతి ఒక్కరు డ్రైవింగ్ నైపుణ్యం అలవర్చుకోవాలి

విజయక్రాంతి, మహబూబాబాద్: డ్రైవర్లు డ్రైవింగ్ నైపుణ్యాలు ప్రదర్శించాలని, ఒక డ్రైవర్ చేతిలో ఎన్నో ప్రాణాలు ఆధారపడి ఉన్నాయని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. గురువారం ఆర్‌టీసీ డీపో మేనేజర్ ఆధ్వర్యంలో రాష్ట్ర డ్రైవర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న కలెక్టర్ డ్రైవర్లకు గులాబీ పుష్పాలను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జాగ్రత్తగా డ్రైవర్లు వాహనాలను నడపాలని ర్యాలీ ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనన, మరణ గణాంకాలను సమీక్షిస్తే అధికంగా మరణాలు యాక్సిడెంట్ల వల్ల జరుగుతున్నాయని తెలిపారు.వీలైనన్ని ప్రమాదాలు తగ్గించేలా ప్రయత్నం చేస్తూ ప్రయాణీకులను సురక్షితంగా వారి గమ్యస్థా నాలకు చేర్చాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాస్‌పోర్టు అధికారి భద్రు నాయక్, డీఎస్‌పీ నరేష్ కుమార్, ఆర్‌టీసీ డీయం నాగేశ్వర్‌రావు, ఆర్‌టీసీ సిబ్బంది, ఇతర డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి క్వినోవా పంటలని ప్రోత్సహించాలి

విజయక్రాంతి, మహబూబ్‌నగర్:మహబూబ్‌నగర్ జిల్లాలో క్వినోవా పంటలను ఎక్కువగా వేయించి ప్రాసెసింగ్ యూనిట్స్ పెట్టించి ప్రాసెస్ చేయించి షాపింగ్ కాంట్రాక్టు కుదుర్చుకుని రైతులకు లబ్దిచేకూరే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ డి. రోనాల్డ్‌రోస్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలో ఆత్మ వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన గవర్నింగ్ బోర్డు మీటింగ్‌లఅట మాట్లాడుతూ సమగ్ర వ్యవసాయంలో భాగంగా చేపల పెంపకాన్ని ప్రోత్సహి ంచాలని, సరిపడ బడ్జెట్ ప్లాన్ తయారు చేసుకోవాలని అన్నారు. వచ్చే సంవత్సరం ఎక్కువగా చిరు దాన్యాలు పండించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దీనికి ఎంత ఖర్చు చేస్తున్నామని యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని, డెమన్స్ట్రేషన్ ప్రదర్శన క్షేత్రాలు శిక్షణ కార్యక్రమాలు, విజ్ఞాన యాత్రలు, పోలంబడి, శాస్త్రవేత్తలతో రైతులకు ముఖాముఖి చర్చలు ఏర్పాటు చేయాలని, అందుకు వ్యవసాయ అనుబంధ శాఖలు సహకరించాలని అన్నారు.

మిర్యాలగూడ ప్యాసెంజర్ నడికుడి వరకు పొడిగింపు

విజయక్రాంతి, హైదరాబాద్: కాచిగూడ – మిర్యాలగూడ – కాచిగూడ డెము ప్యాసెంజర్‌ను నడికుడి వరకు పొడిగించారు. దేశవ్యాప్తంగా రైళ్ల పొడిగింపు నిర్ణయంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఒకప్రకటనలో తెలిపింది. నడికుడి వరకు పొడిగింపుతో మార్గమధ్యలో కొండ్రపోల్, విష్ణుపురం, పొందుగుల స్టేషన్లలో ఆగుతుంది. అదే విదంగా సికింద్రాబాద్ – తాండూర్ మెము ప్యాసెంజర్‌ను చిట్టాపూర్ వరకు పొడిగించారు. దీనితో ఈ మార్గంలో రైలు మంతట్టి , నవంద్గి, కురుగుంట సెరమ్, మల్కైడ్ రోడ్ స్టేషన్లలో ఆగుతుంది.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



విజయక్రాంతి, మెహిదిపట్నం: బాలికా విద్యకు అధిక ప్రాముఖ్యతనిచ్చి ప్రోత్సహించాలని ఎంబిసి సంఘం రాష్ట్ర కన్వీనర్ గురజాల ప్రహ్లాద్ యాదవ్ కోరారు. గురువారం కార్వాన్‌లోని జఫర్‌గూడ ప్రభుత్వ ప్రాధమిక పాఠశాలో హ్యూమన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమానికి టప్పాచబుత్రా ఎ.స్ ఐ వెంకట్రాములు, ఎస్ఐ నర్సింహరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికా విద్య కోసం పాటుపడుతున్న హ్యూమన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అడికె మల్లికార్జున్‌ను, సంఘ సభ్యులను ప్రశంసించారు. అనంతరం పాఠశాల విధ్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

బస్టాండ్లలో మినీ థియేటర్లు

- 15 చోట్ల థియేటర్ల ఏర్పాటుకు చర్యలు
- ఏటా రూ. 3. 11 కోట్ల ఆదాయం అంచనా



విజయక్రాంతి, హైదరాబాద్: ఆదాయం సమకూర్చుకోవడంలో ఆర్టీసీ ఒక అడుగు ముందుకు వేసింది. ఇందులో భాగంగా పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న ఆర్టీసీ సంస్థ, మినీ థియేటర్లు ఏర్పాటు చేయడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయిన తర్వాత ఏపీలోని బస్టాండ్లలో మిని థియేటర్లు ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్న ఏపీఎస్‌ఆర్టీసీ.. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ప్రయోగాత్మకంగా మిని థియేటర్ ఏర్పాటు చేసింది. దీంతో తెలంగాణలో రద్దీగా ఉండే బస్టాండ్లలో మినీ థియేటర్లు ఏర్పాటు చేయాలని 2017లో నిర్ణయం తీసుకున్నారు.

ఇందులో భాగంగా రాష్ట్రంలోని 358 బస్టాండ్లలను పరిశీలించి.. ఎక్కడ ఏర్పాటు చేస్తే.. ఆదాయం వస్తుందన్న అంశంపై పరిశీలన జరిపారు. చివరకు 23 బస్టాండ్లలో మిని థియోటర్లు ఏర్పాటు చేయడానికి వాతావరణం అనువుగా ఉందని గుర్తించింది. తాము గుర్తించిన బస్టాండ్ల వివరాలను రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థకు అందించడంతో.. సంస్థకు చెందిన అధికారులు కూడా బస్టాండ్లను పరిశీలించారు. 23 బస్టాండ్లలో 15 చోట్ల థియేటర్లను ఏర్పాటు చేయడానికి చలన చిత్ర అభివృద్ధి సంస్థ ముందుకొచ్చిందని టీఎస్‌ఆర్టీసీ వైఎస్ చైర్మన్ సునీల్ శర్మ తెలిపారు.

మిని థియేటర్ల వల్ల ఏటా రూ. 3.11 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నామని చెప్పారు. ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వారికి వినోదం కల్పించడం ద్వారా ఆదాయం ఆర్జించేందుకుప్రణాళికను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.

థియేటర్ల నిర్మాణానికి గుర్తించిన బస్టాండ్లు

అదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కొల్లూరు, కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, ధర్మపురి, హుజూరాబాద్, సిరిసిల్ల, పెద్దపల్లి, జడ్జర్ల, షాద్‌నగర్, నర్సాపూర్, సంగారెడ్డి, నాగార్జున సాగర్, కోదాడ, ఆర్మూర్, బోధన్, చేవెళ్ల, తాండూర్, వికారాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ బస్టాండ్లలో మినీ థియేటర్ల నిర్మాణానికి అనువైన వాతావరణం కలిగినట్టు ఆర్టీసీ అధికారులు గుర్తించారు.

ఆటోలకు డిజిటల్ కార్డులు

విజయక్రాంతి, పటాన్‌చెరు: నేరాలకు అదుపు చేయడం, ప్రయాణికుల భద్రత కోసం పోలీసులు ఆటోలకు డిజిటల్ కార్డులను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ప్రయాణికులు కార్డులోని ఒక నంబర్‌ను గుర్తించుకుంటే చాలు డ్రైవర్ వివరాలు మొత్తం తెలుసుకోవచ్చు. కానీ ప్రస్తుతం కొన్ని ఆటోల్లో తప్ప మరి కొన్ని ఆటోల్లో డిజిటల్ కార్డులు కనిపించడం లేదు. గత ఏడాదిలో ఆటోలకు డిజిటలైజేషన్ కార్డులు ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో పెరుగుతున్న సంఖ్యను బట్టి వాటికి నంబర్లు ఇచ్చారు. దీంతో నేరం జరిగిన వెంటనే గుర్తించడానికి డిజిటలైజేషన్ కార్యక్రమం చేపట్టారు. పటాన్‌చెరు, రామచంద్రాపురం పట్టణం, మండలంలో వందల సంఖ్యలో ఉన్న ఆటోల గుర్తింపు చాలా కష్టంగా ఉంది. అయితే గత ఏడాది పోలీసులు ఆటోలకు డిజిటల్ కార్డులు అందించారు. ప్రస్తుతం కొన్ని ఆటోలలో కార్డులు ఉన్నాయి.

మరి కొన్ని ఆటోలలో వాటిని తొలగించారు. ప్రస్తుతం పట్టణాలలో కొంత వరకు ఆటోలకు కార్డులు కనిపించడం లేదు. కొన్ని సందర్భాలలో ఆటోలో వస్తువులు మరిచిపోవటం, రాత్రి వేళల్లో ప్రయాణం, ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు తప్పించుకుని వెళ్లిపోవడం సర్వసాధారణమైంది. ఆటో నడపటంలో ఆదాయం ఉండడంతో యువత వృత్తిగా ఎంచుకుంటున్నారు. దీంతో మార్కెట్‌లో ఆటోల సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. ఎదైన అవసరం కోసం ఆటోను గుర్తు పట్టాలంటే కష్టమే. ఇందు కోసం పోలీస్ అధికారులు ఆటో డిజిటలైజేషన్ కార్యక్రమం చేపట్టారు. దీన్ని డ్రైవర్లకు డిజిటలైజేషన్ పత్రాలు అందించారు. దీని ద్వారా డ్రైవర్లకు ప్రమాద భీమా లాంటి సౌకర్యాలు కూడా కల్పించారు. డిజిటలైజేషన్ పత్రంలో డ్రైవర్, యూనియన్ వివరాలు ఉంటాయి. అంతే కాక అత్యవసర సేవల నంబర్ల 100, 108 ఉమెన్ హెల్ప్‌లైన్ నంబర్ ఉంటాయి. ప్రయాణికులకు ఏదైన ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిస్తే వెంటనే ఆ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు. మహిళలు ఆటోలో వేధింపులకు గురైన, వస్తువులు మరిచిపోయిన ఆటో సీరియల్ నబర్ ద్వారా గుర్తించే వీలు ఉంటుంది. కానీ ప్రస్తుతం కొంత మంది ఆటో డ్రైవర్లు డిజిటల్ కార్డును పట్టించుకోవడం లేదు. డ్రైవర్లు డిజిటల్ కార్డులపై నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసులు పేర్కొంటున్నారు.

ఓబీసీ జాతీయ కమిటీ సభ్యుడిగా వన్నాల

విజయక్రాంతి, హైదరాబాద్: బీజేపీ అనుబంధ ఓబీసీ జాతీయ కమిటీ సభ్యుడిగా, కర్ణాటక ఓబీసీ ఇన్‌చార్జ్‌గా మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ కమిటీ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. తనను బాధ్యతలను అప్పగించినందుకు జాతీయ కమిటీకి శ్రీరాములు కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు.

రజక వృత్తి దారుల సంఘం 2019 క్యాలండర్ ఆవిష్కరణ



విజయక్రాంతి, ఉప్పల్: తెలంగాణ రజక వృత్తి దారుల సంఘం 2019 క్యాలండర్ ఉప్పల్ సిఐటియు కార్యాలయంలో ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మేడ్చల్ జిల్లా రజక వృత్తి దారుల సంఘం కార్యదర్శి జ్యోతి ఉపేందర్, జిల్లా అధ్యక్షులు ఆందే చక్రపాణిలు పాల్గొన్నారు. ఎన్నికల ముందు కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. 50 సవంత్సరాలు నిండిన ప్రతి రజక వృత్తిదారునికి 2000 రూ, పింఛన్ , రజకులకు డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించాలని, సొసైటీల రిజిస్ట్రేషన్‌లను బీసీ కార్పొరేషన్ ద్వారా చేయాలని, అదే విధంగా ఉప్పల్‌లో ఉన్న దోబీఘాట్‌లను అభివృద్ధి చేయాలనికోరారు. కార్యక్రమంలో పి.సారయ్య, సదానందం,వెంకన్న, సంతోష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రిబాగ్ వాసుల డ్రైనేజీ సమస్యలకు శ్వాశ్వత పరిష్కారం



విజయక్రాంతి, అంబర్‌పేట్: గోల్నాక డివిజన్ లోని ఖాద్రిబాగ్ బస్తీలో 14లక్షతో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కాలేరు పద్మావెంకటేష్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఖాద్రిబాగ్ వాసుల డ్రైనేజీ సమస్యలు శ్వాశతంగా పరిష్కారిచడం జరుగుతుందని తెలిపారు. అనంతరం స్థానిక బస్తీలలో ఎమ్మెల్యే, కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ జలమండలి అధికారులతో పాదయాత్ర చేసి స్థానికంగా ఉన్న సమస్య గుర్తించి వాటి పరిష్కారం దిశగా అధికారులకు పలు సూచనలు చేసారు. ముఖ్యంగా గత 5 సంవత్సరంల క్రితం వేసిన డ్రైనేజీ లేన్స్‌ను పూర్తిగా తొలగించి నూతన పైప్‌లైన్స్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయల్సిందిగా జలమండలి డీజీఎం సతీష్‌కు సూ చించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజ ర్ నీరాజ, అశ్వీక్, మల్లేష్, జీహెచ్‌ఎంసీ ఏఈ దివ్యతేజా, మనోహర్, విదిదీపాల ఏఈ హరిబాబు, లైన్ మమ్మాన్ విజయ్, జీహెచ్‌ఎంసీ పార్క్స్ సిందు శ్రీధర్, టీఆర్‌ఎస్ నాయకులు వార్డు సభ్యుడు జావేద్‌బాయి, రాజ్యలక్ష్మీ, నాయకులు జాహీర్, జాంగీర్, మోయిన్, ఉసుమన్, నర్సింగ్‌యాదవ్, బుచ్చిరెడ్డి, ఆర్.రాము, లింగంయాదవ్, కొమ్ము శ్రీనివాస్, దాడిగేజగన్‌యాదవ్, పి.సంతోష్‌యకుమార్, వినోద్, పాకా సంతోష్, జీహెచ్‌ఎంసీ ఎస్ఎఫ్ఏలు గోవింద్‌రాజ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి రమణీయం మేడిపల్లి శాంతి వనం

- ప్రకృతి ప్రేమికులను పరవశింపచేస్తున్న శాంతి వనం



విజయక్రాంతి, బోడుప్పల్:గ్రేటర్ హైదరాబాద్ ను అనుకోని వరంగల్ జాతీయ రహదారిపై ఉన్న మేడిపల్లి మండల కేంద్రంలోని ఆటవి ప్రాంతంలో ఏర్పాటు చేసిన శాంతి వనం పార్క్ పలువురికి ఆహ్లాదం ,ఆరోగ్యం పంచుతు అందరి మన్ననలు పోందుతుంది .తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం పెంపుతో పాటు,వాకర్స్ పార్కులను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మేడిపల్లి లోని సుమారు 135 ఎకరాలలో శాంతి వనం పేరిట పార్కును అందుబాటులోకి తీసుకువచ్చింది.

సుమారు ఏడాది క్రితం ప్రారంభం అయిన ఏర్పాట్లు చాలా చురుగ్గా కొనసాగి నిర్ణిత వ్యవది కాలంలో పూర్తి కావడంతో ప్రజలకు, ముఖ్యంగా వాకర్స్ కు , ప్రకృతి ప్రేమికులకు ఈ పార్కు ఎంత గానో ఉపయోగ పడుతుందని స్దానికులు చెబుతున్నారు. నిత్యం వేల మంది సందర్శకులు (వాకర్స్) వచ్చే విధంగా ఏర్పాట్లు ఉన్నాయని సంబంధిత ఆటవీశాఖ అధికారులు వివరించారు.. ఘట్కేసర్ మండలం నారాపల్లి లోనూ ఈ తరహా పార్కు(నందన వనం)ఆటవీ శాఖ రూపొందించడంతో అక్కడి వాకర్స్‌కు ఎంతగానో ఉపయోగపడుతున్న నేపథ్యంలో అదే తరహాలో చెంగిచెర్ల వెళ్లే దారిలో ఉన్న మేడిపల్లి ఆటవీ ప్రాంతోలనూ సందర్శకులకు అన్ని సౌకర్యాలు కల్పించి ఆహ్లాదం , ఆరోగ్యం, వ్యాయామం పంచేందుకు ఇక్కడి ప్రజలకు కూడా అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు పేర్కోన్నారు.

శాంతి వనంలో ప్రత్యేకతలు

గత ఏడాది అప్పటి ఆటవీ శాఖ మంత్రి జోగు రామన్న చేతుల మీదుగా ప్రారంభం అయిన శాంతి వనం పార్కులో సందర్శకులు ఆహ్లాదం కోసం పలు ఏర్పాట్లు చేశారు..

పార్కులోకి ప్రవేశించి ద్వారం ఆటవీ ప్రాంతంలోకి వెళ్తున్నట్లు అనుభూతి కలిగేలా చెట్ల మొదళ్లు స్వాగతం పలుకుతున్నాయి. .అలసి పోయిన సందర్శకులు సేదతిరేందుకు కాటేజీలు ,పలు చోట్ల బల్లలు ఏర్పాటు చేశారు...పార్కులో వాటర్ ఫౌంటేన్ , వర్షపు నీటిని వడసి పట్టేందుకు పలు చోట్ల కందకాలు తవ్వారు. అంతేకాకుండా సుమారు 3 కీలో మీటర్ల వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తు ఇరు పక్కలా చల్లని నిడను ఇచ్చే చెట్లు పచ్చగడ్డితో పచ్చిక బయళ్లతో తయారు చేసారు.

సందర్శకులకు సంజీవిని వంటిది

ఈ తరహా పార్కుల వలన వాతవరణ సమతుల్యతను పెంపోందించడంతో పాటు, నగర శివార ప్రాంతాల్లోని అభయ ఆరణ్యాలను అభివృద్ధి పరిచి వాకర్స్‌కు, సందర్శకులకు అరోగ్యం,ఆహ్లాదం చేకుర్చేలా చర్యలు తీసుకోవడం హర్షణీయం. వాకర్స్‌కు ఇది సంజీవినిలా ప్రాణశక్తిని అందిస్తుంది.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యాలపై సమీక్ష



విజయక్రాంతి, ముషీరాబాద్: హైదరాబాద్ హిమాయత్ నగర్ తిరుమల తిరుపతి దేవస్థానం నాలుగవ సలహా మండలి సమావేశం గురువారం ఆలయ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి సలహా మండలి చైర్మన్ అశోక్ రెడ్డి, సలహా మండలి స భ్యులు విజయా రాజాం, ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి జగన్మోహన్ చార్యులు, సలహా మండలి సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇక్కడి శ్రీ వెంకటే శ్వర స్వామి దేవాలయానికి వస్తున్న భక్తులను దృష్టిలో ఉంచుకొని ఆలయాభివృద్ధి, ఏర్పాట్లు విషయాలపై సలహాలు సూచనలు చేశారు. ఆలయ అభివృద్ధి కోసం సమావేశంలో పలు నిర్ణయం తీసుకోవడం జరిగిందని సలహా మండలి సభ్యులు తెలిపారు.

బ్యాలెట్‌తో ఎన్నికలు నిర్వహించాలి



విజయక్రాంతి, హైదరాబాద్: వచ్చే ఎన్నికలను బ్యాలెట్‌తో నిర్వహించాలని టీపీసీసీ అధ్యక్షుడు కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించడంలో ఎన్నికల సంఘం విఫలమైందన్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్‌లో అనుమానం ఉన్న చోట వీవీప్యాట్‌లను లెక్కించినప్పటికీ తెలంగాణలో మాత్రం లెక్కించేందుకు నిరాకరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టులో ఓట్లను సవరిస్తామని మాట తప్పిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్ కుమార్‌ను తప్పించాలన్నారు. కార్యక్రమంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, కాంగ్రెస్ నాయకులు డి.కె.అరుణ, మర్రి శశిధర్‌రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని అప్పుల పాలు చేసిన మోడీ:గూడూరు



విజయక్రాంతి, హైదరాబాద్: గత నాలుగున్నర సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ అనుసరిస్తున్న తప్పుడు ఆర్థిక విధానాల కారణంగా దేశం అప్పుల పాలైందని టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో, 2014 జూన్ నాటికి రూ.54,90,763 నుంచి 2018 సెప్టెంబర్ నాటికి రూ.82,03,253 కోట్లకు లోటు పెరిగిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రోజుకు సరాసరిగా రూ.1707 కోట్ల చొప్పున మొత్తంగా నరేంద్రమోడీ రూ.28,92.171 కోట్ల అప్పులు తెచ్చారన్నారు. దేశాన్ని అప్పులు పాలు చేసిన మోడీ అభివృద్ధిని మాత్రం పట్టించుకోలేదన్నారు.

ఓటరు నమోదు ప్రతి ఒక్కరి భాధ్యత



- ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

విజయక్రాంతి, ఉప్పల్: ఏఎస్ రావు నగర్ టీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా స్థానిక ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పాల్గొని నూతన ఓటర్ల కు ఓటరు నమోదు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం జమ్మిగడ్డలోని షేర్ మణిమ్మ నివాసం వద్ద జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 18 సవంత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. . వచ్చే ఎన్నికల్లో మంచి నాయకుడిని ఎన్నుకొనే భాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరుకు ఓటు నమోదు చేసుకోవచ్చుని ఓటు లేని వారందరూ సకాలంలో వచ్చి ఓటు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బేతాళ బాలరాజు,షేర్ మనెమ్మ, డివిజన్ అధ్యక్షులు కొండూరి మురళీధర్‌రావు, లక్ష్మీనారాయణ, సీతాంరాంరెడ్డి, మల్క రమాదేవి, సింగారం శ్రీనివాస్, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

హబ్సీగూడ డివిజన్ పరిదిలోని రామ్‌రెడ్డి నగర్, పటేల్ నగర్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ పెండింగ్ పనులను ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి , స్థానిక కార్పొరేటర్ బేతి స్వప్నారెడ్డి జీహెచ్‌ఎమ్‌సీ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం డ్రైనేజీ, రోడ్లు, వాటర్ సమస్యలు పై అధికారులతో చర్చించారు. కాలనీలలో పలు సమస్యలును సత్వరమే పరిష్కరించి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎమ్‌సీ ఇఇ.రాజయ్య, డిఇ. నికిల్‌రెడ్డి, వర్క్స్ ఇనస్పెక్టర్ రఘు, వాటర్ వర్క్ ఇనస్పెక్టర్ కిషన్, కుమారస్వామి, కె.సుధాకర్, వార్డు మెంబర్ నందికంటి శివ, శ్రీధర్, వినీష్‌రెడ్డి తదితతరులు పాల్గొన్నారు.



బీజేపీ నేత కిషన్‌రెడ్డిపై అసత్యపు ఆరోపణలు చేశారంటూ ఆరోపిస్తూ కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబాల్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సిటీ బీజేపీ కార్యకర్తలు.

రియల్ ఎస్టేట్

శివరాంపల్లి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో
అక్రమ నిర్మాణాల కూల్చివేత

విజయక్రాంతి, రాజేంద్రనగర్: శివరాంపల్లి ఊరచెరువులో ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలిసిన అక్రమ నిర్మాణాలను రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నగరానికి చెందిన ఓ రియల్ వ్యాపారి గత కొంత కాలంగా చెరువులోని ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే కొంత స్థలంతో పాటు మరికొంత పట్టాభూమిని కొనుగోలు చేశాడు. అనంతరం ఆయా స్థలంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతిలేకుండా భవనాలను నిర్మించాడు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు పలుమార్లు ఆయా యజమానికి నోటీసులు అందజేశారు. అయినా ఆయా యజమాని అక్రమ నిర్మాణలను ఆపకుండా ఆలాగే నిర్మించాడు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రవహరీ నిర్మించడంతో అధికారులు బుధవారం జేసీబీల సహాయంతో ప్రహారీ, అక్రమ భవనాలను కూల్చివేశారు. ఈ చెరువు అభివద్ధికి ప్రభుత్వం గత రెండేళ్ల క్రితం ఊరచెరువు సుందరీకరణ కోసం సుమారు కోటీ రూపాయలు మంజూరు చేశారు. అయితే కొందరు చెరువు భాగంలో పట్టాభూమి ఉందని,చెరువుల సుందరీకరణ పనులు పూర్తి కాలేదు. ఎట్టకేలకు అధికారులు ఒకవైపు చెరువుకు కంచెను ఏర్పాటు చేశారు. అయితే మరోవైపు ఎలాంటి కంచెను ఏర్పాటు చేయకపోవడంతో ఎఫ్‌టీఎల్ పరిధిలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి అక్రమ నిర్మాణాలను చేపట్టడంతో అధికారులు ఎట్టకేలకు కూల్చివేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలను చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారి బాలానందస్వామి తెలిపారు.

విశ్వనగరం దిశగా జీహెచ్‌ఎంసీ

కొనసాగుతున్న భారీ ప్రాజెక్టులు







బర్ల శ్రీనివాస్

విజయక్రాంతి, హైదరాబాద్: కేంద్ర విద్యుత్ శాఖ అనుబంధ సంస్థ అయిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును చేపట్టారు.

విద్యుత్ ఆదా : ప్రస్తుతం వీధిలైట్ల నిర్వహణకు ఏటా రూ. 252.89 కోట్లు ఖర్చవుతుండగా ఎల్.ఇ.డి లైట్ల ఏర్పాటుతో ఈ ఖర్చు విద్యుత్ చార్జీల రూపంలో రూ. 101.14 కోట్లు ఆదా అవుతున్నది. ఏటా 35.30 మెగా వాట్ల విద్యుత్ వినియోగం తగ్గింది. జీహెచ్‌ఎంసీపై ఎటువంటి భారం లేకుండా మిగులు విద్యుత్ ద్వారా అయ్యే ఆదాతోనే ఈఈఎస్ఎల్కు వాయిదాల రూపంలో సొమ్ము చెల్లిస్తున్నది. ఈ ప్రాజెక్టు భాగంగా 18,35,70,110,190 వాట్స్ సామర్థ్యం గల లైట్లు అమర్చారు. ఎల్.ఇ.డితో ఏటా 1,13,375 టన్నుల కార్బన్ డయాక్సైడ్ విడుదల తగ్గుతుంది. దేశంలోని ప్రధాన నగరాల్లో ఇంత పెద్ద ఎత్తున ఎల్.ఇ.డి ప్రాజెక్టును చేపట్టిన మొదటి కార్పొరేషన్గా జీహెచ్‌ఎంసీ చరిత్ర సృష్టించింది. దక్షిణ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్లో అత్యధికంగా రెండు లక్షల ఎల్.ఇ.డి లైట్లను అమర్చగా, విశాఖపట్నంలో లక్ష ఎల్.ఇ.డి లైట్లను అమర్చారు. ఈ రెండు కార్పొరేషన్లలో ఎల్.ఇ.డి ఏర్పాటుకు ఏడాది పట్టగా, హైదరాబాద్లో మాత్రం ఆరు నెలల్లో దాదాపు పూర్తిచేశారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో అగ్రస్థానం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్లో భాగంగా జీహెచ్‌ఎంసీ సాంకేతికతను ఉపయోగించడం ద్వారా ఇతర శాఖల కన్నా ముందంజలో ఉంది. ఈఆఫీస్ నిర్వహణ,టౌన్ ప్లా నింగ్ విభాగంలో ఆన్లైన్ పద్ధతిలో భవన నిర్మాణ అనుమతులు, వాహనాలకు జీఐఎస్ మ్యాపింగ్, రికార్డుల డిజిటలైజేషన్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల మంజూరు, మైజీహెచ్‌ఎంసీ యాప్ ద్వారా సమస్యల సత్వర పరిష్కారం, స్వచ్ఛదూత్, మస్కిటోయాప్ ద్వారా స్వచ్ఛ కార్యక్రమాలపై ప్రజల్లో చైతన్యం తేవడం ద్వారా జీహెచ్‌ఎంసీ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో ముందంజలో ఉంది.

ఆన్‌లైన్‌లో టౌన్‌ప్లానింగ్ విభాగం: నగరంలో భవన నిర్మాణ రంగంలో మరింత పారదర్శకత తేవడంతో పాటు అవినీతిని తగ్గించడం, వేగంగా సర్వీసులను అందించడానికి మొత్తం టౌన్ ప్లా నింగ్ విభాగంలో అన్ని సేవలను ఆన్లైన్ ద్వారా అందించడం ద్వారా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడానికి కీలక పాత్ర వహించింది. డి.పి.ఎం.ఎస్ విధానం ద్వారా భవన నిర్మాణ అనుమతులు, ఓసిలు జారీచేయడం,



(ఫైల్ ఫొటో)

బహుళ అంతస్తులు, కమర్షియల్ భవన నిర్మాణాలకు కూడా ఆన్లైన్ విధానం ద్వారానే అనుమతులు అందిండచం ద్వారా టౌన్ప్లానింగ్ ఆధునిక, సాంకేతికతను పూర్తిస్థాయిలో అందిపుచ్చుకుంది.

టౌన్ ప్లా నింగ్ విభాగం : 2018 సంవత్సరంలో 14,415 భవన నిర్మాణ అనుమతులను, 1557 ఆక్యుపెన్సీ సర్టిఫికేట్లను టౌన్ప్లానింగ్ విభాగం జారీచేసింది. 2018 జనవరి నుండి డిసెంబర్ వరకు భవన నిర్మాణ అనుమతులు మంజూరి ద్వారా రూ. 765.70 కోట్లు జీహెచ్‌ఎంసీకి లభించాయి. 2018లో 138 ఆస్తులకు టి.డి.ఆర్ సర్టిఫికేట్లను జారీచేయడం జరిగింది. 2014సంవత్సరం నుండి ఈఆ ఫీస్ను అమలు చేయడంతో పాటు నాలుగు లక్షలకుపైగా రికార్డులను స్కానింగ్, డిజిటలైజ్ చేయడంలో టౌన్ప్లానింగ్ విభాగం విజయం సాధించింది. 2016లో డెవలప్మెంట్ పర్మీషన్ మేనేజ్మెంట్ సిస్టమ్ (డిపిఎంఎస్) విధానాన్ని ప్రవేశపెట్టి జూన్ 2వ తేదీ నుండి భవన నిర్మాణ అనుమతులు ఆన్లైన్ విధానం ద్వారా జారీచేస్తోంది. పూణె మున్సిపాలిటీ అనంతరం జీహెచ్‌ఎంసీ వంద శాతం ఆన్లైన్ విధానం ద్వారా భవన నిర్మాణ అనుమతులను జారీచేసే కార్పొరేషన్ గా గుర్తింపు పొందింది. గతంలో ఒక భవన నిర్మాణ అనుమతికి 50 నుండి 55రోజుల కనీస సమయం పట్టగా డిపిఎంఎస్ ప్రవేశపెట్టిన అనంతరం కేవలం 22నుండి 27రోజుల్లోనే అనుమతి మంజూరు చేయడం జరుగుతుంది. అదేవిధంగా ఆక్యుపెన్సి సర్టిఫికెట్ను కేవలం 10 నుండి 12రోజుల్లోనే జారీచేయడం జరుగుతుంది. గ్రేటర్ హైదరాబాద్లో అక్రమ నిర్మాణాలకు సంబంధించి కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి త్వరలో టౌన్ ప్లా నింగ్ బిల్డింగ్ ట్రిబ్యునల్ అందుబాటులోకి రానుంది.

రూ. 230కోట్ల వ్యయంతో నాలాల విస్తరణ : అక్రమ నిర్మాణాలు, దురాక్రమణలకు గురైన నాలాల విస్తరణ ద్వారా వర్షపునీరు సులువుగా వెళ్లడానికిగాను అడ్డంకిగా ఉన్న వివిధ నాలాల్లోని 47 సమస్యాత్మక ప్రాంతాలలో రూ. 230కోట్ల వ్యయంతో నాలాల విస్తరణ చేపట్టే పనులు ముమ్మరంగా సాగుతోంది. దీనికి తోడుగా మరో 62కోట్ల రూపాయల వ్యయంతో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల గుర్తించిన మరో 13 ప్రధాన సమస్యాత్మక ప్రాంతాల్లో నాలాల విస్తరణ పనులు చేపట్టనున్నారు. మిగిలిన నాలాల విస్తరణను దశలవారిగా చేపట్టాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది.

చార్మినార్ పాదాచారుల ప్రాజెక్ట్: చార్మినార్ను మరింత పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి రూ. 35.10కోట్లతో చేపట్టిన చార్మినార్ ఫెడెస్ట్రేరియన్ ప్రాజెక్టు భాగంగా 5.40కిలోమీటర్ల ఔటర్ రింగ్రోడ్ నిర్మాణ పనులను చేపట్టగా 4.82కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తి అయింది. 2.3కిలోమీటర్ల ఇన్నర్ రింగ్రోడ్ కూడా పూర్తి చేయడం జరిగింది. చారిత్రక ప్రాధాన్యం ఉన్న చార్ కమాన్ల అభివృద్ధిని కూడా చేపట్టింది. అమృత్సర్ స్వర్ణ దేవాలయం పరిసర ప్రాంతాల్లో చేపట్టిన విధంగా చార్మినార్ పరిసర ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ ఐకాన్లో భాగంగా చార్మినార్ పరిసర ప్రాంతాల్లో అభివృద్ధికి సీఎస్ఆర్ కింద ఎన్.టి.పి.సి నిధులను అందజేయనున్నది.

రూ. 43.63కోట్లతో 117 జంక్షన్ల అభివృద్ధి: హైదరాబాద్ నగరంలో మెరుగైన ట్రాఫిక్ వ్యవస్థ నిర్వహణకు మొదటి దశలో 35జంక్షన్ల అభివృద్ధి, రెండవ దశలో మరో 30జంక్షన్ల అభివృద్ధిని చేపట్టడం జరిగింది. వచ్చే ఏడు సంవత్సరాలకు ఉండే ట్రాఫిక్ను పరిగణలోకి తీసుకొని ఈ జంక్షన్ల అభివృద్ధి చేపట్టడం జరిగింది.

ఎల్.ఇ.డి లైట్ ప్రాజెక్ట్: గ్రేటర్ హైదరాబాద్లో ఉన్న 4.54లక్షల సాంప్రదాయక వీధి దీపాల స్థానంలో ఎల్.ఇ.డి లైట్లను అమర్చే అతి పెద్ద ప్రక్రియను జీహెచ్‌ఎంసీ ప్రారంభించింది. ఇంత పెద్ద స్థాయిలో ఎల్.ఇ.డి లైట్ల మార్పిడి చేపట్టిన కార్పొరేషన్గా జీహెచ్‌ఎంసీ ప్రత్యేకత సాధించింది. ఎల్.ఇ.డి లైట్ల మార్పిడి ద్వారా సంవత్సరానికి 162.15 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఆదా అవడంతో పాటు రూ. 115.13 కోట్లు జీహెచ్‌ఎంసీకి మిగులు కానుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తి అయితే సంవత్సరానికి 1,29,719 టన్నుల కార్బన్‌డైఆక్సైడ్ వాయువు విడుదల కూడా తగ్గనుంది.

40మోడల్ మార్కెట్ల నిర్మాణం : కోటికిపైగా జనాభా కలిగిన హైదరాబాద్ నగరంలో తగు సంఖ్యలో వ్యవసాయ మార్కెట్లను ఏర్పాటు చేయడానికి జీహెచ్‌ఎంపీ భారీ ప్రణాళిక రూపొందించింది.

(ఇంకావుంది)



రియల్‌కు సిరుల పంటే

విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్రంలో రియల్ రంగానికి సిరుల పంటేనని ఆ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కొత్తగా ఒక ప్రాజెక్టు వస్తుందంటే అందరి దృష్టి అటువైపే ఉంటుంది. ఇందుకు కారణం లేకపోలేదు. రియల్ రంగం వృద్ధికి ఈ ప్రాజెక్టులే ఇంధనం. అది ప్రభుత్వ లేదా ప్రైవేటు కావొచ్చు. అన్ని మలిక వసతుల ప్రాజెక్టులు రియల్ రంగంపైనే ఆధారపడి ఉంటుంది. కొన్నిసార్లు కృత్రిమంగా డిమాండ్ ఉంటుంది. కానీ అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తుంటారు. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొలువుదీరింది. గతంలో కంటే అభివృద్ధికి సంబంధించి పలు ప్రాజెక్టులు తెరపైకి తేవడంతో పాటుట ఈ ఐదేళ్లలో పూర్తిచేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. మౌళిక వసతుల సదుపాయాల ప్రాజెక్టులకు పెద్ద పీఠ వేయడం ద్వారా మధ్య తరగతి ప్రజానీకానికి సొంతింటి కల నేరవేరుతుంది. గతంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రకటన మొదలైనప్పుడు భూముల ధరలు ఆకాశాన్ని ఎగబాకిన విషయం తెలిసిందే. గతంలో కంటే ప్రస్తుతం ప్రయాణ రాకపోకలు పెరగడంతో వాణిజ్య సంస్థలకు బాగా డిమాండ్ పెరిగింది. చుట్టు పక్కల ఉన్న ఫాంహౌజ్‌లు ఉపాధి కేంద్రాలుగా మారిపోయాయి. మెట్రోరైలు పట్టాలెక్కడంతో రెండో దశ మెట్రో ప్రకటించడంతో రియల్ రంగం మరింత ఊపందుకున్నది. ఔటర్ రింగు రోడ్డు చుట్టు పక్కలా కూడా చాలా డిమాండ్ ఉంటుంది. విద్యా సంస్థలు, పలు అంతర్జాతీయ సంస్థలు వచ్చే అవకాశం ఉంది. రాబోయే ఐదేళ్లల్లో జీహెచ్‌ఎంసీ పరిధిలో రియల్ తిరుగులేదని నిపుణులు వెల్లడిస్తున్నారు. దీంతో భూముల ధరలు పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నట్లు అర్థమౌతుంది.



సంగారెడ్డిలో జోరందుకున్న రియల్ భూమ్

విజయక్రాంతి, సంగారెడ్డి: బాగ్యనగరానికి అతి సమీపాన ఉన్న సంగారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు పరిసర గ్రామాలలో రియలెస్టేట్ జోరందుకుంది. ప్రధానంగా ఈ కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులు వారి సొంత ఇంటి కల నెరవేర్చుకునేందుకు జిల్లా కేంద్రం సమీపాన ఉన్న పల్లెల్లో నిర్మిస్తున్న నూతన గృహాలు, వివిధ పేర్లతో ఏర్పాటు చేసిన వెంచర్లలలో వెలుస్తున్న అత్యాధునిక గృహనిర్మాణాలు ఆకర్శితులై కార్మికులు, ఉద్యోగులు అటువైపు మొగ్గుచూపుతున్నట్లు నిర్మాణ సంస్థ యజమానులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా నగర శివారు ప్రాంతంతో పోల్చుకుంటే ఇక్కడ ప్రశాంతమైన వాతావరణం, పల్లె సీమలు, పాడి పంటలు పచ్చటి పొలాల మధ్యలో నిర్మాణాలు జరుపుతుంటే ఒకవైపు ఆనందం మరోవైపు అనువైన వాతావరణానికి ఈ ప్రాంతం ఎంతో అనువైనదిగా భావించి చిన్నా, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు సొందింటి కలను సాకారం చేసుకునేందుకు బిల్‌డర్ర్లు నిర్మించే గృహ సముదాయాలపై ఆసక్తి కనబరుస్తున్నట్లు రియల్ వ్యాపారులు తెలిపారు.

ప్రధానంగా అనేక ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన వాణిజ్య బ్యాంకులు ఇంటి కొనుగోలు, నిర్మాణం కొరకు లోన్లు ఇచ్చేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయడంతో మధ్య, పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు కూడా బ్యాంకులు ఇచ్చే లోన్ల ద్వారా ఇళ్ల కొనుగోలుకు సంసిద్ధం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకనగా వారు చేసే పనిలో కొంత బాగాన్ని ఇంటి నిర్మాణం కొరకు ప్రణాళిక బద్ధకంగా వారు ముందుకు వెలుతున్నారు. రానున్న రోజుల్లో సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో ప్రాంతీయ భాహ్య వలయా రహదారి ఏర్పాటు కానుందన్నున ఈ ప్రాంతానికి డిమాండ్ మరింత పెరిగింది.

హైదరాబాద్ నగరంలో..
గోదాములకు భారీ డిమాండ్

- నగరం వైపు ఉత్పత్తి పరిశ్రమల చూపు
- లీజులు, అద్దెలలో వృద్ధి

ముట్నూరు.రామకృష్ణ

హైదరాబాద్: దేశంలో ఒకే పన్ను విధానంఅమలు చేయడం ద్వారా గోదాముల నిర్మాణానికి భారీ డిమాండ్ ఏర్పడుతోంది.దేశంలోని అనేక ఉత్పత్తిరంగ పరిశ్రమలు తమ శాఖలను విస్తరించటానికి హైదరాబాద్ నగరానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. దింతో హైద్రాబాద్ చుట్టుపక్కల వివిధ ఉత్పత్తులను నిల్వ చేసుకోవటానికి గోదాములను లీజుకు తీసుకోవటానికి ప్రముఖ కంపెనీలు ముందుకు వస్తున్నాయి.ఒకే దేశం ఒకే పన్ను పేరుతో అమల్లోకి తీసుకొచ్చిన వస్తు సేవల పన్ను(జీఎస్టీ) గృహ కొనుగోలుదారులకు తీవ్ర భారంగా మారినా, గోదాముల నిర్మాణానికి కలిసి వచ్చింది. నగరంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెట్రో నగరాలు, ఇతర పట్టణాల్లో గోదాముల నిర్మాణంలో ఊపు వచ్చింది. గత ఏడాది తొలి అర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది తొలి అర్ధభాగంలో గోదాముల లీజింగ్ హైదరాబాద్లో 25 శాతం పెరిగిందని లాజిస్టిక్స్ మార్కెట్' వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్లో ఇళ్లు, కార్యాలయాలు, వాణిజ్య భవనాలు, మాల్స్, ఈకామర్స్, ఫర్నీచర్, రిటైల్, సంస్థలు, ఉత్పత్తి రంగాల విస్తరణ ప్రణాళికతో గోదాముల నిర్మాణం కీలకంగా మారింది. జీఎస్టీతో వీటి నిర్మాణాలకు డిమాండ్ పెరిగింది. ఇప్పటికే నగర శివారులో పెద్దఎత్తున గోదాముల నిర్మాణం పూర్తి కాగా కొంపల్లి, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, నానక్రాంగూడ, నార్సింగి ,తదితర ప్రాంతాలలో శరవేగంగా కొనసాగుతున్నాయి. 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్తగాగోదాములు నిర్మాణాలు వచ్చాయి. ఫ్యూచర్



గ్రూపు 1,30,000 చదరపు అడుగులు, డెలివరీ ఎక్స్ప్రెస్ 1,14,000చ.అ. కండ్లకోయలో లీజుకు తీసుకున్నాయి. యూపీఎల్ సీడ్స్ 1,10,000 చ.అ. కిష్టాపూరులో తీసుకుంది.హైదరాబాద్ ఉత్తర ప్రాంతంలోనే 90 శాతం లావాదేవీలు జరిగగా, వీటిలో 38 శాతం వాటా థర్డ్ పార్టీ సంస్థలది కాగా, ఎఫ్ఎంసీజీ సంస్థలు 18 శాతం, మిగతావి రిటైల్ సంస్థలు తీసుకున్నాయి. అద్దెల్లోనూ 4 శాతం వృద్ధి నమోదుకాగా, మిగతా ప్రాంతాల్లో స్థిరంగానే ఉన్నాయి. ఆదిభట్లలో 22 ఎకరాల విస్తీర్ణంలో అంకాన్ గ్రూపు లాజిస్టిక్ హబ్ నిర్మిస్తోంది.అద్దెల్లోనూ 4 శాతం వృద్ధి నమో మిగతా ప్రాంతాల్లో స్థిరంగానే ఉన్నాయి.నగరంలోపశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లో ఈకామర్స్, ఎఫ్ఎంసీజీ సంస్థలు తమ గోదాముల ఏర్పాటుకు మొగ్గుచూపుతున్నాయి. నెలకు చదరపు అడుగు లీజు ఉత్తర ప్రాంతంలో రూ.9.5 నుంచి రూ.15 మధ్యలో ఉంది. పశ్చిమ ప్రాంతంలో రూ.812 మధ్య, తూర్పు ప్రాంతంలో రూ.1620, దక్షిణం వైపు రూ.1113 మధ్య ఉన్నాయి.

దేశవ్యాప్తంగా చూస్తే..

ఏడాది తొలి భాగంలో కోటి చదరపు అడుగుల నిర్మాణాలను అద్దెకు తీసుకున్నారు. నగరాలవారీగా చూస్తే బెంగళూరు (25%), దిల్లీ (21%), ముంబయి (20%) రవాణారంగంలో ముందు వరసలో ఉన్నాయి. దక్షిణాదిలో చెన్నై(12%) తర్వాత హైదరాబాద్ ఉంది.

కోల్కతా (8%), పుణె (3%), అహ్మదాబాద్(1%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. రంగాలవారీగా చూస్తే ఈకామర్స్ (30%)దే అగ్రపథం. థర్డ్పార్టీ సంస్థలు (27%), రిటైల్(14%), ఇంజినీరింగ్, ఉత్పత్తిరంగం (8%), ఎలక్ట్రానిక్స్ (6%), ఎఫ్ఎంసీజీ (5%) వాటా అక్రమించాయి. ఇతరత్రా 10 శాతం ఉన్నాయి.సగటు లీజు ఒప్పందం గత ఏడాది తొలి అర్ధసంవత్సరంలో 75వేల చదరపు అడుగులు కాగా ఈసారి 90వేలకు పెరుగుతున్నాయి. ఈ తొలి భాగంలో పెద్ద ఒప్పందాలు జరిగాయి. బెంగళూరులో ఫ్లిప్కార్ట్ 3,90,000 చదరపు అడుగులు, డీమార్ట్ 3,00,000 చ.అ. ముంబయిలో, యూసెన్ లాజిస్టిక్స్ 2,50,000 చ.అ. ఒప్పందాలు జరిగాయి. పుణె, దిల్లీలో లావాదేవీలు ఆసక్తికరంగా ఉన్నాయి. ఎల్జీ, హైర్ సంస్థలు ఇక్కడ 2 లక్షలు, 2.56 లక్షల చ.అ. లీజుకు తీసుకున్నాయి.

నిర్మాణ ఆలస్యానికి..
10 శాతం వడ్డీ చెల్లించాలి

- మహారెరా ఆదేశాలు

విజయక్రాంతి, హైదరాబాద్: రెరా అమలులో దేశానికి ఆదర్శంగా ఉన్న 'మహారెరా' నిర్మాణ సంస్థ లోపాలపై కొరడా ఝులిపిస్తోంది. నిర్మాణంలో ఆలస్యం చేస్తే సంబంధిత బిల్డర్లు కొనుగోలు దారులకు 10శాతం వడ్డీ చెల్లించాలని మహారెరా ఆదేశాలను జారీచేసింది. గడువులోపు ప్రాజెక్ట్ పూర్తి చేసి అప్పగించక పోవడంతో మహారాష్ట్రలోని రన్వాల్ కన్‌స్ట్రక్షన్స్ కొనుగోలుదారులు రెరాను ఆశ్రయించారు. 2014 నుంచి 10.05 శాతం వడ్డీని చెల్లించాలని ప్రాజెక్టులను 18 నెలల్లో పూర్తి చేయాలని మహారాష్ట్ర రియల్ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆదేశించింది. బాంబే హైకోర్టులో బిల్డర్ అప్పీల్ చేసుకునేందుకు డిసెంబరు 5 వరకు తీర్పును నిలుపుదల చేసింది. ముంబాయిలోని ములుండ్ పారిశ్రామికవాడ స్థలంలో రీ డెవలప్‌మెంట్‌లో భాగంగా సదరు నిర్మాణ సంస్థ 2005లో గృహ నిర్మాణ ప్రాజెక్టులను చేపట్టింది. అయిదు భవనాలు నిర్మించి ఇస్తామని 21 మంది కొనుగోలుదారుల నుంచి ఒప్పందం చేసుకుంది. 2006–07 సంవత్సరంలోనే ఒక్కొక్కరి నుంచి రూ.2030 లక్షలు తీసుకుంది. 2008–09 నాటికి ప్లాట్లు అందించాలనేది ఒప్పందం చేసుకున్నది. నిర్మాణదారులకు గడువులోపు ఇల్లు నిర్మించలేదు. దీంతో కోర్టు కేసులతో కాలం వెళ్లదీశాడు. దీనిపై కొనుగోలుదారులు మహారెరాను ఆశ్రయించారు.

హైదరాబాద్ నగరంలో పలువురు బిల్డర్లు నిర్మాణ పరంగా జాప్యాలు, లోపాలతో కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. ఫిర్యాదు చేసేందుకు కొద్దిరోజులు ఆగాల్సిందేనని, ప్రస్తుతం రెరాలో ప్రాజెక్టుల నమోదుకు మూడు నెలల గడువు ఇచ్చింది. ఈ గడువు ఈ నెలాఖరుకు ఉంది. ఇప్పటికే కొన్ని సంస్థలు నమోదు చేసుకోగా చివరి వారంలో ఎక్కువ సంస్థలు తమ ప్రాజెక్టును రిజిస్టర్ చేసుకునే అవకాశం ఉంది. గడువు పొడిగించాలని స్థిరాస్తి సంఘాలు ఇప్పటికే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



రియల్ పెట్టుబడులకు విదేశీయుల ఆసక్తి

- ప్రాజెక్టుల్లో ఈక్విటీ పెట్టుబడులు
- ముంబయి తర్వాత హైదరాబాద్‌లోనే ఎక్కువ
- 793 మిలియన్ డాలర్ల పెట్టుబడులు

విజయక్రాంతి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో నిర్మిస్తున్న రియల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ సంస్థాగత మదుపరులు ముందుకొస్తున్నారు. దేశంలో స్థిరాస్తి నియంత్రణ, అభివృద్ధి చట్టం(రెరా) అమల్లోకి రావడంతో విదేశీ పెట్టుబడులు ముందుకు వస్తున్నాయి. రాష్ట్రంలో రేరా అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో ఇక్కడ చేపడుతున్న ప్రాజెక్టులపై సంస్థాగత మదుపరుల్లో క్రమంగా విశ్వాసం వ్యక్తం అవుతోంది. దీంతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరిగాయి. దేశంలో ముంబాయి తర్వాత హైదరాబాదే విదేశీ మదుపర్లు ఎక్కువ పెట్టుబడులను ఆకర్షించింది. దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో అత్యధికంగా ముంబాయిలోని ప్రాజెక్టులో 2 బిలియన్ డాలర్లను మదుపు చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోనే ప్రాజెక్ట్‌కు 793 మిలియన్ డాలర్లు వచ్చనట్లు రియల్ రంగంలోని నిపుణులు వెల్లడిస్తున్నారు.

స్థిరాస్తుల్లో పెట్టుబడులు పెట్టడమంటే భారీగా రాబడి అందుకోవచ్చు. కొన్నిసార్లు అసలుకే మోసం రావచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వ్యక్తులే కాదు సంస్థాగత మదుపర్లకు గతంలో పలు చేదు అనుభవాలను ఎదుర్కొన్నారు. విదేశీ సంస్థలు పెట్టుబడులు పెట్టి ఆర్థిక వ్యవస్థ స్థంభించడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా కొన్ని పెద్ద సంస్థలు ఆయా స్థిరాస్తి ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేయలేక పోయాయి. కొన్ని సంస్థలు బ్యాంకుల రుణాలు తీర్చలేకపోయాయి. దీంతో సంస్థాగత మదుపర్లు పెట్టుబడులు పెట్టేందుకు వెనక్కి తగ్గడంతో నగదు లభ్యత లేక మార్కెట్ ఇబ్బంది పడింది. ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ఆలస్యం, పూర్తయిన వాటిలో అమ్మకాలు లేకపోవడం వంటి అనుభవాలను కూడా ఎదుర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే కేంద్రం స్థిరాస్తి నియంత్రణకు చర్యలు తీసుకురావడంతో క్రమంగా విశ్వాసం పెరుగుతుందని విశ్లేషకులు చెబుతున్నాయి. రియల్ రంగంలో 2025వ సంవత్సరం నాటికి 650 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని నరెడ్కో, ఏపీఆర్ఈఏతో కలిసి కేపీఎంజీ ఇచ్చిన నివేదికలో పేర్కొంది. 2030 నాటికి ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని మార్కెట్ వర్గాల అంచనా



రోపోసో యాప్‌తో.. సరికొత్తగా గణతంత్ర దినోత్సవం

విజయక్రాంతి, హైదరాబాదు: భారతీయ షార్ట్ వీడియో ప్లాట్‌ఫార్మ్ రోపోసో గణతంత్ర దినోత్సవాన్ని వినియోగదారులతో కలిసి సరికొత్త ప్రక్రియలో జరుపుకోవడానికి సిద్ధమైంది. ఈ ఏడాది రోపోసో వినియోగదారులు రెండు కొత్త ఫిల్టర్ల ద్వారా సృజనాత్మక శైలిని, దేశంపై ప్రేమను చాటుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఒక ఫిల్టర్ ద్వారా దేశ భక్తిని చాటే విధంగా దేశభక్తి గానాల మీద వీడియోలు క్రియేట్ చేయవచ్చు. రెండో ఫిల్టర్ ద్వారా భారతదేశం పట్ల ప్రేమను వీడియోలో మైక్ ద్వారా తెలియజేయవచ్చు. యాప్‌లోని కెమెరా బటన్ మీద క్లిక్ చేయడం ద్వారా ఈ రెండు ఫిల్టర్లు రోపోసో వినియోగదారులకు వెంటనే అందుబాటులోకి వస్తాయి.

ఆల్ఫోర్స్‌లో జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు



విజయక్రాంతి, కరీంనగర్: సమాజంలో ప్రతీ ఒక్కరు ప్రేమ ఆప్యాయతలతో ఆదరాభిమానాలతో ఉండాల్సిన అవసరం ఎంతగానో ఉందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని స్థానిక వావిలాలపల్లిలోని ఆల్ఫోర్స్ స్కూల్ ఆఫ్‌జెన్‌నెక్ట్స్‌లో గురువారం ఆల్ఫోర్స్ భారత్ బాలిక ఉత్సవ్ 2019 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికల పట్ల వివక్ష చూపించం జరుగుతుందని, వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించడం విచారకరమని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో బాలికలు కూడా బాలురతో సమానంగా అన్ని రంగాలలో పాల్గొంటూ భేధాభిప్రాయాలు తొలగిస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో బాలికల సంక్షేమానికై వారి శ్రేయస్సుకు ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఈ పథకాలు ఇతర దేశాలకు సైతం స్ఫూర్తిదాయకంగా నిలవడం భారతదేశానికి గొప్ప అనుభూతి అని అన్నారు.

ఎమ్మెల్యే గంగులకు అభినందనలు..

కరీంనగర్ శాసనసభ నియోజకవర్గంలో వరుసగా మూడూ సార్లు గెలుపొందిన స్థానిక శాసనసభ్యుడు గంగుల కమలాకర్‌ను ఆల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి గురువారం ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా గంగుల మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తు ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు రాష్ట్రానికే తలమానికంగా నిలవడం జిల్లాకే గర్వకారణమని అన్నారు.

అధికారంలోకి వస్తే.. 24 గంటల్లో 50వేల ఉద్యోగాలు

(మొదటిపేజీ తరువాయి) రైతు రుణ మాఫీ చేసింది' అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రియాంక గాంధీ రాజకీయ ప్రవేశంతో ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్‌లో కొత్త ఉత్సాహం వస్తోందని, ఈ రాష్ట్రంలో మన పార్టీ తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఈ నిర్ణయం తోడ్పడుతుందని రాహుల్ అన్నారు. ఈ రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతానికి చెందిన ఓ కాంగ్రెస్ నేత ఉంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



లోక్‌సభ ఎన్నికల్లో సంపూర్ణ బలంతో పోటీ చేస్తాం

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ బలంతో పోటీ చేస్తుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఉత్తర ప్రదేశ్ శాసన సభ ఎన్నికల్లో కూడా గెలిచే సత్తా ఉందన్నారు. రెండు రోజుల అమేథీ పర్యటన సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాహుల్ ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల్లో సంపూర్ణ బలంతో పోటీ చేస్తామని, వచ్చే ఉత్తర ప్రదేశ్ శాసన సభ ఎన్నికల్లో కూడా మనం గెలుస్తామని ఆయన చెప్పారు. రైతుల రుణాలను రద్దు చేస్తామని ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ మరోసారి తీవ్రంగా మండిపడ్డారు. మోదీ ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తల రుణాలు మాత్రమే రద్దయ్యాయని విమర్శించారు. కాపలాదారు దొంగ అని రుజువైందన్నారు. కాపలాదారు దొంగ అని ప్రతి వీధిలోనూ వినిపిస్తోందన్న రాహుల్, మోదీ చెప్పిన మంచి రోజులు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు.

సొంత నియోజకవర్గంలో రాహుల్‌కు చేదు అనుభవం

కాగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి సొంత నియోజకవర్గంలో చేదు అనుభవం ఎదురైంది. అమేథీ పర్యటనకు వచ్చిన ఆయనకు వ్యతిరేకంగా అక్కడి రైతులు ఆందోళనకుదిగారు. 'రాహుల్ గో బ్యాక్ టు ఇటలీ' అంటూ నినాదాలు చేశారు. రాహుల్ అమేథీ పర్యటనను నిరసిస్తూ గౌరీగంజ్ ప్రాంతంలోని రైతులు నిరసన తెలిపారు. రాజీవ్ గాంధీ ఫౌండేషన్ కోసం తమ భూములను లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగాలు కల్పించాలని లేదా భూములు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'రాహుల్ గాంధీ తీరుపై మేం అసహనంగా ఉన్నాం. ఆయన విధానాలతో విసిగిపోయాం. ఆయన ఇటలీకి వెళ్లిపోవాల్సిందే. భారత్‌లో ఉండటానికి అర్హులు కారు. మా భూములు లాక్కుని మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు' అని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశాడు. 1980లో కౌసర్ ప్రాంతంలో సామ్రాట్ సైకిల్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేసేందుకు వ్యాపారవేత్తలు 65.57 ఎకరాల భూమిని లీజుకు తీసుకున్నారు. అప్పట్లో అమేథీ ఎంపీగా ఉన్న రాజీవ్ గాంధీ ఈ ఫ్యాక్టరీని ప్రారంభించారు. అయితే అప్పుల పాలైన ఆ వ్యాపారవేత్తలు లీజు చెల్లించలేని పరిస్థితికి దిగజారారు. అనంతర కాలంలో కంపెనీని కూడా మూసేశారు. దీంతో 20.10 కోట్ల రూపాయల బాకీ వసూలు చేసేందుకు యూపీ పరిశ్రమల అభివృద్ధి సంస్థ 2014లో ఈ భూమిని వేలం వేసింది. దీంతో ఈ భూమిని రాజీవ్ గాంధీ ఛారిటబుల్ ట్రస్ట్ వేలం ద్వారా కొనుగోలు చేసింది. రూ. 1,50,000 స్టాంపు డ్యూటీ చెల్లించి ఈ భూమిని సొంతం చేసుకుంది. అయితే ఈ వ్యవహారం కోర్టుకు చేరడంతో వేలం చెల్లదని గౌరీగంజ్ కోర్టు స్పష్టం చేసింది. ఈ భూమిని సామ్రాట్ సైకిల్ ఫ్యాక్టరీకి అప్పగించాలని ఆదేశించింది. దీంతో ఈ వేలాన్ని రద్దు చేస్తున్నట్లు యూపీఎస్‌ఐడీసీ ప్రకటించింది. కానీ ఆ భూమి ఇప్పటికీ రాజీవ్ గాంధీ చారిటబుల్ ట్రస్టు ఆధీనంలోనే ఉంది. దీంతో ఈ భూ వ్యవహారంపై సంబంధిత రైతులు రాహుల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అమేథీ పర్యటన సందర్భంగా ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజీవ్ గాంధీ ఫౌండేషన్ కోసం తీసుకున్న తమ భూములను వెనక్కి ఇచ్చేయాలి లేదా భూసేకరణకు బదులుగా ఉద్యోగం కల్పించాలంటూ ఆందోళనకు దిగారు. కాగా తన సొంత నియోజకవర్గమైన అమేథీలో రాహుల్ గాంధీ రెండు రోజుల పర్యటన గురువారంతో ముగిసింది.



కరీంనగర్ కలెక్టర్‌కు కేంద్ర ప్రభుత్వ అవార్డు

విజయక్రాంతి, కరీంనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బేటీపడావో–బేటీబచావో పథకాన్ని కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా అమలు చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చినందుకు కరీంనగర్ జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు కేంద్ర ప్రభుత్వం ఎఫెక్టివ్ కమ్యునిటీ ఎంగేజ్‌మెంట్ అవార్డుకు ఎంపిక చేశారు. న్యూఢిల్లీలో గురువారం ఉదయం జరిగిన జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమంలో కేంద్ర వుమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి మేనకగాంధీ చేతుల మీదుగా కలెక్టర్ అవార్డును అందుకున్నారు.జిల్లాలో బాలికా నిష్పత్తి పెంచడంలో కలెక్టర్ ఘననీయంగా కృషి చేయగా కేంద్రం అవార్డును ప్రకటించింది. ప్రదానోత్సవ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సంక్షేమ అధికారి శారద, డీసీపీఓ పర్వీన్ పాల్గొన్నారు.

బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు..

కరీంనగర్ జిల్లాలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఎంతగానో కృషి చేసినందుకు కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డుకు ఎంపిక చేసింది. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఉదయం నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్ చేతుల మీదుగా కలెక్టర్ ఈ అవార్డును అందుకోనున్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో పయనింపజేస్తూ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న కలెక్టర్‌కు ఈ అవార్డుతో జిల్లా అమ్ములపొదిలో మరో అవార్డు చేరినట్లయింది.

నలుదిక్కులా రైల్వే కనెక్టివిటీ



- ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో జంక్షన్లు
- రాయలసీమపై ప్రత్యేక దృష్టి
- రైల్వే శాఖ సహాయ మంత్రి రాజెన్ గోహేన్

విజయక్రాంతి, హైదరాబాదు: దక్షిణ భారతదేశాన్ని ఉత్తర, పశ్చిమ, తూర్పు భారత ప్రాంతాలతో అనుసంధానించడంలో కీలక పాత్రను పోషిస్తున్న రాయలసీమ ప్రాంతానికి సముచిత ప్రాధాన్యత ఇస్తున్నామని రైల్వే శాఖ సహాయ మంత్రి రాజెన్ గోహేన్ తెలిపారు. మౌలిక సదుపాయాలు, ప్రయాణికుల సౌకర్యాల కల్పనలో పూర్తయిన రైల్వే అభివృద్ధి పనులను గురువారం గుంతకల్లులో జరిగిన కార్యక్రమంలో ఆయన జాతికి అంకితం చేశారు. అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. గుంతకల్లు – నల్లపాడు సెక్షన్ విద్యుదీకరణ, గుంతకల్లు – కల్లూరు సెక్షన్ విద్యుదీకరణ, గుంతకల్లు – కల్లూరు డబ్లింగ్ ప్రాజెక్ట్‌లో భాగంగా గూళ్లపాళ్యం – ఖాదర్ పేట స్టేషన్ల మధ్య డబుల్ లైన్, గుంతకల్లు నూతన రైల్వే స్టేషన్ భవనం, గుంతకల్లు, అనంతపురం, కడప, కర్నూలు సిటీ రైల్వే స్టేషన్లలో ఉచిత హై స్పీడ్ వై–ఫై సదుపాయం, కడప రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం – 1 పై ఏర్పాటు చేసిన లిఫ్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2014–15 బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.1105 కోట్లు కేటాయిస్తే, 2018–19 బడ్జెట్‌లో రూ.3670 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ధర్మవరం నుండి విజయవాడకి ట్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం – తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ని ధర్మవరం వరకు పొడిగింపు, కర్నూలు, రాయచూర్ నుండి గుంటూరు, విజయవాడలకు ప్రత్యేక రైళ్లను నడిపించామన్నారు.

రాయలసీమ ప్రాంతంలో రూ.1900 కోట్లు వ్యయం చేసి 145 కిలోమీటర్ల కొత్త రైలు మార్గాలు, 23 కిలో మీటర్ల డబ్లింగ్, 635 కిలో మీటర్ల విద్యుదీకరణ పనులు పూర్తి చేశామన్నారు. నాలుగు సంవత్సరాల్లో రాయలసీమలో 123 కిలోమీటర్ల నిడివి గల నంద్యాల – ఎర్రగుంట్ల కొత్త రైలు మార్గం, కడప – బెంగుళూరు కొత్త రైలు మార్గం ప్రాజెక్టుల్లో భాగంగా 23 కిలోమీటర్ల నిడివి గల కడప – పెండ్లిమర్రి కొత్త రైలు మార్గం, గుత్తి – ధర్మవరం మధ్య 90 కిలోమీటర్ల విద్యుదీకరణ, గుంతకల్లు – మంత్రాలయం మధ్య 93 కిలోమీటర్ల విద్యుదీకరణ పూర్తి చేశామన్నారు.

అదనంగా రూ.6300 కోట్ల ఖర్చుతో చేపట్టిన పలు పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. కడప – బెంగుళూరు కొత్త రైలు మార్గం, గుంతకల్లు – గుంటూరు, గుత్తి – ధర్మవరం మధ్య డబ్లింగ్ పనులు, గుంతకల్లు – బళ్లాం విద్యుదీకరణ ముఖ్యమైనవన్నారు. కర్నూలు వద్ద దాదాపు రూ.300 కోట్లతో మిడ్‌లైఫ్ కోచ్ రీహ్యాబిలిటేషన్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రూ.500 కోట్ల ఖర్చుతో కర్నూలు, తిరుపతి, గుంతకల్లు స్టేషన్‌లలో ఆధునిక వసతులు సదుపాయాలు కల్పిస్తామన్నారు.

అభివృద్ధి చేసిన మౌలిక సదుపాయాల వివరాలు

అభివృద్ధి చేసిన మౌలిక సదుపాయాల వివరాలు

- గుత్తి – పెండేకల్లు సెక్షన్‌తో కలిపి గుంతకల్లు – నల్లపాడు మధ్య పూర్తి చేసిన 426 కిలో మీటర్ల విద్యుదీకరణకు అయిన ఖర్చు రూ.432 కోట్లు. దీని వల్ల రాయలసీమలోని ఈ సెక్షన్‌లో నిరంతరాయంగా రైళ్లు సమయపాలనతో నడవనున్నాయి.
- 41 కిలోమీటర్ల నిడివి గల గుంతకల్లు – కల్లూరు సింగల్ లైన్ సెక్షన్‌లో రూ.34 కోట్లతో పూర్తయిన విద్యుదీకరణతో బెంగుళూరుఉక హైదరాబాద్, ముంబయి, ఉత్తర భారతదేశానికి అనుసంధానం ఏర్పడి రైలు నిరంతరాయంగా పరుగులు తీస్తాయి.
- రూ.323 కోట్లు మంజూరైన గుంతకల్లు – కల్లూరు డబ్లింగ్ ప్రాజెక్టుల్లో భాగంగా గుళ్లపాళ్యము – ఖాదర్ పేట్ మధ్య నిర్మించిన 21 కిలోమీటర్ల రెండవ రైలు మార్గంలో మిగిలిన 19 కిలోమీటర్ల భాగం ఈ సంవత్సరం చివరిలోగా పూర్తి చేయాలనేది లక్ష్యం.
- రాయలసీమలోని 4 రైల్వే స్టేషన్‌లలో హైస్పీడ్ ఉచిత వై–ఫై సౌకర్యం కల్పించారు.
- కడప రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం 1పై ఏర్పాటు చేసిన లిఫ్టు సౌకర్యం వల్ల వృద్ధులు, వికలాంగులు, ఇతర ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుంది.

కేంద్రంలో హంగ్ ?

(మొదటిపేజీ తరువాయి) ఎన్డీఏకు 99 సీట్లు తగ్గే అవకాశముందని సర్వే అంచనా వేసింది. ఆ కూటమి 237 సీట్లు మాత్రమే గెలిచే అవకాశముంది. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 272ని ఎన్డీఏ అందుకునే అవకాశాలు లేవు. కాగా గత ఎన్నికలతో పోలిస్తే యూపీఏ కూటమి ఈసారి భారీగా పుంజుకోనుంది. యూపీఏ 166 సీట్లు దక్కించుకునే అవకాశముంది. 2014తో పోలిస్తే యూపీఏకు అదనంగా 106 సీట్లు రానున్నాయి.



ఇక ఎన్డీఏ, యూపీఏలో భాగస్వాములు కాని పార్టీలు 140 స్థానాల్లో విజయం సాధిస్తాయని సర్వే తేల్చింది. అయితే ఈ రెండు కూటముల్లో లేని వారు గత ఎన్నికల్లో కంటే 13 సీట్లను కోల్పోతారు. మొత్తంగా చూస్తే ఎన్డీఏకు 35 శాతం, యూపీఏకు 33 శాతం ఓట్లు పడతాయని అంచనా. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాజా సర్వే కమలనాథులను కలవరపెడుతోంది. రెండోసారి అధికారం దక్కించుకోవాలన్న మోదీషా ద్వయానికి ఈ అంచనాలు షాక్ ఇవ్వనున్నాయి. అయితే ఎన్డీఏ, యూపీఏతో జట్టు కట్టే పార్టీల ఆధారంగా ఈ ఫలితాలు మారే అవకాశముంది. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 272. ఎన్డీఏ, యూపీఏలో భాగస్వాములు కానీ పార్టీలు దేనికి మద్దతు ఇస్తే ఆ కూటమే ప్రభుత్వం ఏర్పాటు చేయగలుగుతుందని సర్వే ద్వారా స్పష్టమైంది.

ప్రధాన మంత్రి పదవి కోసం ఇతర పార్టీల డిమాండ్!

2014 ఎన్నికల్లో బీజేపీ 282 స్థానాలు గెలుచుకుని మిత్రపక్షాల అవసరం లేకుండానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజార్టీ సాధించిన విషయం తెలిసిందే. అయితే ఈసారి హంగ్ ఏర్పడితే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మెజార్టీ కోసం యూపీఏయేతర పార్టీల మద్దతు కోసం ఎన్డీఏ ప్రయత్నాలు జరపాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఇతరులు కూడా ప్రధాన మంత్రి పదవి కోసం డిమాండ్ చేసే అవకాశాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కేవలం 44 సీట్లు మాత్రమే వచ్చాయి.

ఇండియాటుడేకార్వీ ఇన్సైట్స్ సర్వే ఫలితాల్లో వెల్లడైనట్లు యూపీఏకి 166 సీట్లు వస్తే ఆ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు రెండు అవకాశాలు ఉన్నాయి. యూపీఏ కూటమికి పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, సమాజ్ వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ మద్దతు తెలపాల్సి ఉంటుంది. 543 పార్లమెంట్ సీట్లకు ఎన్నికలు జరగనుండగా ప్రభుత్వ ఏర్పాటుకు 272 సీట్లు అవసరం అవుతాయి. ఈ నాలుగు పార్టీలు యూపీఏకి మద్దతు తెలిపితే ఆ కూటమి ఓట్ల శాతం 44 శాతంగా నమోదవుతుంది. అలాగే, ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన 272 సీట్లను పొందగలుగుతుంది. ఈ పరిస్థితుల్లో ఎన్డీఏకి 234 సీట్లు, ఇతరులకి (ఎన్డీఏ, యూపీఏ కూటమిలో లేని పార్టీల వద్ద) 37 సీట్లు ఉంటాయి.

ఇరు పార్టీల కూటములకు మద్దతు తెలపని పార్టీలు ఒకవేళ చివరి నిమిషంలో ఎన్డీఏకి మద్దతు తెలిపినప్పటికీ ఆ కూటమికి 271 సీట్లు మాత్రమే దక్కుతాయి. ప్రభుత్వ ఏర్పాటుకు మరో సీటు కావాల్సి ఉంటుంది. మరో విధంగా విశ్లేషిస్తే... ప్రస్తుతం ఏ కూటమికీ మద్దతు తెలపకుండా ఉంటున్న తెలంగాణ రాష్ట్ర సమితి, బీజూ జనతా దళ్, అన్నాడీఎంకే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల తరువాత బీజేపీకి మద్దతు తెలిపినప్పటికీ యూపీఏనే ముందంజలో ఉంటుంది. ఈ నాలుగు పార్టీలు ఎన్డీఏకి మద్దతు తెలిపితే ఈ కూటమి సీట్ల సంఖ్య 257కి పెరుగుతుంది. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎవరికీ ఆధిక్యం దక్కని పరిస్థితి ఏర్పడితే ఇతర పార్టీలను ఎన్డీఏ తన వైపునకు ఎలా ఆకర్షిస్తుందో అన్నది చూడాలి మరి.

కొచ్చర్‌పై.. సీబీఐ కేసు

(మొదటిపేజీ తరువాయి) 1996లో డిప్యూటి జనరల్ మేనేజర్‌గా నియమించారు. 1996లో శక్తి (పవర్), టెలికాం, రవాణా విభాగాలలో సంస్థను బలోపేతం చేయడానికి ఏర్పాటైన బృందానికి ఆమె నాయకత్వం వహించారు. 1998లో సంస్థ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి సాధించారు. 1999లో సంస్థ ఈకామర్స్ విభాగాన్ని కూడా నిర్వహించారు. కొచ్చర్ నాయకత్వంలోనే సంస్థ రిటైల్ బ్యాంకింగ్‌లోకి ప్రవేశించింది. దేశంలోని ప్రైవేటు బ్యాంకులలో అగ్రగామిగా నిలిచింది. 2001లో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సమయంలోనే బ్యాంకింగ్ కార్యకలాపాల్లో ఐసీఐసీఐ బ్యాంక్ కీలక పాత్ర పోషించే స్థాయికి ఎదిగింది. దీంతో 2006లో డిప్యూటి మేనేజింగ్ డైరెక్టర్ పదవి బాధ్యతలను చేపట్టిన కొచ్చర్.. అనంతర కాలంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిథ్యం వహించారు. 2009లో కొచ్చర్‌కు చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌తో పాటు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. కొద్ది నెలల విరామం తర్వాత 2009 మేలో ఐసిఐసిఐ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్థానాలను ఆమె అధిష్ఠించారు. 2009లో ఏర్పడిన సంక్షోభం నుంచి బ్యాంకును గట్టెక్కించడంలో కీలక పాత్ర పోషించారు. బ్యాంకు పురోగతికి ఆమె చేసిన కృషి అంతా ఇంతా కాదు. కీలక నిర్ణయాలు తీసుకోవడంలో ఆమె చూపే చొరవ, సాహసం కారణంగా దేశంలోనే దిగ్గజ ప్రైవేట్ బ్యాంకుల్లో ఒకటిగా ఐసీఐసీఐ బ్యాంకు అవతరించింది. అంతర్జాతీయంగానూ పేరున్న బ్యాంకుల జాబితాలో చోటు సంపాదించింది. ఈనేపథ్యంలో 2011లో చందా కొచ్చర్‌కు పద్మభూషణ్ పురస్కారం వరించింది.

అత్యుత్తమ బ్యాంకర్ అవార్డులను కూడా ఆమె అందుకున్నారు. ఫోర్బ్స్ శక్తిమంత మహిళల జాబితాలో పలుమార్లు కొచ్చర్ చోటు సంపాదించారు. ఇంతటి అద్భుతమైన ఉద్యోగ జీవితాన్ని అనుభవించిన చందా కొచ్చర్‌కు వీడియోకాన్ గ్రూప్ రుణాల అవకతవకల వివాదం మాయనిమచ్చను మిగిల్చింది. ఈ వివాదం కారణంగా గత ఏడాది అక్టోబరులో ఆమె ఐసీఐసీఐ బ్యాంకు సీఈఓ పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

చందా కొచ్చర్ ప్రస్థానం

1984 ఐసీఐసీఐ గ్రూపులో ట్రైనీగా చేరిక
1998 జనరల్ మేనేజరుగా పదోన్నతి
2000 రిటైల్ వ్యాపార విభాగానికి సారథ్యం
2001 ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా బాధ్యతలు
2006 డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టరుగా పదోన్నతి
2007 సీఎఫ్ఓ, సంయుక్త ఎండీ హోదా
2009 నుంచి మేనేజింగ్ డైరెక్టరు, సీఈఓ బాధ్యతలు
2018 అక్టోబరు 4 పదవీ విరమణ

మంచి రోజులు, చెడు రోజులు.. జీవితంలో సమానం

చందా కొచ్చర్ ఓ తల్లిగా, సక్సెస్‌ఫుల్ మహిళగా తన అనుభవాలను తెలుపుతూ కూతురు ఆర్తీకి రాసిన లేఖ.. ఆమె విజయాల్ని అందిపుచ్చుకున్న తీరును కళ్లముందుంచుతుంది.

డియర్ ఆర్తీ,

నిన్ను చూస్తుంటే నాకు గర్వంగా ఉన్నది. జీవితాన్ని గెలవడానికి కావాల్సిన ఆత్మవిశ్వాసం నీలో కనిపిస్తుంది. ఈ సందర్భంగా నీ జీవితంలో జరిగిన కొన్ని ముఖ్య సంఘటనలను, నా అనుభవాలను, వాటి నుంచి నేను నేర్చుకున్న పాఠాలను నీతో పంచుకుంటున్నా. చిన్నతనంలోనే ఎన్నో పాఠాలు నా తల్లిదండ్రుల నుంచి నేర్చుకున్నా. అలా అని వారేమీ నాకు వేలుపట్టి నేర్పలేదు. వారి నడవడిక, ఆదర్శాలు, విలువలు, వారి జీవితమే నాకు పాఠాలు నేర్పింది. నేను అదృష్టాన్ని నమ్ముతా.. కానీ కష్టాన్ని ఇంకా ఎక్కువ నమ్ముతా. పని, శ్రద్ధ ఈ రెండే మన జీవితంలో మనల్ని గెలిపించేవి. ప్రతి ఒక్కరూ గమ్యాల్ని నిర్దేశించుకుంటారు. ఆ గమ్యాల్ని చేరుకోవడంలో మనదైన ముద్ర వేయాలి. అప్పుడే అందరిలో మనం ప్రత్యేకంగా కనిపిస్తాం.


అడ్డదారుల్లో ఒకేసారి విజయాన్ని సాధించే కంటే.. ఎక్కే ప్రతి మెట్టులో విజయాన్ని ఆస్వాదిస్తూ అంతిమంగా సాధించిన విజయమే ఆత్మ సంతృప్తినిస్తుందని మర్చిపోకు. జీవితంలో చాలా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటప్పుడు ఎవరి మీదో ఆధారపడకుండా.. నీకు ఏది కరెక్ట్ అనిపిస్తే అది చెయ్యి. నీ శక్తి మేరకు ప్రయత్నించు. ఒకవేళ నువ్వు తీసుకున్న నిర్ణయం తప్పయితే దాన్నుంచి ఒక పాఠం నేర్చుకో. అంతేగానీ నిర్ణయాలు తీసుకోవడంలో ఇతరుల సహాయం తీసుకోవద్దు. అది మన గమ్యాన్ని డిస్టర్బ్ చేస్తుంది.

ఆర్తీ.. ఏదైనా సాధించడానికి హద్దులుండవు. చేసుకుంటూ వెళ్లిపోతూనే ఉండాలి. లక్ష్యాన్ని చేరుకునే దశలో విలువల్ని పాటించాలి. నిజాయితీ ఎప్పుడూ నీ నీడలా ఉండేలా చూస్కో. అడ్డంకులు వస్తే దాటుకుని పోవాలి. అంతేకానీ.. వాటిని తప్పించుకోవడానికి ఎగరకూడదు. నీ చుట్టూ సున్నిత మనస్కులు ఉంటారు. వారిని ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బంది పెట్టకు. ఒత్తిడి నీ దగ్గరకు రానీయకు. అది నీ డైరీలో, నీ జీవితంలో ఉండనివ్వకు.

గుర్తుంచుకో.. మంచిరోజులూ.. చెడు రోజులూ జీవితంలో సమానంగా ఉంటాయి. ముందు మంచి రోజులు వస్తే భవిష్యత్తులో చెడు రోజులు కూడా ఉంటాయని గుర్తు పెట్టుకో! ఎలాంటి సమయంలోనైనా ఒకేలా ఉండగలిగే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకో. ప్రతి అవకాశాన్ని, ఛాలెంజ్‌గా స్వీకరించు.

ప్రేమతో, నీ అమ్మ
(చందా కొచ్చర్)

కాంగ్రెస్ త్యాగధనుల పార్టీ



- ప్రియాంకగాంధీ రాకతో అధికారపార్టీల్లో దడ
- మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

విజయక్రాంతి, పెద్దపల్లి: దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు ప్రాణాలు త్యాగం చేసి చరిత్రలో నిలిచిపోయారని, ఇలాంటి కుటుంబం నుండి ప్రియాంక గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం శుభపరిణామని మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. పెద్దపల్లిలో గురువారం ఆయన మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రియాంక రాకతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని కార్యకర్తల్లో నూతన ఉత్తేజం వెల్లువిరిస్తుందని అన్నారు. రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే లక్ష్యంగా పని చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ, ప్రియాంక రాకతో బెజారవుతుందోని విమర్శించారు. జాతీయ పార్టీతోనే, రాహుల్‌గాంధీ నాయకత్వంలోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని అన్నారు. ఇందిరాగాంధీ పేద వర్గాల సంక్షేమం కోసం వేసిన బాటలు ప్రజలు మరిచిపోరని అన్నారు. గాంధీ కుటుంబం దేశానికి చేసిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.

టీఆర్‌ఎస్‌లో చేరే ప్రసక్తే లేదు..

తాను టీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నట్లు వచ్చిన వార్తలు ఊహాజనితమని శ్రీధర్ బాబు విలేకరులు ఆడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా పేర్కొన్నారు. తాను టీఆర్‌ఎస్‌లో చేరే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. సమావేశంలో పీసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, నాయకులు చేతి ధర్మయ్య, సి సత్యనారాయణరెడ్డి, గంట రాములు, అంతటి అన్నయ్యగౌడ్, వేముల రాంమూర్తి,బయ్యపు మనోహర్‌రెడ్డి, తిరుపతియాదవ్, అక్బర్‌అలీ, కాల్వల శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆదివారం బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

విజయక్రాంతి, హైదరాబాద్: శ్రీ లక్ష్మీనారాయణ పరిణయవేదిక హైదరాబాద్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ వధూవరుల పరిచయ కార్యక్రమం ఎల్.బీ.నగర్, గొటేటి కల్యాణవేదికలో ఈనెల 27 వ తేదీ, ఆదివారం ఉదయం 10గం నుండి ప్రారంభం అవుతుందని, పూర్తిగా వధూవరుల సమాచారం ఫోటోలతో సహ ఎల్.ఈ.డీ. స్క్రీన్‌పై చూపబడుతుందని, సాయంత్రం 5గం వరకూ జరిగే ఈ కార్యక్రమంలో పరిణయవేదిక.కాం ద్వారా కూడా సమాచారం పొందవచ్చునని సంస్థ డైరెక్టర్ మధిర రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనేవారు 9989991112ను సంప్రదించాలని కోరారు.



రాజకీయ ప్రకటనల్లో పారదర్శకత

ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో ప్రజలను ప్రభావితం చేసేలా ప్రకటనలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇటీవల కేంద్ర ప్రభుత్వం హెచ్చరించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా ఐటీ చట్టంలో పలు సవరణలు చేసింది. దీంతో అప్రమత్తమైన సామాజిక మాధ్యమాలు ప్రకటనల విషయంలో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఇప్పటికే ట్విటర్, ఫేస్‌బుక్ ప్రకటనల విషయంలో నిబంధనలు విధించగా తాజాగా గూగుల్ కూడా ప్రకటనదారులకు నిబంధనలు విధించింది. ఆన్‌లైన్‌లో వచ్చే రాజకీయ ప్రకటనలపై పూర్తి పారదర్శకత పాటించనున్నట్లు గూగుల్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇకపై ప్రకటనలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందివ్వాలని నిర్ణయించినట్లు పేర్కొంది. అలాగే ఆ ప్రకటనలను ఎవరు ఇచ్చారు? దీనికి వారు వెచ్చించిన ఖర్చు ఎంత? వంటి వివరాలను సైతం వెల్లడించనున్నట్లు తెలిపింది. ఇండియా పొలిటికల్ యాడ్స్ ట్రాన్స్‌ఫరెన్సీ రిపోర్ట్ పేరిట నూతన పాలసీని తీసుకువచ్చినట్లు గూగుల్ వెల్లడించింది. దీని ప్రకారం ప్రకటనదారులు ఇకపై తమ ప్రకటనలకు సంబంధించి భారతీయ ఎలక్షన్ కమిషన్ లేదా ఈసీఐ అధికారులు అనుమతినిస్తూ జారీ చేసిన సర్టిఫికెట్లు తీసుకురావాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అలాగే ప్రకటనదారుల గుర్తింపును ధ్రువీకరించిన తర్వాతనే రాజకీయ ప్రకటనలు ఇస్తామని పేర్కొంది. దీనికి సంబంధించిన వెరిఫికేషన్ ప్రక్రియను ఫిబ్రవరి 14 నుంచి మొదలుపెడతామని తెలిపింది. ఈ ప్రకటనలు మార్చి నుంచి అందుబాటులోకి వస్తాయని గూగుల్ వెల్లడించింది.

సామాజిక మాధ్యమాలు ఈ విధంగా కఠిన నిబంధనలు అమలు పరచటంతో గాలి వార్తలకు, వ్యక్తిగత దూషణలకు కళ్లెం పడనుంది. ప్రకటనలిచ్చే వారి సమాచారం ఉండటంతో నిరాధార ఆరోపణలు చేసే అవకాశం ఉండదు. ప్రకటనలకు చేసే ఖర్చుల విషయంలో కూడ పారదర్శకత ఉంటుంది. అన్ని విషయాలను దృష్టిలో ఉంచుకుని ప్రకటనలు ఇవ్వటంతో ప్రచారంలో ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుంది.

ప్రియాంకాస్త్రం

రాహుల్ గాంధీ క్రమేపీ తన మీద ఉన్న వివిధ ముద్రలను చెరిపేసుకుంటూ, సింహాసనం కోరుకోని యువరాజు నుంచి తన వారసత్వపుటధికారాన్ని కాపాడుకునే పోరాటవీరుడిగా పరిణామం చెందుతున్నారు. దారిలో ఇంకా ఎగుడుదిగుళ్లు ఉన్నా, నడక వేగం మాత్రం ఖచ్చితంగా పెరిగింది. తాజాగా బుధవారం ఆయన తన సోదరి ప్రియాంక వాద్రాను తెరమీదకి తీసుకువచ్చి పతాక శీర్షికలను ఆక్రమించగలిగారు. ఏదో జరుగుతోందన్న భావనను, కాంగ్రెస్ మోడీకి గట్టి పోటీ ఇస్తోందన్న నమ్మకాన్ని కలిగించడంలో రాహుల్ గాంధీ గణనీయంగా సాఫల్యాన్ని సాధించారు.

రాజకీయంలో ఏమీ చేయలేకపోయినా, ఏదో జరుగుతున్న నమ్మకాన్ని కలిగించడం చాలా అవసరం. దీనినే ఇమేజ్ మేనేజ్ మెంట్ నిపుణులు 'పర్సెప్షన్ మేనేజ్ మెంట్ 'అంటారు. మొత్తం మీద రాహుల్ గాంధీ ఎన్నికల్లో ఏజెండా సెట్టింగ్ చేయలేకపోయినా పర్సెప్షన్ మేనేజ్ మెంట్ చేయడంలో ఖచ్చితంగా గెలుస్తున్నారని భావించాలి. అత్యంత కీలకమైన, తమ రాజకీయ భవిష్యత్తు దశను, దిశను నిర్ధారించే ఎన్నికలకు వెళ్తున్న వేళ కాంగ్రెస్ పార్టీకి ప్రియాంక వాద్రా బలమిచ్చే టానిక్‌గా పనిచేస్తారా లేక కాలం చెల్లిన మందుగా మిగిలిపోతారా అన్నది రాబోయే రోజులే నిర్ధారిస్తాయి.

రాహుల్ గాంధీ ముందు అతి పెద్ద సవాళ్లు రెండు. ఒకటి ఆయన నరేంద్ర మోడీ వంటి అత్యంత సమర్థుడైన, బలీయమైన నాయకుడితో తలపడాలి. మోడీ వ్యూహరచన, వాదనా పటిమ, ప్రజలతో ఆయనకున్న సజీవ సక్రియ సంబంధాల దృష్ట్యా ఆయనతో పోరు ఆషామాషీ వ్యవహారం కాదు. పటిష్టమైన కార్యకర్తల గణం ఉన్న బీజేపీతో పోరాటం నాలుగో పానిపట్ యుద్ధం లాంటిదే. కానీ అంతకన్నా పెద్ద సవాలేమిటంటే బీజేపీయేతర పార్టీలన్నిటికీ తానే మోడీకి ప్రత్యామ్నాయమని ఆయన నమ్మకం కలిగించగలగాలి. నిజానికి ఇది రాహుల్ రాజకీయ భవిష్యత్తును నిర్ధారించే అంశం. ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ రాహుల్ గాంధీ పేరును ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించడాన్ని బహిరంగంగానే వ్యతిరేకించారు. అదే విధంగా ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ వ్యతిరేక పార్టీలైన సమాజవాదీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీలు కాంగ్రెస్‌ను పక్కన బెట్టి తమంతట తాము ఎన్నికల అవగాహనకు రావడమే కాక, సీట్ల పంపకం కూడా చేసుకున్నాయి. బీఎస్పీ అధినేత్రి మాయావతి రాయబరేలీ, అమేఠీ నియోజకవర్గాలను కాంగ్రెస్ కు వదిలేస్తున్నామని దయతో ప్రకటించడం కూడా కాంగ్రెస్‌ను సవాలు చేయడం లాంటిదే. దేశంలో అత్యధిక ఎంపీ సీట్లున్న రాష్ట్రంలో ఈ అవమానకర పరిస్థితిని చక్కదిద్దాలంటే అన్ని సీట్లలో పోటీ చేయడంతో పాటు, అందరినీ దిగ్భ్రమితులను చేసే ఆయుధాన్ని వెలికి తీయాలి. ప్రియాంక వాద్రా అలాంటి ఆయుధమేనని రాహుల్ గాంధీ భావిస్తున్నారు. అదే విధంగా బీహార్ లోని రాష్ట్రీయ జనతాదళ్ కూడా కాంగ్రెస్‌ను పెద్దగా పట్టించుకోవడం లేదు. కాబట్టి ప్రియాంక వాద్రాను తెర పైకి తెచ్చి రాహుల్ గాంధీ బీజేపీయేతర పార్టీలను, ముఖ్యంగా మూడో కూటమిని ఇరకాటంలోకి తోశారు. ముఖ్యంగా ఆమెకు తూర్పు ఉత్తరప్రదేశ్ బాధ్యతలను కట్టబెట్టడం కూడా ఈ పార్టీలను తికమకపరచడం ఖాయం.

ప్రియాంక రాజకీయాలకు కొత్తేమీ కాదు. ఆమె గతంలో తల్లి సోనియా గాంధీ, అన్న రాహుల్ గాంధీల ఎన్నికల ప్రచారాలకు సారథ్యం వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని కుటుంబ సీట్లలో కార్యకర్తలతో మంచి సంబంధాలు కలిగి ఉన్నారు. పైగా ప్రియాంక క్రియాశీలక రాజకీయాల్లోకి రావాలన్న డిమాండ్ కూడా పాతదే. కాబట్టి పార్టీ కార్యకర్తలను విద్యుచ్ఛకితం చేయడంలో ఆమె ఖచ్చితంగా కీలక పాత్రను పోషిస్తారన్న అంచనాలున్నాయి. ఇన్నాళ్లూ తెరవెనుక పోషించిన ప్రియాంక ఇప్పుడు ప్రత్యక్ష పాత్రను పోషించగలుగుతారు.

అయితే కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యంగా గాంధీ పరివారానికి కొన్ని కఠిన ప్రశ్నలను కూడా ఎదుర్కోవలసిన పరిస్థితులు రావచ్చు. ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రా అక్రమాస్తులు, ఆయనకు భూపీందర్ సింగ్ హుడా ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కూరగాయల ధరకు హర్యాణా ప్రభుత్వం కట్టబెట్టిన ఆస్తులు మొదలైన వాటన్నిటిపైనా తలెత్తే ప్రశ్నలకు ఆమె, రాహుల్ గాంధీ సమాధానాలు చెప్పుకోవలసి రావచ్చు. కాంగ్రెస్ ఒక కుటుంబం పార్టీ అన్న ముద్ర పడకుండా తప్పించుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రధాని మోడీ వారికి కుటుంబమే పార్టీ, నాకు దేశమే కుటుంబం అని వ్యాఖ్యానించడం ఈ సందర్భంగా గమనార్హం. ఇప్పటికి నెహ్రూ కుటుంబం నుంచి పది మంది రాజకీయాల్లో ప్రవేశించారు. ప్రియాంకా వాద్రా పదకొండవ వ్యక్తి. నేరుగా పార్టీ జాతీయ కార్యదర్శి పదవిని ఆమెకు కట్టబెట్టడంపై కూడా ప్రశ్న చిహ్నాలు పెట్టే అవకాశం ఉంది. కాబట్టి కాంగ్రెస్ పార్టీ దీనికి జవాబులు చెప్పుకోవలసి రావచ్చు.

మొత్తం మీద రాహుల్ రాజకీయంగా తన అమ్ముల పొదిలోని పాశుపతాస్త్రాన్ని సంధించారు. రాజకీయంగా ఆయన ఎత్తులు, పై ఎత్తులు వేసే క్రీడలో తనకూ ప్రావీణ్యం వచ్చిందని నిరూపించుకున్నారు. అయితే అస్త్రం వేయడం మాత్రమే సరిపోదు. ఆస్త్రం లక్ష్యాన్ని ఛేదించగలగాలి. అప్పుడే పని పూర్తయినట్టు.

స్మశానవాటికలకు స్థలాలివ్వండి

అనేక గ్రామాలలో స్మశాన వాటికల స్థలాలు లేక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామాల్లో ఎవరైన మృతి చెందినప్పుడు అంత్యక్రియలు నిర్వహించడం సమస్యాత్మకమవుతోంది. అంత్యక్రియలు నిర్వహించే విషయంలో చాలా చోట్ల గొడవలు జరుగుతున్నాయి. ప్రతి గ్రామంలో స్మశానవాటికలకు స్థలం కేటాయించటానికి పభుత్వం చొరవ తీసుకోవాలి. కొన్ని గ్రామాల ప్రజలు స్మశానవాటికల స్థలాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగినా ఎలాంటి ప్రయోజనం కలుగటం లేదు. ఎన్నికలప్పుడు ఓటర్ల ప్రసన్నత కోసం స్మశానవాటికలకు స్థలాలిస్తామంటూ వాగ్దానం చేస్తున్న నాయకులు తర్వాత పట్టించుకోవటం లేదు.



సంవత్సరాలు గడుస్తున్నా ఈ సమస్యకు పరిష్కారం దొరకక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మనిషి యొక్క చివరి మజిలి అయిన అంత్యక్రియలకు అవసరమైన ఆరడుగుల స్థలం కోసం పోరాడవల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత ప్రభుత్వం ఆయా గ్రామాల్లో స్మశాన వాటికలకు స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలి.

– షేక్ అస్లాం షరీఫ్
శాంతినగర్, జోగులాంబ గద్వాల జిల్లా

ఉత్సాహం భగవంతుని జీవలక్షణం

ఉత్సాహంగా ఉండు. ఉత్సాహం భగవంతుని జీవలక్షణం. చిరునవ్వు భగవంతుని చిహ్నం, ఆనందం భగవంతుని ప్రకృతి.

అనుకూలత భగవంతుని చిత్రం, చురుకుతనం భగవంతుని శక్తి, సమయోచితత భగవంతుని వివరణ, సమర్థత భగవంతుని గుర్తు, ఆర్థికత భగవంతుని సామర్థ్యం, అధ్యయనం భగవంతుని బోధన, పరిశోధన భగవంతుని విస్తరణ, ఉత్సాహం భగవంతుని జీవలక్షణం. కాబట్టి అనుకూలంగా, చురుకుగా, సమయోచితంగా, సమర్థంగా, ఆర్థికంగా, అధ్యయన శీలిగా, పరిశోధకురాలిగా, ఉత్సాహకర వ్యక్తిగా ఉండు.

ఉత్సాహంతో చిరునవ్వులు చిందిస్తూ నీ చుట్టూ ఆనందాన్ని ప్రసరింపచేయి. ఉత్సాహం అనేది ఒక అంటువ్యాధి. నీవు ఉత్సాహంగా ఉంటే నీ కుటుంబసభ్యులు, నీ విద్యార్థులు, ప్రియమైన శశిర్, కృప, శరణ్య, శాశ్వత్ కూడా ఉత్సాహవంతులు అవుతారు.

నీవు దిగులుగా ఉంటే ప్రపంచం అంతా దిగులుగా ఉంటుంది. నీవు ఉత్సాహంగా ఉంటే నీ ప్రపంచం అంతా ఉత్సాహంగా ఉంటుంది. నీవు ప్రపంచాన్ని ప్రతిబింబిస్తే ప్రపంచం నిన్ను ప్రతిబింబిస్తుంది.

ఉత్సాహం ఇతరులను స్వాగతిస్తుంది. క్రొత్త స్ఫూర్తులను, మార్పులను స్వాగతిస్తుంది. ఉత్సాహం ఇతరులను కలవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటూ, భాగస్వాములవడానికి బాధ్యతను తీసుకుంటూ, సేవించడానికి, సహకరించడానికి ఉపకరిస్తుంది.

ఉత్సాహపూరిత వ్యక్తి ఒక స్నేహితుడు, చెలికాడు. ప్రయోజనకరమైన ప్రతిపాదనలకు వెనుకంజ వేయకు, నిశ్చయంగా అంగీకరించు.



తెల్లవారుజామున మేలుకోవటానికి, నిన్ను నీవు తాజాగా ఉంచుకోవాటానికి, ఇతరులు తాజాగా ఉండటానికి సాయం చేయటానికి, తయారు కావటానికి, నీ ఉద్యోగానికి వెళ్ళటానికి, పనిలో శ్రేష్ఠతతో ఉండటానికి, అద్భుతంగా బోధించటానికి, విద్యార్థులను మరింత తేజోవంతంగా తీర్చిదిద్దటానికి, ఇంటికి తిరిగిరావటానికి, నీ గృహగతమైన పనులు పూర్తిచేయటానికి, నీ ఇంటిని తీర్చిదిద్దుకోవటానికి, అందరికీ సాయపడటానికి, అందరికీ చక్కటి ఆహారాన్ని సిద్ధం చేయటానికి, ఆహారాన్ని, జీవితాన్ని హాయిగా ఆస్వాదించటానికీ, మరురోజుకు సిద్ధం కావటానికీ, హాయిగా నిద్రించటానికీ, నీలో నీవు క్రొత్తశక్తిని పుంజుకోవటానికి ఉత్సాహంగా ఉండు. శక్తిమంతంగా, ఉత్సాహంగా ఉండటానికి పనులను విరుద్ధంగా చేయి. అదే ఇది. నీ జీవితంలో ప్రతిరోజూ కూడా ప్రతిక్షణంలో ఉత్సాహంగా ఉండు. ఆ ఉత్సాహమే నీలో శక్తిని నింపుతుంది.

ఉత్సాహంతో, చిరునవ్వుతో, తేజస్సుతో, శరీరగతభాషతో, ఆచరణలతో ఇతరులను అంగీకరించు, స్వాగతించు, సంబంధించు, వ్యవహరించు, కృతజ్ఞతించు. ఏది చేసినా ఉత్సాహంతో చేయి. అప్పుడు నీవు నీ ఆచరణలతో ఏకం అవుతావు.

అద్భుతం! ఉత్సాహవంతమైన పితృత్వంలో, గురుత్వంతో ఈ గొప్ప, ప్రేమపూర్వక ఉత్తరాన్ని నీకు వ్రాస్తున్నాను.

ఉత్సాహం శక్తి ఊట వంటిది. ఉత్సాహంగా ఉండి, శక్తివంతంగా ఉండు.

ఉత్సాహం భగవంతుని జీవలక్షణం.

ఉత్సాహానికి అనుభవమార్గాలు

1. రజత్‌ను, పిల్లలను, ఇతరులను, కుటుంబసభ్యులను, విద్యార్థులను చిరునవ్వుతో పలకరించు. ముందు గా పలకరించు.

2. ప్రశాంతంగా మాట్లాడు, సరిగ్గా మాట్లాడు, స్నేహంగా మాట్లాడు.

3. నువ్వేం చేయగలవో దానిని వెంటనే అంగీకరించు. స్పందించు, ప్రతిస్పందించు, నీ ఒప్పందాన్ని ఖచ్చితంగా సఫలం చేయి.

4. నిన్ను నీవు సమీక్షించుకో! ఎవరో ముందుకు తీసుకువెళతారని చూడకు.

5. అన్ని సందర్భాలలో అందరికంటే ముందు ఉండు, ముందడుగు వేయి.

6. నీ పొరబాటును అంగీకరించి, దానిని సరిచేసుకోవడానికి, బాగు చేసుకోవటానికి సిద్ధతను తెలియచేయి.

7. నీ వ్యతిరేకులను చిరునవ్వుతో, పలకరింపుతో, సహాయంతో, సహకారంతో, సేవతో, అభినందనతో, ఎదుర్కో, వారు స్నేహితులౌతారు. నీ ఉత్సాహపు వరదలో వ్యతిరేకత కరిగిపోతుంది.

8. అత్యుత్సాహం తగదు.



గట్టు నారాయణ (గురూజీ)

రాజకీయ పార్టీగా మారిన తెలంగాణ ప్రజా సమితి

(నిన్నటి తరువాయి)

అయితే సుదీర్ఘంగా ఉద్యమం నిర్వహించి ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా అలసటకు గురైన ప్రజలు, కార్యకర్తలు నిస్పృహకు, నిరుత్సాహానికి గురికాకుండా డా॥ మర్రి చెన్నారెడ్డి ఎప్పటికప్పుడు ఏదో నామమాత్రపు కార్యక్రమం రూపొందించి ఉద్యమాన్ని కొనసాగించారు.

1969 జులై మాసంలో హోంమంత్రిగా మంత్రివర్గంలో చేరిన జలగం వెంగళరావు అప్పటి నుండి విద్యార్థులు కార్యకర్తలపైకి, పెంపుడు కుక్కలను ఉసిగొల్పినట్టు పోలీసులను పురమాయించారు. హాస్టల్స్‌పై అర్ధరాత్రి దాడిచేసి విద్యార్థులను చిత్రహింసలు పెట్టడం వంటి చర్యలు హద్దులు లేకుండా కొనసాగడంతో 1970 సంవత్సరాంతానికి చాలామంది విద్యార్థులు స్వగ్రామాలకు తరలివెళ్ళారు. అరెస్ట్, చిత్రహింసలు భరించలేక కొంతమంది క్రియాశీలక కార్యకర్తలు కూడ నగరం వదిలి వేరే ప్రదేశాలకు వెళ్ళారు.

లాభపడిన కాంగ్రెస్ నాయకులు, నష్టపోయిన ప్రజలు, తెలంగాణ

1971 లోక్‌సభ మధ్యంతర ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని డా॥ చెన్నారెడ్డి తెలంగాణ ప్రజా సమితిని రాజకీయ పార్టీగా మార్చారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన కాంగ్రేసేతర పార్టీల నాయకులు కొందరు ప్రజా సమితి నుండి విడిపోయి వేరే కుంపటి పెట్టుకున్నారు. మధ్యంతర ఎన్నికలలో తెలంగాణ ప్రాంతంలోని మొత్తం 14 స్థానాలకు సమితి అభ్యర్థులను నిలుపగా వారిలో పదిమంది ఘన విజయం సాధించారు. పోలైన ఓట్లలో ప్రజాసమితి 47 శాతం ఓట్లు సాధించినది. ఇక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తప్పదని చాలామంది భావించారు. అయితే, దేశం మొత్తం మీద తన కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీ లభించడంతో శ్రీమతి గాంధీ తెలంగాణ ప్రజా సమితి సభ్యులకు, ఎన్నికల అనంతరం, వారు ఊహించినంత ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కొద్ది రోజులలోనే అధికారంలో స్థిరపడిన శ్రీమతి గాంధీ, ఆమె సన్నిహితులు గుంభనంగా ఉద్యమంలో పాల్గొన్న కొందరు ముఖ్య నాయకులను, కొందరు పార్లమెంటు సభ్యులను ఉద్యమానికి దూరం చేసి డా॥ చెన్నారెడ్డి, శ్రీ వల్లూరి బసవరాజు ప్రభృతులను బలహీన పరిచి ఏకాకులను చేసే కార్యక్రమం చేపట్టారు. చెన్నారెడ్డికి చెప్పకుండా, ప్రజాసమితి అనుమతి లేకుండా శాసన సభాపక్ష నాయకుడు శ్రీ నూకల రామచంద్రారెడ్డికి తెలియకుండానే పలువురు నాయకులు, శాసనసభ్యులను ఢిల్లీ పిలిపించి కేంద్రమంత్రులు, ప్రధానమంత్రితో వారి సమావేశాలు ఏర్పాటు చేసి రహస్య మంతనాలు జరిపారు. తరువాత పదవులు ఇచ్చేందుకు వారితో బేరసారాలు చేశారు.

ఈ దశలో పరిస్థితి చేయిదాటిపోతున్నదనీ, ఏ క్షణంలోనైనా ప్రజా సమితిలో తీవ్ర విభేదాలు తలెత్తి, ఏటి కొకడు కాటికొకడు లాగే ప్రమాదం ఉన్నదని, తను నమ్మిన అనుయాయులు ఉద్యమం నుండి ఉపసంహరించుకునే ప్రమాదం కనిపిస్తున్నదని రాజ్యసభ సభ్యుడు శ్రీ బసవరాజు మరికొందరు మిత్రులు ఢిల్లీ నుండి పదే పదే చెన్నారెడ్డిని రహస్యంగా హెచ్చరించడంతో ఏమి చేయాలో తోచక డా॥ చెన్నారెడ్డి ఎన్నో రాత్రులు నిద్ర లేకుండా ఆందోళనతో గడిపారు. 1968 నుండి 1971 మధ్యకాలం వరకు ఉద్యమంలో పాల్గొన్న ప్రజలు కష్టాలకు, నష్టాలకు గురియై ప్రభుత్వ వైఖరిపట్ల విసిగి వేసారి ఉన్నారు. వారు ప్రజాసమితి సభలలో కూడ పాల్గొనే శక్తిని కోల్పోయారు. ప్రభుత్వ కుట్రల వలన తెలంగాణ యన్.జి.ఓల సంఘం తునాతునకలు అయింది. కుల ప్రాతిపదికగానేమి, మరొక కారణం చేతనేమి, విద్యార్థులు అనేక ముఠాలుగా చీలారు.

ఈలోగా ఢిల్లీలో బలమైన, పలుకుబడిగల 'లాబీ' ఏర్పాటు చేసుకున్న కాసు బ్రహ్మానందరెడ్డి, పెండేకంటి వెంకట సుబ్బయ్య, కె.యల్.ఎన్. ప్రసాద్ ప్రభృత ఆంధ్రనాయకులు తెలంగాణ ఉద్యమం నీరుకారిపోయినదనీ, అనతికాలంలోనే ఉద్యమకారులు ఎవరి వ్యక్తిగత పనులలో వారు తలమునకలై పోతారని డా॥ చెన్నారెడ్డిని లెక్క చేసేవారు ఉండరని ప్రధానమంత్రి, పత్రికా ప్రతినిధుల చెవులలో బాకాలు వాయించారు.

(సశేషం) – ఆదిరాజు వెంకటేశ్వర రావు

సామాన్యుల చేతిలో వజ్రాయుధం ఓటు

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం



ఓటు అనే రెండక్షరాలకు ప్రపంచ గతిని మార్చే శక్తి ఉంది. ఓటు వ్యక్తి అస్తిత్వాన్ని గుర్తిస్తుంది, వ్యవస్థ మార్పునకు నాంది పలుకుతుంది. రాజకీయ పార్టీల జాతకాలు మార్చాలన్నా.. భ్రష్టుపట్టిన వ్యవస్థకు చరమగీతం పాడాలన్నా వజ్రాయుధం ఇదే. మంచి నాయకత్వం లేకుండా మంచి సమాజం ఏర్పడదు. వయోజనులైన ప్రతి వ్యక్తికీ ఎలాంటి భేద భావాలు లేకుండా ఓటు హక్కును కల్పించింది మన రాజ్యాంగం. ప్రజల గళం వినిపించాలన్నా, ప్రజాస్వామ్య వ్యవస్థ పదిలంగా ఉండాలన్నా ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై, ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఓటుకు నేతల రాతనే కాదు.. దేశ తలరాతనే మార్చే సత్తా ఉంది. కానీ ఓటు విలువ ఎంత మందికి తెలుసు అన్నదే పెద్ద ప్రశ్న.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటుకున్న పాత్ర గురించి యువ ఓటర్లను చైతన్యం చేయడంలో భాగంగా ఎన్నికల కమిషన్ ఏర్పాటైన జనవరి 25ను జాతీయ ఓటర్ల దినోత్సవంగా ప్రకటించింది. భారత ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నా వంతు కర్తవ్యాన్ని గుర్తించి ఉన్నతమైన నాయకున్ని ఎన్నుకుంటానని ఓటర్లతో ప్రమాణం కూడా చేయిస్తున్నది. కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష, ఆర్థిక భేదభావం లేకుండా దేశంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకుడు ఓటు హక్కు పొందే అవకాశం భారత రాజ్యాంగం ఆర్టికల్ 326 కల్పిస్తున్నది. 125 కోట్ల జనాభా కలిగిన మన దేశంలో సుమారు 100 కోట్ల ఓటర్లు ఉన్నారు. ఇందులో కేవలం 50 కోట్ల లోపు ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు అంటే మనమంతా సిగ్గుపడాల్సిన విషయం. మన దేశంలో ఎన్నికల నిర్వహణను రాజ్యాంగం ఎన్నికల సంఘానికి అప్పగించింది. నిజం చెప్పాలంటే మన లాంటి దేశంలో ఎన్నికల నిర్వహణ ఎంతో బాధ్యతతో చేయాల్సిన పని. భౌగోళికంగా, సాంస్కృతికంగా, మతాల పరంగా , కులాలపరంగా , భాషల పరంగా , జనాభాపరంగా వైవిధ్యంతో, వైశాల్యంతో కూడుకొని ఉన్న మన దేశంలో ఎన్నికల నిర్వహణ అతి పెద్ద సవాలు. భారతదేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పర్యవేక్షణ, మార్గదర్శకత్వం, ఓటర్ల జాబితా తయారీ, ఓటరు గుర్తింపు కార్డుల విడుదల , పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభలకు, భారత రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి పదవులకు సంబంధించిన మొత్తం వ్యవహారం చూసే బాధ్యతల్ని భారత రాజ్యాంగం ఒక ప్రత్యేక వ్యవస్థ కు అప్పగించింది.దాన్ని భారత ఎన్నికల సంఘంగా వ్యవహరిస్తారు.

ప్రజాస్వామ్య దేశంలో న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలకంటే శక్తివంతమైన పాత్ర శాసనాలు తయారుచేసే పార్లమెంట్, అసెంబ్లీలది. ఉన్నత విలువలతో కూడిన ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన రాజకీయ నేతలే నేరస్తులైతే నేరమయ భారతం నిర్మితమౌతుంది.మన దేశంలో 1971 నుంచి ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్ అమలవుతోంది. లోక్‌సభ ఎన్నికల ఖర్చు రూ.25 లక్షలు, అసెంబ్లీ ఎన్నికల ఖర్చు రూ.10 లక్షలు దాటకూడదని 2004లో నిబంధనలు విధించినప్పటికీ అభ్యర్థులు మాత్రం కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తున్నారు. అభ్యర్థి నేరస్తుడైనా కోట్ల రూపాయల డబ్బు ఉంటే చాలు ఎన్నికల్లో టికెట్ ఇచ్చి ప్రతి పార్టీ ప్రోత్సహిస్తోంది. స్థానిక సంస్థలు, చట్టసభలకు ఎన్నికలు జరిగినప్పుడు ప్రజలంతా ఓటు వేయడానికి వెళ్లేలా ఆ రోజున సెలవు దినంగానూ ప్రకటిస్తున్నారు. అయినప్పటికీ ఎక్కువ మంది ఓటు వేసేందుకు ముందుకు రావడం లేదు. గ్రామాల్లో కన్నా విద్యావంతులు అధికంగా ఉన్న పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండడం అందరినీ ఆశ్చర్యపోయేటట్లు చేస్తోంది. రాజకీయ ప్రజాస్వామ్యం ఫరిడవిల్లాలంటే సాంఘిక, ఆర్థిక, సమానత్వాన్ని సాధించాలని, రాజ్యాంగం యొక్క లక్ష్యం కూడా అదేనని, రాజకీయ ప్రజాస్వామ్యం సామాన్యులకు అందకపోతే బాధితులు ఈ రాజ్యాంగ వ్యవస్థను కూల్చేస్తారని నవంబర్ 26, 1949న భారత రాజ్యాంగాన్ని పార్లమెంట్‌కు సమర్పిస్తూ అంబేడ్కర్ హెచ్చరించారు. జాతీయ ఓటరు దినోత్సవం రోజైనా దేశ భవిష్యత్తును కాపాడాల్సిన యువత ఓటు విలువ తెలుసుకుంటుందని ఆశిద్దాం.సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా పాలకుల మితిమీరిన జోక్యంతో సత్ఫలితాలు రావడం లేదు.

ఐదేళ్లకు ఒక్కసారి వచ్చినా.. మన జీవితాలను, తలరాతను మార్చేది ఎన్నికలు. సామాన్యుడి చేతిలో వజ్రాయుధం ఓటు. ఓటు హక్కును యువత బాధ్యతగా వినియోగించుకొని సమాజానికి మేలు చేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలి. ఎప్పుడూ నిరుత్సాహ పడవద్దు. ఒక ఓటు దేశ గమనాన్నే మారుస్తుంది. యువతలో చైతన్యం వచ్చి.. ఓటు హక్కును సమర్థంగా వినియోగించుకున్న నాడే దేశాభివృద్ధి సాధ్యం . పరిపాలన సజావుగా సాగాలన్నా, సరైన నేతలకు పగ్గాలు ఇవ్వాలన్నా అది ఓటు ద్వారానే సాధ్యమన్న సత్యాన్ని ఓటరు దినోత్సవం నాడైనా అందరూ మననం చేసుకోవాలి. ముఖ్యంగా యువత మేలుకొని ఓటు హక్కు నమోదు చేసుకొనడమే కాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే దానికి సార్థకత ఉంటుంది. అందుకే ఎవరూ ఓటు అనే విలువైన ఆయుధాన్ని నోటుకు అమ్ముకోవద్దు. మనం వేసే ఓటుతోనే నవసమాజ నిర్మాణం సాధ్యమవుతుంది అని తెలుసుకోవాలి. ఓటు కోసం డబ్బు ఇచ్చిన వారిని, తీసుకున్న వారిని క్రిమినల్ కేసు కింద కోర్టుకు హాజరుపర్చవచ్చు. కాబట్టి యువత ప్రలోభాలకు దూరంగా ఉండి, దేశంలో నిజాయితీగా పనిచేసే ఎంతో మంది నాయకులున్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ఓటు హక్కు ను ఉపయోగించుకొని వారిని సమర్థించాలి. ఓటు ఎంతో పవిత్రమైందని, కావున నిజాయితీగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. ఎన్నికల్లో ప్రలోభాలకు లోను కాకుండా నిజాయితీగా ఓటు వేయాలి. ఓటరు క్యూ ఇన్ఫర్మేషన్ విధానంపై ప్రత్యేకంగా ఒక యాప్‌ను తయారు చేశారు. ఆ యాప్ ద్వారా క్యూలైన్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారో తెలుసుకోవడం వీలవుతుందని తద్వారా మనకు ఏ సమయంలో వీలయితే ఆ సమయంలో వెళ్లి మన ఓటు హక్కు ను ఉపయోగించుకుని రావచ్చు.

భారతదేశం ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ప్రజాస్వామ్యం అన్న సంగతి అందరికీ తెలిసిందే. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మ వంటిది. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, భారతీయ శిక్షా స్మృతులతో పాటు ఎన్నో చట్టాలు ఎన్నికల ప్రక్రియ పరిశుద్ధంగా, నీతివంతంగా, అత్యంత పారదర్శకంగా జరగడం కోసం ఎన్నో నియమాలు, సూత్రాలు పొందుపరిచాయి. ఎన్నికలు సజావుగా సక్రమంగా శాంతియుతంగా జరగకుండా అడ్డుపడిన వ్యక్తులను కానీ శక్తులను కానీ కఠినంగా శిక్షించడానికి కట్టుదిట్టమైన చట్టాలు కూడా ఏర్పరిచారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా కొనసాగించడంలో పౌరసమాజం పాత్ర గణనీయమైనది. ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ప్రజలే పరిపాలకులు. మనం వేసే ఓటు మన భవిష్యత్తు, రాబోయే తరాల మనుగడ నిర్ణయిస్తాయి. కానీ మనదేశంలో ఎన్నికల పరిస్థితి ఎంతో దారుణంగా ఉంది. ఎన్నికల సమయంలో దేశం మొత్తంలో 60 శాతం పోలింగ్ కూడా నమోదు కావడం లేదు. మన దేశంలో పరిస్థితి ఇలా ఉంటే ఇతర దేశాల్లో మాత్రం ఓటు వేయడం తప్పనిసరి. ఒకవేళ ఓటు వేయకుండా లైట్‌గా తీసుకుంటే ఎన్నికల సంఘం జరిమానా పత్రం ఇంటికి పంపుతుంది. అంతేకాదు చట్టబద్ధమైన చర్యలు తీసుకునే అవకాశాలు కూడా ఉన్నాయి. మన దేశంలో ఓటింగ్ రోజును చాలా మంది కేవలం సెలవు దినంగా మాత్రమే చూస్తారు. ఓటు ప్రాముఖ్యతను ఎంతమంది ఎన్నిరకాలుగా చెప్పినా పట్టించుకునే నాథులు మనదేశంలో చాలా అరుదు. కానీ కొన్ని దేశాల్లో ఓటు వేయకపోతే ఫైన్ కట్టాల్సిందే. అంటే తప్పు చేసినట్టే..ఆస్ట్రియా, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, అమెరికా, బెల్జియం, గ్రీస్, ఇటలీ, మెక్సికో, ఫిలిప్పిన్, సింగపూర్, థాయిలాండ్, టర్కీ, స్విర్జర్లాండ్, బ్రెజిల్, బొలీవియా తదితర దేశాల్లో ఓటు వేయకపోతే కఠిన చర్యలు తీసుకొని, వారి ఓటు హక్కును తొలగిస్తారు. కానీ మన భారతదేశంలో ఓటు హక్కు తప్పనిసరి కాదు. మీకిష్టమైతే ఓటు వేయండి లేకపోతే లేదు అనే ప్రత్యామ్నాయాలు లేకపోలేదు. అందుకే ఇప్పటివరకు మన దేశంలో 60 శాతం మించి పోలింగ్ జరగలేదు. కాబట్టి ఈసారైనా ఓటు వేయడం ప్రతి భారతీయుడు బాధ్యత అంటూ మనదేశంలో కూడా ఓటును తప్పని సరి చేయాలంటూ కొంతమంది ప్రజాస్వామ్యవాదులు బలంగా డిమాండ్ చేస్తున్నారు. ఇటు ఎన్నికల సంఘం కూడా ఓటు హక్కుపై అందరూ బాధ్యతగా వ్యవహరించాలని ప్రచారం చేస్తుంది.ఇది సాధించాలంటే ముందు దొంగ ఓట్లు తీసేయ్యాలి.గంటలు గంటలు క్యూ లైన్లలో నిలబడి తీరా మన వంతు వచ్చేసరికి నీకు ఓటు లేదు, నీ ఓటు ఎవరో వేసి వెళ్ళారు అనే మాటలు తరచూ వింటుంటాము.అలాగే కొన్ని చోట్లా గుండగుత్తగా కొందరి ఓట్లు తొలగిస్తున్నారు . వీటి వల్ల ఎన్నికలంటే సామాన్య జనాలకు కొంత నిర్లిప్తత ఏర్పడడం సహజం. ఇటువంటి వాటికి ఎన్నికల సంఘం చెక్ పెట్టాలన్న ఆలోచన ఎందుకో చేయడం లేదు . ఆధార్ కార్డు తో లింక్ చేస్తే ఇలాంటి ఎన్నో ఎన్నికల అక్రమాలను చాల వరకు తగ్గించుకోవచ్చు. నిర్వహణ ఖర్చు కూడా చాల తగ్గుతుంది. ఎందుకో మరి ఆ దిశలో పెద్దలు ఎవరూ ఆలోచించడం లేదు.ఇలాంటివి చేస్తూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్క పౌరుడు తప్పని సరిగా ఓటు హక్కు వినియోగించుకోనేలా తప్పని సరి చట్టం తీసుకొని రావాలి. నిలబడ్డ అభ్యర్థులు నచ్చక పోతే నోటా ఎలాగూ ఉంది. కాబట్టి ఖచ్చితంగా ఓటు హక్కు వినియోగించేలా ప్రతి పౌరున్ని మేల్కొనేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల కమీషన్, ప్రభుత్వ పెద్దలు చూడాలి. అపుడే మన దేశంలో ప్రజాస్వామ్యం విజయవంతమైనట్లు. చూద్దాం.. రాబోయే రోజులలో అయినా మన ప్రభుత్వం ఓటు వేయడాన్ని తప్పనిసరి చేస్తుందో లేదో....!



– కాళంరాజు వేణుగోపాల్
8106204412

ప్రకటనలు – ఊహనలు

ఈ క్రింది ప్రకటనలను క్షుణ్ణంగా చదివి సరైన ఊహనను ఎంచుకోండి. ఒకవేళ ఊహన 1 నిజమైతే ans A అని, ఊహన 2 నిజమైతే ans B అని, ఒకవేళ ఊహన 1&2 నిజమైతే ans C అని, రెండు ఊహనలు తప్పైతే ans D అని, ఊహన 1 లేదా ఊహన 2లలో ఏదో ఒకటి మాత్రమే నిజమైతే ans E అని గుర్తించాలి.

1) ప్రకటన : 'కదిలే రైలు నుండి క్రిందకు దిగ కండి' రైల్వే శాఖ ప్రకటన.

ఊహన 1: కదిలే రైలు నుండి క్రిందికి దిగినట్లయితే ప్రమాదం జరుగుతుంది.

ఊహన 2: పై ప్రకటన ప్రయాణికులపై కొంత ప్రభావం చూపి వారు జాగ్రత్తగా ఉండేలా చేస్తుంది.

2) ప్రకటన : పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులందరూ పెన్సిల్ తెచ్చుకోవాలి ఇన్విజిలేటర్ వద్ద కొన్ని పెన్సిల్స్ మాత్రమే అందుబాటులో ఉంటాయి.

ఊహన 1: పొరపాటున పెన్సిల్స్ మర్చిపోయిన లేదా పోగొట్టుకున్న అభ్యర్థులు ఇన్విజిలేటర్ వద్ద పెన్సిల్ పొందొచ్చు.

ఊహన 2: విద్యార్థులందరూ ఖచ్చితంగా వారి పెన్సిల్ వారే తెచ్చుకోవాలి.

3) ప్రకటన: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు.

ఊహన 1: మధ్యాహ్న భోజన పథకానికి ఆకర్షితులై పిల్లలు స్కూల్‌కి తప్పక హాజరవుతారు.

ఊహన 2: తినడానికి కూడా లేని పిల్ల పేద పిల్లలు మాత్రమే స్కూల్‌కి హాజరవ్వాలి.

4) ప్రకటన : ఢిల్లీ నుండి బెంగళూరు వెళ్లడానికి విమాన ప్రయాణం ద్వారా తక్కువ సమయం పడుతుంది.

ఊహన 1: ఢిల్లీ నుండి బెంగుళూరుకు విమాన మార్గం ఉన్నది.

ఊహన 2: ఢిల్లీ నుండి బెంగళూరు కు విమాన మార్గం తప్ప వేరే ఎటువంటి రవాణా మార్గాలు లేవు.

5) ప్రకటన: ప్రభుత్వం వారు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ ఇవ్వడం ఆపివేశారు కానీ ఎలాంటి ఆంక్షలు విధించలేదు.

ఊహన 1: ఇక నుండి ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ కొనే వారు అధిక ధరలు చెల్లించాల్సి ఉంటుంది.

ఊహన 2: ప్రజలందరూ ఎల్పీజీ వాడకం ఆపివేసి కిరోసిన్ వాడకం అలవాటు చేసుకోవాలి.

6) ప్రకటన: అతిథులు రాగానే లంచ్ ఏర్పాటు చేయండి నా కోసం ఎదురు చూడవద్దు నేను కొంచెం లేటుగా రావచ్చు ఒక కంపెనీ డైరెక్టర్ కంపెనీ మేనేజర్ కు పంపిన మెసేజ్.

ఊహన 1: లంచ్ సమయానికి ఆహార పదార్థాలు అందుబాటులో ఉండవు.

ఊహన 2: అతిధులను వేచి ఉండేట్లు చేయటం మర్యాద కాదు.

7) ప్రకటన: నా ఆర్థిక పరిస్థితి సరిగా లేనప్పుడు నేను నా స్నేహితుడు raghava పై నమ్మకం పెట్టుకోవడం నా పొరపాటే.

ఊహన 1: రాఘవ ఆర్థిక పరిస్థితి కూడా బాగోలేదు.

ఊహన 2: ఎవరికి ఏ కష్టం వచ్చినా రాఘవ ఆదుకోడు.

8) ప్రకటన: ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన మరియు గాయపడిన వారికి ప్రభుత్వం పరిహారం చెల్లించాలని నిర్ణయించింది.

ఊహన 1: ఈ విధంగా చేయడం వలన భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగవు.

ఊహన 2: ఈ పరిహారం వలన బాధితులకు కొంతయినా ఉపశమనం కలుగుతుంది.

9) ప్రకటన: చాలా సంస్థలు ప్రస్తుతం ఆన్‌లైన్ పరీక్ష విధానాన్ని ప్రవేశపెట్టాయి.

ఊహన 1: దేశంలోని అన్ని ప్రాంతాల వారు కంప్యూటర్ల ద్వారా పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది.

ఊహన 2: దీనివలన పరీక్షలు నిర్వహించడానికి అయ్యే ఖర్చు తగ్గుతుంది.

10) ప్రకటన : నీవు రాసేటప్పుడు చక్కగా వేగంగా రాయాలంటే 0.7 పెన్నునే వాడాలి.

ఊహన 1: మార్కెట్లో అనేక రకాల పెన్నులు అందుబాటులో ఉన్నాయి.

ఊహన 2: విద్యార్థులందరూ 0.7 పెన్నుతోనే రాయాలి.

11) ప్రకటన: 'ఫీజు చెల్లించని విద్యార్థులందరూ ఈ నెల 15వ తేదీలోగా కచ్చితంగా ఫీజు చెల్లించాలి.' ఒక స్కూలు నోటీసు బోర్డులో విద్యార్థులకు ఇచ్చిన నోటీస్.

ఊహన 1: 15వ తారీఖు లోపు ఫీజు చెల్లించ నీ విద్యార్థులు స్కూలుకి ఆ తర్వాత రావలసిన అవసరం లేదు.

ఊహన 2: 15వ తారీకు లోపు ఫీజు చెల్లించకపోతే ఫీజు చెల్లించిన వారిని మరియు చెల్లించని వారిని వేర్వేరు తరగతి గదులలో ఉంచుతారు

12) ప్రకటన: విద్యార్థులందరూ ఐక్యమత్యంతో మెలగాలి.

ఊహన 1: ఉమ్మడిగా ఉంటే ఎలాంటి సమస్యనైనా సులువుగా పరిష్కరించుకోవచ్చు ను.

ఊహన 2: ఐక్యమత్యంగా లేని విద్యార్థులందరూ పాఠశాల నుండి బహిష్కరింపబడతారు.

13) ప్రకటన: భారతదేశంలో కొత్తగా విడుదలైన'A' పుస్తకమును ప్రజలందరూ విరివిగా కొని చదువుతున్నారు.

ఊహన 1: ఈ పుస్తకం విడుదలకు ముందు భారతదేశంలో పుస్తక పఠనాసక్తి గల వారి సంఖ్య అల్పం.

ఊహన 2: ఈ పుస్తక రచయిత రాసిన పుస్తకాలను ఇంటిలోనికి ఇదే అతి తక్కువ ధర కలిగిన పుస్తకం.

14) ప్రకటన: పొడవైన క్యూలలో నిలబడకుండా మీ టికెట్లను ఇంటర్నెట్లో బుక్ చేసుకోండి.

ఊహన 1: ఈ రోజుల్లో చాలామంది ప్రజలు ఇంటర్నెట్లో టికెట్లు బుక్ చేసుకోవడానికే ఇష్టపడుతున్నారు.

ఊహన 2: ఇంటర్నెట్‌లోనే కాకుండా టికెట్లు ఇతర ప్రదేశాలలో కూడా లభిస్తాయి.

15) ప్రకటన : V.I.Pల కార్లు పార్కింగ్ చేయవలసిన ప్రదేశంలో పార్క్ చేసిన వేరే కార్లను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు.

ఊహన 1: కొంతమంది వ్యక్తులకు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఉన్నాయి.

ఊహన 2: V.I.P లకు మరియు సాధారణ ప్రజలకు వేర్వేరు పార్కింగ్ ప్రదేశాలు కలవు.

16) ప్రకటన: private ఆస్తి అతిక్రమించిన వారు శిక్షింపబడుదురు ఒక స్థలం వద్ద ఉంచబడిన నోటీస్.

ఊహన 1: ఆ నోటీసు చూసిన వారు ఎవరూ ఆ స్థలం జోలికి వెళ్ళరు.

ఊహన 2: శిక్షకు భయపడి ప్రజలు ఎవరూ ఆ స్థలాన్ని ఆక్రమించే సాహసం చేయరు.

17) ప్రకటన: శాంతికి వ్యతిరేకంగా అనేక దేశాలు ఉన్నప్పటికీ యుద్ధంను తీవ్రంగా వ్యతిరేకించారు.

ఊహన 1: యుద్ధాల్లో అమాయక ప్రజలు కూడా చనిపోతారు.

ఊహన 2: యుద్ధం జరిగినట్లయితే మనం ఓడిపోయే ప్రమాదం కూడా ఉన్నది.

18) ప్రకటన: ఆర్థికంగా ఎదుగుదల సాధించాలంటే ప్రజలందరూ కష్టపడి పనిచేయాలి.

ఊహన 1: ఆర్థికంగా ఎదగడం అందరికీ అవసరం

ఊహన 2: కష్టపడి పనిచేయడం అసాధ్యమేమీ కాదు

19) ప్రకటన: అతను బాగా కష్టపడుతున్నప్పటికీ పేదవాడే

ఊహన 1: మనస్తత్వం ఉన్న పేదరికంలో ఉన్న వారు చాలా మంది ఉన్నారు

ఊహన 2: బాగా బద్ధకస్తులు కూడా ధనవంతులు అవుతారు

20) ప్రకటన: 'సందర్శకులు లిఫ్టును వాడవచ్చు' ప్రమాదాలకు బాధ్యత మాది కాదు

ఊహన 1: లిఫ్ట్ వాడటం ఎల్లప్పుడూ సురక్షితం కాదు కొన్నిసార్లు ప్రమాదాలు జరగవచ్చు

ఊహన 2: సందర్శకులు ఎవరూ లిఫ్ట్ వాడటంపై అంత ఆసక్తి చూపరు.

ANS: 1) C 2) C 3) A 4) A 5) A 6) B 7) D 8) B 9) A 10) A 11) D 12) A 13) D 14) C 15) C 16) C 17) A 18) C 19) A 20) A



– ముత్తినేని వీరయ్య
ఎంఫిల్, మ్యాథ్స్, బీఈడీ
గణిత విశ్లేషకులు,
అర్థమేటిక్& రీజనింగ్
షార్ట్ కట్స్ రచయిత,
సీనియర్ కాలమిస్ట్,
డైరెక్టర్, రామానుజన్ స్టడీ సర్కిల్

'స్టార్టప్'లోకి దూకడం మంచిదేనా..?

ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న 70శాతం మంది ఉద్యోగులు.. తాము చేస్తున్న ఉద్యోగానికి, చదివిన చదువుకు పొంతన లేదని చెబుతుంటారు. ఎన్నో సర్వేల్లో ఈ విషయం నిరూపితమైంది. యువతరం కొత్త ఆలోచనలతో స్టార్టప్‌లోకి అడుగుపెడుతున్న దశలో ఇప్పుడు విద్యార్హత ప్రధానాంశం కాదు. ఆలోచనలు, అనుభవమే ముఖ్యం.

స్టార్టప్‌లు పెట్టి ఫెయిలయిన వాళ్లు, స్టార్టప్ ఛాలెంజ్‌లో నిలబడానుకునే వాళ్లు, ఎంఎన్‌సీ కంపెనీల్లో మంచి జీతం పొందుతున్న వాళ్లు.. ఇలా అనేక మందికి స్టార్టప్‌లలో ఆఫర్లు వస్తుండటం ఇప్పుడు కామన్. అయితే వీరందరికి ఒకటే సందేహం. తాము స్టార్టప్ లలో ఇమడగలమా..? స్టార్టప్ ఉద్యోగంలో చేరడం మంచిదేనా...? కొన్ని అంశాలలో తమను తాము విశ్లేషించుకుంటే తుది నిర్ణయం తీసుకోవడం సులువే.



ఆహా.. నాకేంటట..? నాకేంటి..? స్టార్టప్ కంపెనీలో చేరేముందు మొట్టమొదటగా వేసుకోవాల్సిన ప్రశ్న ఇదే. ఆ స్టార్టప్‌కి మన వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి..? మనం ఆ స్టార్టప్‌కి కొత్తగా చేర్చే వాల్యూ ఏమీ లేదని భావిస్తే అందులో చేరాల్సిన అవసరమే లేదు. మనకి అన్ని రకాల స్కిల్స్ ఉన్నప్పటికీ ఏ విధంగా వాటిని స్టార్టప్‌కు ఉపయోగపడే విధంగా ఎలా ఉపయోగించాలనేదానిపై స్పష్టమైన అవగాహన ఉండాలి. ప్రావీణ్యం కన్నా ముందుగా స్టార్టప్‌లో పనిచేయగలిగే యాటిట్యూడ్ ఉండాలి. ఇవన్నీ ఉంటే స్టార్టప్‌లో జాయినవడానికి పెద్దగా ఆలోచించాల్సిన పని లేదు. మీరు కాన్ఫిడెంట్‌గా ఉండే స్టార్టప్ ఫౌండర్లకు మరింత స్పష్టత వస్తుంది. అప్పుడు ది బెస్ట్ అవుట్ పుట్ రావడానికి అవకాశం ఉంటుంది.

ఎవరితో పనిచేయబోతున్నామనేది ముఖ్యం

రెండో అత్యంత ముఖ్యమైన విషయం.. మనం ఎవరితో పనిచేయబోతున్నామనేది తెలుసుకోవడం. స్టార్టప్ ఫౌండర్స్, నిర్వహణ బృందం గురించి వారి బ్యాక్ గ్రౌండ్, పనితీరుపై మనం స్పష్టమైన అవగాహన తెచ్చుకోగలగాలి. మంచి వాళ్లు మరింత మంచివాళ్లను ఆకర్షిస్తారనేది సిద్ధాంతం. అందుకే వారు మరింత మంచి టీంను రెడీ చేసుకుంటారు. పనిని అస్వాదించే అవకాశం లేని వ్యక్తుల దగ్గర చేరకపోవడమే మంచిది. మంచి వ్యక్తులతో పనిచేసేటప్పుడు వచ్చే ఆనందం మరెక్కడా రాదు.

స్టార్టప్ లో నా రోల్ ఏమిటి..? నేను న్యాయం చేయగలనా..? స్టార్టప్ లో చేరాలని నిర్ణయించుకున్న తర్వాత ఆలోచించాల్సిన మొట్టమొదటి విషయం ఇది. నా లక్ష్యాలు, కంపెనీ లక్ష్యాలు సరిపోతాయా..? ప్రతి ఉద్యోగికి చేస్తున్న పని పట్ల ఎలాంటి స్పష్టత ఉంటుందో.. సాధించాల్సిన లక్ష్యాలపట్లే అంతే స్పష్టత ఉండాలి. అదే విధంగా కంపెనీ తన నుంచి ఆశిస్తున్న లక్ష్యాలేమిటి అనేదానిపైనా స్పష్టమైన అవగాహన ఉండాలి. వ్యక్తిగత లక్ష్యాల కన్నా సంస్థ ఆశిస్తున్న వాటి పైనే ఉద్యోగి దృష్టిపెట్టాలి. అవసరమైతే వ్యక్తిగత లక్ష్యాలను పోస్ట్ పోన్ చేసుకున్నా తప్పేం కాదు.

ప్రావీణ్యాన్ని పెంచుకునే అవకాశం లభిస్తుందా..?

నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియ. ఏ అంశాన్ని పూర్తిగా తెలుసుకోలేం. స్టార్టప్‌లో మన బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంమలోనే మనకు ఆసక్తి, స్కిల్స్ ఉన్న రంగాల్లో మరింత నేర్చుకోవడానికి అవకాశం పొందే విషయంలో ఏ మాత్రం ఆలోచించాల్సిన అవసరం లేదు. అలా పెంచుకుంటే మరిన్ని అవకాశాలు పెరుగుతాయి. మరింత సమర్థంగా స్టార్టప్‌కి సేవలు అందించవచ్చు. చేస్తున్న పని నుంచే ప్రావీణ్యం పెంచుకునే ప్రయత్నం చేయగలగాలి. ఆ అవకాశం లభిస్తుందో లేదో అంచనా వేసుకోవాలి.

ఆదాయం గురించి చూసుకోవాలి..

ఈక్విటీ కానీ శాలరీ కానీ మన కంట్రిబ్యూషన్ కు అనుగుణంగా స్టార్టప్ నుంచి మనకు సంతృప్తికర స్థాయిలో ప్రతిఫలం వస్తుందో లేదో అంచనా వేసుకోవాలి. అయితే దీని గురించి చర్చను వీలైనంత త్వరగా ముగించాలి. వ్యక్తిగత సంబంధాలను తీవ్రంగా దెబ్బ తీసే అంశాలలో ఇదే మొదట ఉంటుంది. ఒక మాటలో చెప్పాలంటే స్టార్టప్ లో చేరే సమయంలో దీని గురించి చర్చించడం అనవసరం. మీ అవసరాన్ని గుర్తించి వారెంతో ఆఫర్ చేస్తారో.. దానికి ఓకే అయితే చేరిపోవడం మంచి లేదంటే.. ఆఫర్‌ను పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

ప్రణాళిక అవసరం..

అన్నింటితో పాటు స్టార్టప్ నుంచి బయటకు వెళ్లేందుకు కూడా ముందుగానే ఓ ప్రణాళిక వేసుకోవడం ఉత్తమం. మంచి టీమ్‌తో పనిచేయడానికి మీరు సిద్ధపడి స్టార్టప్ లో చేరి ఉంటారు. కానీ తర్వాత మనకు సరిపడని వాళ్లు, పనితీరు నచ్చని వాళ్లు వచ్చి చేరితే మనకు అసౌకర్యం. అందుకే ఈ విషయంపైనా క్లారిటీతో ఉండాలి. స్టార్టప్ లో చేరే అవకాశం వచ్చినప్పుడు ఈ అంశాలన్నింటినీ బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకుంటే మెమరబుల్ జర్నీగా ఉండొచ్చు.

Miscarriage (Abortion)

(నిన్నటి తరువాయి)

B. Counseling & explanation:

C. When can try again :

D. Best to wait for 3 months before trying again . This time allow to regulate cycles and to know the LMP, to give folic acid, and to allow the patient to be in the best shape (physically and emotionally) for the next pregnancy

E. Why has it happened

F. In the majority of cases there is no obvious cause

G. In the first trimester abortion, the most common cause is fetal chromosomal abnormality

H. Counseling & explanation:

I. Can it happen again

J. As the commonest cause is the fetal chromosomal abnormality which is not a recurrent cause , so the chance of successful pregnancy next time in the absence of obvious cause is very high even after 2 or 3 abortions

K. Not to feel guilty –as it is extremely unlikely that anything the patient did can cause abortion

L. No evidence that intercourse in early pregnancy is harmful

M. No evidence that bed rest will prevent it

6. Recurrent abortion

Definition:

– Is defined as 3 or more consecutive spontaneous abortions

– It may presented clinically as any of other types of abortions .

Types :

– **Primary :** All pregnancies have ended in loss

– **Secondary :** One pregnancy or more has proceeded to viability(>24 weeks gestation) with all others ending in loss

Incidence :

– occurs in about 1% of women of reproductive age .

Causes

• Idiopathic recurrent abortion, in about 50%, in which no cause canbe found.

• The known causes include the followings :

1. Chromosomal disorders:

– Fetal chromosomal abnormalities & structural abnormalities

– Parental balanced translocation

2. Anatomical disorders:

– Cervical incompetence: –congenital and aquired

Uterine causes: –submucous fibroids, uterine anomalies &Asherman's syndrome

Causes

3. Medical disorders:

– Endocrine disorders : diabetes , thyroid disorders, PCOS & corpus luteum insufficiency .

– Immunological disorders : Anticardiolipin syndrome & SLE.

– Thrombophilia: congenital deficiency of Protein C&S and antithrombin III, & presence of factor V leiden.

– Infections

– ToRCH – CMV may be a cause of recurrentabortion, but ToRH are not causes of recurrent abortion.

– Genital tract infection e.g Bacterial vaginosis

– Rh – isoimmunization

Diagnosis :

1. History:

– Previous abortions : gestational age and place of abortions & fetal abnormalities.

– Medical history : DM, thyroid disorders, PCOS, autoimmune diseases & thrombophilia.

2. Examination :

– General : weight, thyroid & hair distribution

– Pelvic: cervix (length& dilatation) and uterine size.

Diagnosis :

3. investigations:

A. Investigations for medical disorders:

– Blood grouping & indirect Coomb's test in Rh –ve women

– Endocrinal screening: Blood sugar, TFT & LH /FSH ratio

– Immunological screening: Anti anticardiolipine antibodies& lupus inhibitor.

– Thrombophilia screening: Protein C & S, antithrombin III levels, factor V leiden, APTT and PT.

– Infection screening

– High vaginal & cervical swabs

– ToRCH profile (which scientifically is not necessary)

Diagnosis :

3. investigations:

B. Investigations for anatomical disorders:

– TV/US: fibroids, cervical incompetence & PCOS.

– Hystroscopy or HSG, fibroids, cervical incompetence, uterine anomalies &Asherman's syndrome

C. Investigations for chromosomal disorders:

– Parental karyotyping: Parental balanced translocation.

– Fetal karyotyping: Fetal chromosomal anomalies.

Management :

3. in idiopathic recurrent abortion.

With support and good antenatal care, the chance of successful spontaneous pregnancy is about 60–70%

– **Support :** from husband, family & obstetric staff.

– **Advice :** stop smoking & alcohol intake, decrease physical activity

– **Tender loving care**

– **Drug therapy**

• Progesterone &hCG: start from the luteal phase & up to 12 weeks.

• Low dose aspirin (75 mg/day) start from the diagnosis of pregnancy & up to 37 weeks

• LMWH (2040 mg/day) start from the diagnosis of fetal heart activity & up to 37 ws

Management:

3. In the presence of a cause treatment is directed to control the cause

– Endocrine disorders

• Control DM and thyroid disorders before pregnancy

• Ovulation induction drugs, ovarian drilling or IVF in PCOS.

• Progesterone or hCG in corpus luteum insufficiency.

– :In anticardiolipin syndrome:

• Low dose aspirin (75 mg/day) &prednisilone (20–30 mg/ day), starting when pregnancy is diagnosed till 37 weeks.

• These drugs are not teratogenic.

Management:

– **In infection::** treatment of the genital tract infection.

–In Rh isoimmunization: Repeated intrauterine transfusion

– **In parental balanced translocation**

• Explain the risk of fetal chromosomal disorders (about 30%)

• Encourage to try again or adoption.

నర్సింగ్ పోటీ పరీక్షల కోసం

SUBJECT : MIDWIFERY

As the commonest cause is the fetal chromosomal abnormality which is not a recurrent cause, so the chance of successful pregnancy next time in the absence of obvious cause is very high even after 2 or 3 abortions.





– Mrs. Madhulika uday
మేనేజర్, నర్సింగ్ ఎడ్యుకేషన్,
అపోలో మెడ్‌స్కిల్స్ లిమిటెడ్,
హైదరాబాద్

పదవ తరగతి విద్యార్థుల కోసం..

విసర్జన – వ్యర్థాల తొలగింపు వ్యవస్థ

I. ఒక్క మార్కు ప్రశ్నలు:

01. ఎక్కువ నీరు తాగినపుడు వాసోప్రెస్సిన్ ఎందుకు ఉత్పత్తి కాదు?
02. పోడోసైట్స్ విధి ఏమిటి?
03. యూరేమియా అనగానేమి?
04. టానిన్‌ల ప్రయోజనం ఏమిటి?
05. కణాలన్నింటికి విసర్జన క్రియ అవసరమా?
06. ప్రజల్లో అవయవదానం పట్ల అవగాహన కల్పించడానికి ఏవేని రెండు నినాదాలు వ్రాయండి?

II. రెండు మార్కుల ప్రశ్నలు

01. మూత్రపిండాల గురించి తెలుసుకొనుటకు నెఫ్రాలజిస్టును ఏ ప్రశ్నలు అడుగుతారు?
02. కొంతమంది పిల్లలు 15 లేదా 16 సంవత్సరాలు వచ్చేవరకు కూడా రాత్రి పూట నిద్రలో పక్క తడుపుతుంటారు. ఎందుకు?
03. విసర్జించడం, స్రవించడం మధ్యగల బేధాలేవి?
04. శీతాకాలంలో ఎక్కువసార్లు మూత్రవిసర్జన చేయవలసి వస్తుంది. ఎందుకు?
05. అభివాహి ధమని వ్యాసం కంటే అపవాహి ధమని వ్యాసం తక్కువగా ఉంటుంది? ఎందుకు?
06. నెఫ్రాన్‌ను మూత్రపిండం యొక్క నిర్మాణాత్మక క్రియాత్మక ప్రమాణమని ఎందుకంటారు?

III. నాలుగు మార్కుల ప్రశ్నలు

01. మూత్రపిండాలు పనిచేయని వారికి రక్తాన్ని వడకట్టే విధానాన్ని వివరించండి? దానిలో ఇమిడి ఉన్న సూత్రం ఏమిటి?
02. మానవునిలో అనుబంధ విసర్జన అవయవాలను గూర్చి వివరించండి?
03. మూత్రం ఏర్పడే విధానంలోని దశలను వివరించండి?
04. మూత్రపిండం నిలువుకోత పటంగీచి భాగాలు గుర్తించండి?
05. ఈ క్రింది పట్టికను పరిశీలించి సమాధానాలు వ్రాయండి?

ఆల్కలాయిడ్	మొక్క పేరు	మొక్కలోని భాగం	ఉపయోగం
క్వినైన్	సిరకోనా అఫిసినాలిస్ (సింకోనా)	బెరుడు	మలేరియా నివారణ
నికోటిన్	నికోటియానా టొబాకమ్ (పొగాకు)	ఆకులు	క్రిమి సంహారిణి
మార్ఫిన్, కొకైన్	పపావర్ సొమ్నిఫిరమ్ (గంజాయి)	ఫలం	మత్తు మందు, నొప్పి నివారిణి
రిసర్పిన్	రవుల్ఫియా సర్పంటైన్ (సర్పగంధి)	వేరు	పాము కాటు నుండి రక్షణ
కెఫిన్	కాఫియా అరాబికా (కాఫీ మొక్క)	విత్తనాలు	నాడీ వ్యవస్థ ఉత్తేజకారకం
నింబిన్	అజాడిరక్త ఇండికా (వేప)	విత్తనాలు, బెరడు, ఆకులు	యాంటిసెప్టిక్
స్కోపోలమైన్	ఉమ్మెత్త	పండు, పువ్వు	మత్తు మందు
పైరిత్రాయిడ్స్	గడ్డి చామంతి	పుష్పాలు	కీటకనాశనులు

A) పాముకాటుకు ఉపయోగపడే ఆల్కలాయిడ్ ఏది?
B) నీవు మీ తోట నుండి హానికర కీటకాలను నిర్మూలించాలనుకుంటే ఏ ఆల్కలాయిడ్ ఉపయోగపడుతుంది?
C) మలేరియా వ్యాధికి మందును మొక్క ఏ భాగం నుంచి తయారుచేస్తారు?
D) మనకు హానికల్గించే ఆల్కలాయిడ్‌లు ఏమిటి?

06. క్రింది పట్టిక పరిశీలించి సమాధానాలు వ్రాయండి?

జీవి పేరు/వర్గం	విసర్జన వ్యవస్థ
ప్రోటోజోవా	కణ ఉపరితలం నుండి వ్యాపనం ద్వారా నీటిలోనికి
ప్లాటి హెల్మింథిస్	జ్వాలాకణాలు
అనెలిడా	నెఫ్రీడియా
ఇఖైనోడర్మేటా	జలప్రసరణ వ్యవస్థ
ఆర్థ్రోపోడా	హరితగ్రంథులు, మాల్ఫీజియన్ నాళికలు

A) ప్లాటిహెల్మింథిస్ వర్గ జీవులలో విసర్జక అవయవాలు ఏమిటి?
B) జలప్రసరణ వ్యవస్థ కలిగిన వర్గం ఏమిటి?
C) అమీబాలో విసర్జన ఏ పద్ధతి ద్వారా జరుగుతుంది?
D) ఆర్థ్రోపోడా వర్గ జీవుల్లో విసర్జన అవయవాలేవి?

IV. బహుళైచ్ఛిక ప్రశ్నలు

01. మూత్రపిండాలు పనిచేయకపోవడాన్ని ఏమందురు ( )
A) ESRD B) AIDS C) ATP D) యూరేమియా

02. ఈ క్రింది వానిలో విసర్జన అవయవం లేని జంతువును గుర్తించండి ( )
A) పక్షి B) అమీబా C) స్పంజికలు (D) B మరియు C

03. మూత్రం యొక్క PH విలువ ( )
A) 2 B) 3 C) 6 (D) 7

04. మూత్రం పసుపు రంగులో ఉండుటకు కారణమేమిటి? ( )
A) యూరోక్రోం B) బైలిరూబిన్ C) బైలివర్డిన్ (D) క్లోరైడ్స్

05. ఈ క్రింది వానిలో అదనపు విసర్జక అవయవం ( )
A) చిన్నప్రేగు B) మూత్రపిండం C) కాలేయం (D) భౌమన్ గుళిక

06. తక్కువ గాఢత గల మూత్ర విసర్జన చేయు స్థితి ( )
A) డయాబెటిస్ మిల్లిటెస్
B) చక్కెర వ్యాధి C) యూరేమియా
(D) డయాబెటిస్ ఇన్‌సిపిడిస్

సమాధానాలు: 01) A 02) B 03) c 04) A 05) c 06) D



– సుధాకర్ ఆవంత్స వెంకట
జీవశాస్త్ర ఉపాధ్యాయులు

మదర్ అండ్ డాటర్ ఫ్యాషన్



ఫ్యాషన్ ప్రపంచంలో ప్రతిదీ వినూత్నంగా ఉండాలని కోరుకుంటున్నారు నేటి తరం. పండగలు, ఫంక్షన్లు, పార్టీలు ఇలా ఎక్కడికి వెళ్లినా తామే సెంటారాఫ్‌ది ఎట్రాక్షన్‌గా ఉండాలన్న తపన ప్రతి ఒక్కరికి ఉంటుంది. వారి పిల్లల డ్రెస్‌ల విషయంలో జాలా జాగ్రత్తలు తీసుకుంటారు. మాములుగా కవలలు, అక్కచెల్లెళ్లు లేదా అన్నదమ్ములు స్పెషల్ అకేషన్లకు మ్యాచింగ్ డ్రస్లు వేసుకోవడం విరివిగా కనిపిస్తుంటుంది. అచ్చు ఇలాగే తల్లీకూతుళ్లు కూడా ఒకేలా డ్రస్ చేసుకుంటారు. కాని సంఖ్య కాస్త తక్కువనే చెప్పొచ్చు. అయితే ఈ పరిస్థితి కొంత కాలం క్రితంది. నేటి తరం మోడ్రన్ మమ్మీస్ అండ్ డాటర్స్ ఒకేలాంటి డ్రస్‌లు స్పెషల్‌గా డిజైన్ చేయించుకుంటున్నారు. హెవీ్వ మెటీరియల్స్‌తో కాకుండా తేలికగా ఉండే నెట్, జార్జెట్, క్రెఫ్ లాంటి క్లాత్‌కి ప్యాచ్ వర్క్, ఎంబ్రాయిడరీలతో అందంగా తీర్చిదిద్దుతున్నారు ఫ్యాషన్ డిజైనర్లు. వేడుకల్లో ప్రత్యేకంగా కనిపించాలంటే, తల్లీకూతుళ్లు ఒకే రకం డ్రస్సులు ధరించాలి. పైనుంచి కింది వరకూ ఒకే డిజైన్ కాకపోయినా, రంగులు రెండూ కలిస్తే చాలు! అలాగే వయసుకు తగ్గట్టు స్టిచింగ్‌లో చిన్న చిన్న మార్పులు కూడా చేసుకోవచ్చు.

ముఖ్యంగా వీటిని డిజైన్ చేసేటప్పుడు చిట్టి పొట్టి చిన్నారులను దృష్టిలో పెట్టకుని వీటిని డిజైన్ చేస్తుంటారు. అందుకే ఇవి ఇంత ప్రాచుర్యం పొందుతున్నాయి అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. బ్రైట్ కలర్స్‌లో ఉన్న మదర్ అండ్ డాటర్ ధస్తులు ధరించి స్పెషల్ అకేషన్లలో మరింత స్పెషల్‌గా కనిపిస్తున్నారు. అందుకే కాబోలు అక్కడక్కడా కాకుండా మార్కెట్లో ఇప్పుడు మదర్ అండ్ డాటర్ ఫ్యాషన్ విరివిగా కనిపిస్తోంది. మోడ్రన్ డ్రస్‌లనుంచి సంప్రదాయ సల్వార్ కమీజ్, చీరల వరకు అన్ని రకాలు లభిస్తున్నాయి. ముఖ్యంగా కలర్ కాంబినేషన్ల విషయంలో చాలా ఫోకస్ చేస్తున్నారు డిజైనర్లు. మరిక ఆలస్యం ఎందుకు తల్లీబిడ్డల ఫ్యాషన్ ఫాలో అయిపోండి.

స్వయంగా కట్టించుకోవాలనుకున్నప్పుడు కొన్ని మోడర్న్ దుస్తులు పెద్దలకి నప్పినట్టు పిల్లలకు నప్పకపోవచ్చు. ఇలాంటప్పుడు మొదట పిల్లలకు నప్పేలా దుస్తులు డిజైన్ చేసి కుట్టించి, వాటి ఆధారంగా పెద్దలు డ్రస్ కుట్టించుకోవాలి. ఇలాంటివి ఎంచుకునేటప్పుడు ఇద్దరికీ నప్పే రంగు, డిజైన్ గమనించుకోవాలి. ముదురు రంగుల్లో, భారీగా డిజైన్ చేసిన డ్రస్సులైతే చూడముచ్చటగా ఉంటాయి. ఈ సింపుల్ ట్రిక్ పాటిస్తే మ్యాచింగ్ సమస్య తలెత్తదు.అచ్చుగుద్దినట్టు ఒకేలా ఉంటే అందరి దృష్టి మీవైపే! ఇవిగో ఈ మ్యాచింగ్ డ్రస్సులు ధరించి ఇద్దరూ ముద్దు ముద్దుగా మురిసిపోండి!

– విజయారెడ్డి



















జడ అందం చూడు..



బంగారు బిళ్లలతో అలంకారం జడకు రెట్టింపు అందాన్నిస్తుంది. ఈ అందానికి పువ్వులు కూడా జోడించాలనుకుంటే ఇదిగో ఇలాంటి బంగారు జడ బిళ్లను జడ ఎంచుకోండి! బంగారు పువ్వుల అలంకరణతోపాటు, జడ చివరన జడకుచ్చులు కూడా వేస్తే జడకు నిండుదనం. తలలో పువ్వుల అలంకరణ చీరకట్టుకు చక్కగా నప్పుతుంది.

నల్లని జడ కనిపించాలనుకుంటే జడ పొడవునా కాకుండా ఇదిగో ఇలా బంగారు పువ్వులను దూర దూరంగా అమర్చాలి. జడ పొడవునా బంగారు పువ్వులు అమర్చుకుంటే జడ అసాంతం ధగధగలాడిపోతుంది. పువ్వులు వద్దనుకుంటే ఇదిగో ఇలా బంగారు పూలతో అలంకరించుకోండి!



పోచంపల్లితో స్టైలిష్ లుక్



పోచంపల్లి, ఇక్కత్ అంటే మనకు గుర్తుకు వచ్చేవి సంప్రదాయ చీరలు మాత్రమే.. కాని పోచంపల్లి, ఇక్కత్ మెటిరీయలతో నవ తరం మెచ్చే స్టైలిష్ లుక్‌తో డిజైన్ చూస్తున్నారు ఫ్యాషన్ డిజైనర్లు. కాసింత ఓపిక ఉండాలే కాని పోచంపల్లి క్లాత్‌తో మీరు కూడా మీకు నచ్చిన విధంగా డిజైన్ చేయించుకోచ్చు. కుర్తీస్ మొదలుకుని, లాంగ్ లెన్త్ ఫ్రాక్స్, లెహంగాస్, బ్లౌజ్‌లు, ఇలా చాలా రకాలుగా డిజైన్ చేయించుకోవచ్చు. మీకోసం కొన్ని డిజైన్స్ ఇచ్చాం మీరు ట్రై చేయండి..







అరటిపండు హల్వా

కావలసిన పదార్థాలు

పెద్ద అరటిపండ్లుఆరు, పంచదారరెండున్నర కప్పులు, నెయ్యిఒకటింపావు కప్పు, జీడిపప్పు50గ్రా, మైదాపిండి ఒకటింపావు కప్పు, వెనీలా ఎసెన్స్ఒక టేబుల్ స్పూను.

తయారుచేసే విధానం

ముందుగా అరటిపళ్లను ముక్కలుగా కోసుకోవాలి. స్టవ్ బాణలి ఉంచి అందులో నెయ్యి వేసి అది వేడెక్కాక అరటిపండు ముక్కలు వేసి వేయించాలి. ముక్కలు చల్లారాక మెత్తగా చేయాలి. దీనికి మైదాపిండి చేర్చి బాగా కలిపి, మిగిలిన నెయ్యి, పంచదార చేర్చి పిండిని బాగా కలుపుతూ వేగించాలి. పంచదార పాకం బాగా వచ్చిన తర్వాత వేయించిన జీడిపప్పు, వెనీలా ఎసెన్స్ వేసి కలపాలి. స్టీలు పళ్లెంలో బాగా నెయ్యి పూసి, హల్వా మాదిరిగా తయారైన స్వీట్‌ను పళ్లెంలో పోసి వెడల్పుగా చేయాలి. తర్వాత కావలసిన పరిమాణంలో ముక్కలు కోయాలి.

పోషకాల పరోటా

రోటీలు, చపాతీలు దేశవ్యాప్తంగా మనకి ముఖ్యాహారంగా ఉంటూ వచ్చాయి. చపాతీలైతే కేవలం నిమిషాల్లో తయారవుతాయి. కానీ కొంతమంది సమస్య ఏంటంటే, ఎన్నిరకాలుగా ప్రయత్నించినా, తమ చపాతీలు మెత్తగా రావు. వంటచేసేటప్పుడు, ఆ పదార్థాలను తయారుచేసే సరియైన విధానం తెలిసివుండటం ముఖ్యం. అలాగే, చపాతీలు చేసేటప్పుడు కూడా కొన్ని పాటించాల్సిన పద్ధతులున్నాయి. మెత్తని చపాతీ కావాలంటే గోధుమపిండిని వేడినీటితో మర్దనచేసి పక్కన అలా ఉంచండి (కనీసం 30నిమిషాలు). గోధుమలు శరీరానికి కావాల్సిన అన్ని రకాల పోషకాలను కలిగి ఉంటాయి. వీటి నుండి తయారు చేసిన చపాతీ వలన ఆరోగ్యం పెంపొందించటమే కాకుండా, ఇక్కడ తెలిపిన ప్రయోజనాలు కూడా కలుగచేస్తుంది.

చనా పరోటా




కావలసిన పదార్థాలు

గోధుమ పిండి ఒకటిన్నర కప్పు, నూనె 3 టేబుల్ స్పూన్లు, ఉప్పు రుచికి సరిపడా, నానబెట్టిన తెల్ల శెనగలు 1 కప్పు, ఉల్లిపాయ ముక్కలు 1/2 కప్పు, పచ్చిమిర్చి 4, అల్లం తరుగు 1/4 టీ స్పూను, కొత్తిమీర, కరివేపాకు తరుగు ఒక్కోటి 1/2 టీ స్పూను చొప్పున, కారం 1/2 టీ స్పూను, గరంమసాల 1/2 టీ స్పూను, పసుపు చిటికెడు.

తయారీ విధానం

గోధుమ పిండిలో ఉప్పు, రెండు టీ స్పూన్ల నూనె వేసి, సరిపడా నీళ్ళతో చపాతీ పిండి కలుపుకోవాలి. దానికి నూనె పట్టించి ఒక గంట సేపు నాననివ్వాలి. తరువాత శెనగలు, పచ్చిమిర్చి, కరివేపాకు, కొత్తిమీర, అల్లం తరుగులను మిక్సీలో వేసి కొద్దిగా నీళ్ళు చిలకరించి బరకగా ముద్ద చేయాలి. తరువాత ఒక కడాయిలో టేబుల్ స్పూను నూనె వేసి ఉల్లిపాయ ముక్కలను దోరగా వేగించుకోవాలి. ఆ తరువాత శెనగల ముద్ద వేసి పచ్చివాసన పోయేవరకూ వేగించి, కారం, పసుపు, గరం మసాల జల్లి మరో రెండు నిమిషాలు వేగించి దించేయాలి. తరువాత నిమ్మకాయ పరిమాణంలో చపాతీ పిండి తీసుకుని, దాని మధ్యలో ఉసిరికాయంత శెనగల మిశ్రమాన్ని పెట్టి మూసేసి, చపాతీలు ఒత్తుకోవాలి. ఈ చపాతీలను రెండు వైపులా నూనె వేస్తూ దోరగా వేగించుకోవాలి.

క్యాబేజి పరోటా



కావలసిన పదార్థాలు

క్యాబేజీ అర కిలో, అల్లం తగినంత, పచ్చిమిరపకాయలు 6, జీలకర్ర తగినంత, నూనె లేక నెయ్యి 50గ్రా, ఉప్పు, పసుపు సరిపడా, కొత్తిమీర 1 కట్ట, గోధుమపిండి అరకిలో.

తయారీ విధానం

ముందుగా క్యాబేజీని పెద్దముక్కలుగా తరిగి మిక్సీలో వేయాలి. కొంచె మెదిగిన వెంటనే అందులో అల్లం పచ్చిమిర్చి వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఇప్పుడు అందులో ఉప్పు, పసుపు వేసి బాగా కలపాలి. కొత్తిమీరని సన్నగా తురిమి ఇందులో కలుపుకోవాలి. ఒక పెద్ద ప్లేట్‌లో గోధుమపిండి పోసి అందులో క్యాబేజీ ముద్దని కలిపి నీరు పోసి బాగా కలిపి ఉండలుగా చేసుకోవాలి. వీటిని చపాతీలుగా వత్తుకుని కాల్చుకోవాలి. ఈ రొట్టెలను కొత్తిమీర పచ్చడి, టమాటాసాస్, జామ్‌తో కలిపి తింటే చాలా రుచిగా ఉంటాయి.

గుమ్మడి పరోటా




కావలసిన పదార్థాలు

గుమ్మడికాయ గుజ్జు ఒక కప్పు, మైదాపిండి మూడు కప్పులు, ఉప్పు కొద్దిగా, నూనె సరిపడా

తయారు చేసే విధానం

ఉడికించి పెట్టుకున్న గుమ్మడికాయ ముక్కల్ని ముద్దలా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. మైదాపిండిలో ఒక టేబుల్ స్పూన్ నూనె, తగినంత ఉప్పు, గుమ్మడికాయ ముద్ద, కొద్దిగా వేడినీళ్లు పోసి బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. ఈ పిండిని ఉండలుగా చేసుకుని పరోటాల్లా ఒత్తుకుంటే సరి.

హార్ట్ ఫెయిల్యూర్‌ను ఎలా గుర్తించాలి?



మన శరీరంలోని అన్ని అవయవాలకు రక్తాన్ని సరఫరా చేసే గుండె సరిపడనంత రక్తాన్ని సరఫరా చేయలేని స్థితిని హార్ట్ ఫెయిల్యూర్‌గా చెప్పవచ్చు. ఇలాంటి సమస్యతో బాధపడుతున్న కొందరిలో గుండె పూర్తిగా రక్తంతో నిండదు. మరి కొంత మందిలో గుండెకు రక్తాన్ని పంప్ చేసే సామర్థ్యం తగ్గిపోతుంది. మరికొంత మందిలో రెండు రకాల సమస్యలు ఉంటాయి. హార్ట్ ఫెయిల్యూర్ అనగానే గుండె పూర్తిగా ఆగిపోతుందని కాదు. కానీ హార్ట్ ఫెయిల్యూర్ అనేది చాలా ప్రమాదకరమైన స్థితి. ఈ దశలో సరైన సమయంలో సరైన వైద్యసాయం అందించడం ఎంతో ముఖ్యం.

హార్ట్ ఫెయిల్యూర్ లక్షణాలు

ఇటీవల వయస్సుతో సంబంధం లేకుండా హార్ట్ ఫెయిల్యూర్ కేసులు పెరుగుతున్నాయి. ఈ సమస్యలో గుండె క్రమంగా బలహీన పడుతూ ఉంటుంది. ఒక్కోసారి గుండెలోని కుడి భాగంలో లేదా రెండు వైపులా హార్ట్ ఫెయిల్యూర్ ఏర్పడవచ్చు. కుడి భాగంలో మాత్రమే సమస్య ఉన్నప్పుడు గుండె సరిపడినంత రక్తాన్ని ఊపిరితిత్తులకు సరఫరా చేయలేకపోవడం వల్ల ఆక్సీజన్ తగినంత అందదు. గుండెలో ఎడమవైపు సమస్య ఏర్పడినప్పుడు శరీరానికి సరిపడినంత ఆక్సీజన్ కలిగిన రక్తాన్ని పంపిణీ చేయలేదు. కుడి భాగంలో సమస్య ఏర్పడితే పాదాలు, చీలమండలం, కడుపు, కాలేయ భాగాల్లో నీరు చేరుతుంది. కుడి, ఎడమ రెండు భాగాల్లో గుండె బలహీన పడినప్పుడు ఊపిరితీసుకోవడంలో ఇబ్బంది, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి.

హార్ట్ ఫెయిల్యూర్‌కు కారణాలు

మారుతున్న జీవనశైలి, శారీరక వ్యాయామం లేకపోవడంతో పాటు బీపీ, అదుపులోలేని డయాబెటీస్, కరోనరి హార్ట్ డిసీజ్‌లు హార్ట్ ఫెయిల్యూర్‌కు కారణాలుగా చెప్పవచ్చు. వీటితోపాటు కార్డియో మయోపతి, గుండె కవాటాల్లో సమస్యలు, క్రమం తప్పిన గుండె లయ, రేడియేషన్, కీమోథెరఫి వంటి అనారోగ్య పరిస్థితులు కూడా కారణంగా చెప్పవచ్చు.

నిర్ధారణ

హార్ట్ ఫెయిల్యూర్ సమస్యను నిర్ధారించడానికి ముందు కుటుంబ ఆరోగ్య చరిత్ర తెలుసుకోవడంతో పాటు వైద్యపరీక్షలు చేస్తారు. హార్ట్ ఫెయిల్యూర్‌లో కనిపించే లక్షణాలు అనేక ఇతర అనారోగ్య సమస్యలలో కూడా కనిపిస్తాయి. కరోనరి హార్ట్ డిసీజ్ లాంటి సమస్యలుంటే ముందుగా పరీక్షించి నిర్ధారిస్తారు. గుండె రక్తాన్ని పంప్ చేసే సామర్థ్యాన్ని పరీక్షిస్తారు. ఫ్యామిలీలో ఇలాంటి సమస్య ఎవరికైనా ఉందా అనే విషయాన్ని నిర్ధారించుకుంటారు. హార్ట్ ఫెయిల్యూర్‌కు సరైన ససమయంలో సరైన చికిత్సను అందించడం ద్వారా జీవితకాలం పెంచడంతో పాటు ఆరోగ్యంగా జీవించేందుకు అవకాశం ఉంటుంది.

కార్డియాక్ రీసింక్రనైజేషన్ చికిత్స (సీఆర్‌టి)

కార్డియాక్ రీసింక్రనైజేషన్ చికిత్స ద్వారా హృదయ స్పందనను లయబద్ధం చేస్తారు. ఇలా లయ తప్పడాన్ని ఎరిథమియాస్ అంటారు. దీనిని సరిచేయడానికి ఒక చిన్న నాణెం పరిమాణంలో ఉన్న పేస్ మేకర్‌ను గొంతు కింది భాగంలో ఉన్న కాలర్ ఎముక కింద అమరుస్తారు. అది మూడు వైర్ల ద్వారా కొద్దిపాటి ఎలక్ట్రిసిటి పంపడం ద్వారా హృదయ స్పందనను క్రమబద్ధీకరిస్తూ ఉంటుంది. గుండె సరిగ్గా కొట్టుకోకపోవడం వల్ల సమస్య ఏర్పడుతున్నప్పుడు ఇలాంటి చికిత్స అందిస్తారు.

ఇంప్లాంటబుల్ కార్డియో డీఫైబ్రిలేటర్ (ఐసీడీ)

కొంతమందిలో గుండె చాలా బలహీనపడుతుంది. వారిలో తీవ్రమైన ఎరిథమియాస్ ఉంటుంది. ఇలాంటి వారికి ఐసిడి నుంచి చికిత్స అందిస్తారు. ఐసిడి అనేది ఒక చిన్న పరికరం. దీనిని ఛాతిలో లేదా పొట్టభాగంలో అమరుస్తారు. ఇది కూడా హృదయ స్పందనను లయబద్ధం చేయడానికి ఉపయోగపడుతుంది. కొన్ని సార్లు తీవ్రమైన అరిథమియాస్ వల్ల గుండె అకస్మాత్తుగా ఆగిపోవచ్చు. ఇలా అకస్మాత్తుగా గుండె ఆగిపోవడం వల్ల మెదడుకు రక్తప్రసరణ నిలిచిపోతుంది. తరువాత శరీరంలోని మిగిలిన అవయవాలకు కూడా రక్తప్రసరణ ఆగిపోతుంది. ఇలాంటి సందర్భాల్లో కొద్ది నిమిషాల వ్యవధిలో చికిత్స అందిస్తే తప్ప ప్రాణాపాయం నుంచి బయటపడటం అసాధ్యం.

గుండె మార్పిడి

కొంత మందిలో గుండె చాలా బలహీనడి తీవ్రమైన హార్ట్ ఫెయిల్యూర్ సమస్య ఏర్పడుతుంది. అలాంటి వారికి వీలైనంత వరకు ఆహార నియమాలు పాటిస్తూ, సరైన మందులు ఇస్తూ ప్రాణాలు కాపాడుతారు.

ఇలాంటి పరిస్థితుల్లో గుండె మార్పిడి ఒక్కటే పరిష్కారం. ఈ చికిత్సలో దాత నుంచి సేకరించిన ఆరోగ్యవంతమైన గుండెను అమరుస్తారు. ఆ గుండెను బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి సేకరిస్తారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

హార్ట్ ఫెయిల్యూర్ సమస్యకు శాశ్వత చికిత్స అందించడం వీలు కాదు కానీ లక్షణాలను అదుపు చేసి జీవితకాలంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించవచ్చు.

మందులు క్రమం తప్పకుండా వాడుతూ ఆహారంలో ఉప్పు తగ్గించి తీసుకోవడం వల్ల శరీరంలో ఎక్కువ ఫ్లూయిడ్స్ నిల్వ ఉండకుండా చేయవచ్చు. సోడియం తక్కువగా ఉన్న ఉప్పు వాడడం, తాజా పండ్లు, కూరగాయల నుంచి తీసిన పండ్ల రసాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలోకి తక్కువ సోడియం చేరుతుంది. ఇలా జాగ్రత్తలు పాటిస్తూ డాక్టర్ పర్యవేక్ష ణలో మందులు తీసుకోవడం వల్ల ఎలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్త పడవచ్చు.



డా॥ సాయి సుధాకర్
హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్, డైరెక్టర్ క్యాథ్‌ల్యాబ్, గ్లెనిగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్, లక్డీకాపూల్, హైదరాబాద్




పండగల్ని బ్లాక్ చేశారు!

దసరా .. సంక్రాంతి పండగలు అంటే బాక్సాఫీస్ బొనాంజ అన్న సంగతి తెలిసిందే. ఆ రెండు సీజన్లు సినిమాలు ఆడించే వాళ్లకు బాగా కలిసొస్తుంది. సెలవు దినాల్ని పుష్కలంగా క్యాష్ చేసుకునేందుకు ఉన్న ఆస్కారాన్ని ఏమాత్రం విడిచిపెట్టరు. అందుకే ఈసారి అక్కినేని కాంపౌండ్ ఈ రెండు పండగల్ని బ్లాక్ చేస్తోంది. అందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేశారట. 2019ని అక్కినేని కాంపౌండ్ తమకు ఫేవర్‌గా మార్చుకునేందుకు సన్నాహకాల్లో ఉన్నారు. ముఖ్యంగా దసరాని అక్కినేని నాగచైతన్య, సంక్రాంతిని కింగ్ నాగార్జున లాక్ చేస్తున్నారట. ఈనెల చివరిలో వెంకటేష్ నాగచైతన్య కథానాయకులుగా 'వెంకీ మామ' చిత్రం ప్రారంభమవుతుందని తెలుస్తోంది.

ఈ చిత్రాన్ని వేగంగా పూర్తి చేసి దసరా సెలవుల్లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అలాగే కింగ్ నాగార్జున కథానాయకుడిగా కళ్యాణ్ కృష్ణ దర్శకత్వ ంలో తెరకెక్కనున్న 'బంగార్రాజు' చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ చేస్తారని తెలుస్తోంది. ఈ సినిమాని తొందర్లోనే ప్రారంభించేందుకు రెడీ అవుతున్నారు. అలాగే వారం గ్యాప్‌లో నాగార్జున మన్మథుడు 2 చిత్రాన్ని ప్రారంభిస్తారని తెలుస్తోంది.







శంకర్ లవర్ అనూ ఇమ్మాన్యుయేల్

ఎనర్జిటిక్ హీరో రామ్ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పూరి కనెకట్స్ నిర్మిస్తున్న తాజా చిత్రం 'ఇస్మార్ట్ శంకర్' ఇటీవలే ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ సినిమాకి ప్రస్తుతం కాస్టింగ్ సెలక్షన్స్ సాగుతున్నాయి. ఛార్మి స్వయంగా ఈ బాధ్యతల్ని చేపట్టారని తెలుస్తోంది. ఆసక్తికరంగా ఈ టీమ్‌తో అను ఇమ్మాన్యుయేల్ జాయిన్ అయ్యిందని తెలుస్తోంది. అను ఆరంభమే నాని సరసన మజ్ను, రాజ్ తరుణ్ సరసన కిట్టు ఉన్నాడు జాగ్రత్త చిత్రాల్లో నటించి హిట్లు అందుకున్నా, అటుపై స్టార్ హీరోల సరసన అవకాశాలు అందుకుని వరుస ఫ్లాపులతో డీలా పడిపోయింది. పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ సరసన అజ్ఞాతవాసి, స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ సరసన నా పేరు సూర్య చిత్రాల్లో అను ఇమ్మాన్యుయేల్ నటించింది. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ ఫలితాలు అందుకున్నాయి. ఆ క్రమంలోనే అను కెరీర్ పరంగా వెనకబడింది. అయినా పూరి రామ్ ఛార్మి ట్రయో పిలిచి మరీ అవకాశం ఇచ్చారని తెలుస్తోంది. ఈ ఆఫర్ గురించి ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.


నయన్‌కు చరణ్ రిక్వెస్ట్

టాలీవుడ్‌లో లేడీ సూపర్ స్టార్ గా పేరు తెచ్చుకుంది నయన తార సినిమా ప్రమోషన్స్ కు దూరంగా ఉంటుందని ఇండస్ట్రీలో ఎప్పటినుండో టాక్ ఉంది. ముఖ్యంగా తెలుగు సినిమాల ప్రమోషన్స్ కార్యక్రమాలను అస్సలు పట్టించుకోదు. ప్రస్తుతం నయన్ , మెగాస్టార్ చిరంజీవి సరసన సైరా చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈచిత్రం ఈ దసరా కానుకగా విడుదలకానుంది. ఇక ఈచిత్ర నిర్మాత మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఇటీవల నయనతార కు రిక్వెస్ట్ చేశారట. అదేమిటంటే సైరా ప్రమోషన్స్ కార్యక్రమాల్లో పాల్గొనాలని నయన్ ను అడిగారట చరణ్. అందుకు నయన్ మొదట ఒప్పుకోలేదు కానీ చరణ్ రిక్వెస్ట్ చేసే సరికి సానుకూలంగా స్పందించిందని సమాచారం. మరి చరణ్ కోరికను మన్నించి నయనతార సైరా ప్రమోషన్స్ కు వస్తుందో లేదో చూడాలి.

సురేందర్ రెడ్డి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతుంది. అమిత్ త్రివేది సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ , విజయ్ సేతుపతి , సుధీప్ , తమన్నా ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.





పెళ్లిపై ఎందుకీ సందిగ్ధత?





టాలీవుడ్‌లో ఎలిజిబుల్ బ్యాచిలర్స్‌కి కొదవేం లేదు. ప్రభాస్, రానా, నితిన్, విజయ్ దేవరకొండ .. ప్రస్తుతం క్యూలో ఉన్నారు. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ .. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ పెళ్లి ఎప్పుడు? పదే పదే అభిమానులు, మీడియా నుంచి ఎదురయ్యే ఈ ప్రశ్నకు సరైన సమాధానం లేదు. నేడు రెబల్ స్టార్ కృష్ణంరాజు పుట్టిన రోజు సందర్భంగా అయినా ప్రభాస్ పెళ్లి గురించి ఏదైనా క్లూ దొరుకుతుందనే భావించారు. కానీ దీనిపై పెదనాన్న దాటవేశారు. అయితే మీడియా జనం మాత్రం సాహో రిలీజ్ తర్వాత ప్రభాస్ పెళ్లి కబురు అందే ఛాన్సుందని అంచనా వేస్తున్నారు. బాహుబలి రిలీజ్ తర్వాత పెళ్లాడుతానని ప్రభాస్ అన్నాడు. ఐదేళ్లకు బాహుబలిని పూర్తి చేసినా, ఆ వెంటనే సాహో మొదలు పెట్టేయడంతో పెళ్లి గురించి ఆలోచించ లేదు. ఈ సినిమా పేరుతో మరో రెండేళ్లు కాలగర్భంలో కలిసిపోయాయి. ప్రభాస్ పెళ్లి గురించి పెదనాన్న ప్రభాస్ కంగారు పడుతున్నారు.. అన్నిటికీ సమాధానం ఆగస్టు తర్వాతనే ఉంటుందేమో అన్న చర్చ సాగుతోంది. భళ్లాల దేవ రానా ఎప్పుడు పెళ్లాడుతాడు? అన్న దానిపైనా ప్రశ్న తప్పడం లేదు. ఇటీవలే కరణ్ జోహార్ కాఫీ విత్ కరణ్ షోలో రానాకు ఈ ప్రశ్న ఎదురైంది. త్రిషతో ఎఫైర్ గురించి ప్రశ్నించారు. కానీ దేనికీ సరైన ఆన్సర్ లేదు. పెళ్లెప్పుడంటే ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. టాలీవుడ్‌లో మరో మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ నితిన్ పెళ్లిపైనా ఆసక్తికర చర్చ సాగుతోంది. నితిన్ ఓ యువకథానాయికతో ప్రేమలో పడ్డారని వార్తలొచ్చినా ఆ వార్తల్లో నిజం లేదని తర్వాత ఖండించారు. పెళ్లిపై ప్రస్తుతం సందిగ్ధత కొనసాగుతోంది. మరో రైజింగ్ హీరో విజయ్ దేవరకొండ పెళ్లిపైనా స్పష్టత లేదు. పెళ్లెప్పుడు? అని ప్రశ్నిస్తే దానికి ఇంకా సమయం ఉంది. కెరీర్ పైనే దృష్టి అని ఇదివరకూ అన్నాడు. ఇక విదేశీ గాళ్ ఫ్రెండ్‌తో ఎఫైర్ అంటూ సాగిన ప్రచారంలో నిజం ఎంతో తెలియాల్సి ఉందింకా.





ఆ కన్నుగీటుకి అంత పాపులారిటీ దక్కింది- అల్లు అర్జున్

ప్రియా ప్రకాష్ వారియర్ నటించిన 'ఒరు ఆధార్ లవ్'. తెలుగులో 'లవర్స్ డే' పేరుతో విడుదలవుతోంది. సుఖీభవ సినిమాస్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఎ. గురురాజ్, సి.హెచ్.వినోద్‌రెడ్డి నిర్మాతలు. ఒమర్ లులు దర్శకుడు. షాన్ రెహమాన్ సంగీతం అందించిన ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆడియో సీడీలను స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ విడుదల చేశారు. చైతన్య ప్రసాద్, చంటి అడ్డాల తదితరులు ఆడియోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా..

అల్లు అర్జున్ మాట్లాడుతూ–"సౌతిండియన్ సినిమాల్లో నేషనల్ వైడ్గా, ఇంటర్నేషనల్ వైడ్‌గా వైరల్ అయిన వీడియోస్‌లో కొలవెరి డీ.. , బాహుబలిలో హు కిల్ కట్టప్ప.., ఈ మధ్య కాలంలో ఆ రేంజ్లో వైరల్ అయిన వీడియోస్‌లో ఒరు ఆడార్ లవ్. నాకు సౌతిండియా అంటే పిచ్చి. నా ప్రొఫెషన్లో సౌతిండియన్ యాక్టర్ అని రాసుకుంటాను. నేను దక్షిణాదికి చెందిన వాడినని చెప్పుకోవడానికి గర్వపడతాను. నేను పుట్టింది చెన్నైలో. పెరిగింది హైదరాబాద్‌లో.. అలాగే మలయాళం వాళ్లు, కర్ణాటకవాళ్లు కూడా నన్ను ఆదరిస్తున్నారు. కాబట్టి నేను సౌతిండియన్నే. ఈ సినిమా ఫంక్షన్కు నేను రావడానికి రెండు కారణాలున్నాయి. ఒకటి .. నా సినిమాలను కేరళవాళ్లు వాళ్ల సొంత సినిమాల్లాగా ఆదరిస్తున్నారు. ఓ ల్యాండ్ మార్క్ ఉన్న మలయాళ సినిమా తెలుగులోకి వస్తున్నప్పుడు నేను సపోర్ట్ చేసినట్టుగా ఉండాలి కదా అని వచ్చాను. ఈ సినిమా ద్వారా మలయాళ ఇండస్ట్రీని వెల్కం చేస్తున్నాను. మన సినిమాలను కూడా వేరే భాషల్లో చూస్తున్నారు కదా. ఈ సినిమాకు సోషల్ మీడియా ద్వారా బజ్ క్రియేట్ చేసిన రోషన్, ప్రియావారియర్లకు అభినందనలు. ఈ క్రెడిట్ డైరెక్టర్ ఒమర్ లులుగారిది. ఇక రెండోది.. నా పేరు సూర్య సినిమా సమయంలో వినోద్ రెడ్డి గారిని కలిశాను. తనని నా అభిమానిగా బన్ని వాసు పరిచయం చేశాడు. సినిమా రిలీజై కొన్ని గొడవలు వచ్చాయి. . అయితే అప్పుడు కూడా వినోద్ రెడ్డి ముందు ఎలా ఉన్నాడో ఇప్పుడు కూడా అలాగే ఉన్నాడని వాసు ద్వారా తెలుసుకున్నాను. నిజంగా మనకు వీలైనప్పుడు మనమేదైనా చేయ్యాలి వాసు అని అన్నాను. ఆయన వచ్చి నన్ను అడగ్గానే నేను వచ్చి నిలబడ్డాను. నేను ఎంత కాలం నిలబడగలనో తెలియదు కానీ.. అవకాశం ఉన్న ప్రతిసారి నా కోసం నిలబడ్డ ప్రతి ఒక్కరి కోసం నిలబడతాను. గురురాజ్ గారికి అభినందనలు. ఈ సినిమా కోసం పనిచేసిన ప్రతి ఒకరికీ అభినందనలు. ఈ సినిమా లవర్స్ డే సందర్భంగా విడుదలవుతుంది. నా బర్త్‌డేకి ఎంత ఎగ్జయిటెడ్‌గా ఉంటానో .. లవర్స్ డేకు కూడా అంతే కంటే 10 శాతం ఎగ్జయిటెడ్‌గా ఉంటాను"అన్నారు.



చిత్ర సమర్పకుడు వినోద్ రెడ్డి మాట్లాడుతూ – సపోర్ట్ చేయడానికి వచ్చిన అల్లు అర్జున్ గారికి థాంక్స్. నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమా డిస్ట్రిబ్యూషన్ చేశాను. బన్నివాసుగారి సహాయంతో అల్లు అర్జున్‌గారిని కలవగానే ఆయన నన్ను గుర్తు పట్టి.. అడగ్గానే మరో ఆలోచన లేకుండా ఈ ఫంక్షన్‌కి వస్తానని అన్నారు. భవిష్యత్లో కూడా నీకు నా సపోర్ట్ ఉంటుందని ఆయన అన్నారు. ఆయన సపోర్టును జీవితంలో మరచిపోలేను" అన్నారు.

నిర్మాత ఎ.గురురాజ్ మాట్లాడుతూ –"నేను బన్నిగారికి పెద్ద అభిమానిని. ఆయనకు థాంక్స్. అలాగే చాలా మంది నన్ను సపోర్ట్ చేయడానికి వచ్చారు. తెలుగులో అవకాశం ఇచ్చిన సార్‌కి థాంక్స్. నేను కూడా సినిమా మీద కోరికతో ఇండస్ట్రీకి వచ్చాను. నటుడు కావాలనుకున్న నేను అప్పట్లో అవకాశం, అదృష్టం లేక నటుడ్ని కాలేకపోయాను. తర్వాత రియల్ ఎస్టేట్ రంగంలోకి వచ్చి ఈ స్థాయికి ఎదిగాను. సినిమా అంటే చాలా ప్యాషన్. సీతారామరాజుగారు, సురేష్‌గారి సపోర్టుతో ఈ సినిమా అవకాశాన్ని దక్కించుకున్నాను. అలాంటి సమయంలో నా మిత్రుడు వినోద్ రెడ్డి గారు సపోర్ట్ చేశారు" అన్నారు.

దర్శకుడు ఒమర్ లులు మాట్లాడుతూ –మా సినిమాను ఆశీర్వదించడానికి వచ్చిన స్టైలిష్ స్టార్‌గారికి థాంక్స్. మలయాళంలో ఎంత మంది స్టార్స్ ఉన్నా.. మా వీడియో ఎవరూ షేర్ చేయలేదు. అల్లు అర్జున్‌గారు మాత్రమే షేర్ చేశారు. చాలా మంది కొత్త వాళ్లను ఈ సినిమాతో పరిచయం చేస్తున్నాం. ప్రేక్షకుల ఆశీర్వాదం సినిమా రిలీజ్ తర్వాత ఇలాంటి అభిమానాన్ని కనపరచాలని కోరుకుంటున్నాను" అన్నారు. ప్రియా ప్రకాష్ మాట్లాడుతూ –అల్లు అర్జున్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయనతో కలిసి వేదికపై నిలబడే అవకాశం వస్తుందని అనుకోలేదు. ఆయన్ను కలుసుకున్నందుకు థాంక్స్. ఈ అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ థాంక్స్. సినిమా రిలీజ్ కంటే ముందే మమ్మల్ని సపోర్ట్ చేసిన ప్రేక్షకులకు థాంక్స్. ఒరు ఆడార్ లవ్ టీం నుండి అడ్వాన్స్‌డ్ హ్యాపీ వెలంటెన్స్ డే"అన్నారు.

పవర్‌ఫుల్ పాత్రలో అన్నపూర్ణమ్మ



ఎవరెస్టు ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై ఎం ఎన్ ఆర్ చౌదరి నిర్మిస్తున్న చిత్రం 'అన్నపూర్ణమ్మ గారి మనవడు' సీనియర్ మోస్ట్ నటీమణి అన్నపూర్ణమ్మ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో మాస్టర్ రవితేజ టైటిల్ రోల్ ప్లే చేస్తున్నారు. నర్రా శివనాగేశ్వర్ రావు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను అమరావతి పరిసర ప్రాంతంలో ఉన్న అందమైన ఓ గ్రామంలో షూటింగ్ ను జరుపుకోనున్నారు. నిర్మాత మాట్లాడుతూ–"ఓ పల్లెటూరిలో ఎవరికీ ఏం జరిగినా రచ్చబండ పంచాయతీ దర్బార్ లో పెద్ద దిక్కైన అక్కినేని అన్నపూర్ణమ్మ అనే వినూత్న పవర్‌ఫుల్ పాత్రలో నటీమణి అన్నపూర్ణ కనిపిస్తున్నారు. ఆ పల్లెటూరిలోనే ఆమెకు ధీటుగా ఎదురెళ్లే వాసి రెడ్డి వెంకటాద్రి నాయుడుగా సీనియర్ నటుడు బెనర్జీ నటిస్తున్నారు. ఇక షూటింగ్ సెట్ విషయానికి వస్తే.. ఆ ఊరిలోనే పంచాయతీ దర్బార్ సెట్ అందరినీ ఆకర్షింప చేస్తుంది. అంతేకాకుండా పంచాయతీ సన్నివేశాలకు గానూ రెండు వందల మంది జూనియర్ ఆర్టిస్టులతో ఆసక్తికరంగా తెరకెక్కించారు దర్శకుడు. ప్రస్తుతం మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో అర్చన హీరోయిన్‌గా నటిస్తుండగా జీవ, రఘు బాబు, కాటమంచి రఘు, తాగుబోతు రమేష్, సుమన్ శెట్టి, శ్రీ హర్ష, అదుర్స్ సాయి, రమాప్రభ, శ్రీలక్ష్మి, ప్రభ, జయ వాణి తదితరులు నటిస్తున్నారని నిర్మాత ఎం ఎన్ ఆర్ చౌదరి చెప్పుకొచ్చారు.

కునుకు కరువైతే ఎలా?

యోగ టీచర్స్ గా శిల్పాశెట్టి, అనుష్క శెట్టి వంటి తారలకు ఉన్న ఫాలోయింగ్ గురించి తెలిసిందే. శిల్పాశెట్టి యోగా క్లాసెస్ కి సంబంధించిన వీడియో సీడీ, డీవీడీలు మార్కెట్లో అసాధారణంగా పాపులరయ్యాయి. ఆ తర్వాత ఎందరో కథానాయికలు శిల్పాని అనుసరించే ప్రయత్నం చేశారు. శిల్పా శెట్టి క్లాసుల స్ఫూర్తితో నవతరం యోగా టీచర్లు ఉపాధి పొందారంటే అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు సెలబ్రిటీలు యోగ సాధనను ఒక నిత్య వ్యాపకంగా మలుచుకుని ఆరోగ్యాల్ని కాపాడుకోవడానికి తనే స్ఫూర్తి అని చెబుతుంటారు. అంతటి పాపులారిటీ యోగాకు ఉంది. తాజాగా ఈ తరహా యోగా పాఠాల్ని చెప్పేందుకు మరో టీచర్ రెడీ అయ్యారు. ప్రస్తుతం కెరీర్ పరంగా అంతంత మాత్రంగానే బండి నెట్టుకొస్తున్న రియా సేన్ ఈ కొత్త టర్న్ తీసుకోవడం బాలీవుడ్‌లో చర్చకొచ్చింది. తాజాగా రియా యోగా క్లాసులు చెబుతున్న ఫోటోలు కొన్ని సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేస్తున్నాయి. అ యంగ్ గాళ్ స్పోర్ట్ డ్రెస్‌లో రకరకాల భంగిమల్లో వేడి పెంచుతున్న ఫోటోలు వైరల్ అయిపోతున్నాయి. రియా సేన్ .. పాపులర్ క్లాసిక్ నాయిక మున్ మున్ సేన్ కుమార్తె. తల్లి వారసత్వాన్ని నిలబెడుతూ తాను కూడా కథానాయిక అయ్యింది. అయితే ఆశించిన స్థాయిలో కెరీర్ ని మాత్రం సాగించలేకపోయింది. రియా సోదరి రైమాసేన్ సైతం కథానాయికగా ప్రయత్నించి విఫలమైన సంగతి తెలిసిందే. రియా సేన్ ఇదివరకూ మంచు మనోజ్ సరసన నేను మీకు తెలుసా? అనే చిత్రంలో నాయికగా నటించింది. అటుపై టాలీవుడ్ లోనూ ఆశించిన అవకాశాలు దక్కలేదు.








అమితాబ్‌ను సన్మానిస్తున్న బొమన్ ఇరాని

హైదరాబాద్ నవాబ్స్ 2 ట్రైలర్‌ని హైదరాబాద్ పార్క్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో నటుడు నిర్మాత ఆర్కే సహా చిత్రయూనిట్ కార్యక్రమంలో పాల్గొంది. ఇదివరకూ రిలీజైన హైదరాబాద్ నవాబ్స్ సంచలనాల గురించి తెలిసిందే. అంతుకుమించిన విజయం సాధించే చిత్రమిదని చిత్రయూనిట్ ట్రైలర్ వేడుకలో పేర్కొంది.

పక్షవాతానికి బి-విటమిన్..



ఆరోగ్యానికి బి విటమిన్లు చేసే మేలు అంతా ఇంతా కాదు. అయితే మరోసారి ఈ బి విటమిన్‌లలోని ఫోలేట్ బి6 ఉన్న ఆహారాన్ని తీసుకుంటే పక్షవాతం, గుండెజబ్బుల వల్ల కలిగే మరణాల ముప్పు తగ్గుతుందని జపాన్ పరిశోధకుల అధ్యయనంఓ తేలింది. తినే ఆహారంలో పండ్లు, పొట్టుతీయని ధాన్యాలు, బీన్స్, ఆకుకూరల్లో ఫోలేట్ ఎక్కువగా ఉంటుంది. ఇక బి6 చేపలు, కాలేయం, ముడిధాన్యాల్లో ఎక్కువగా ఉంటుంది. ఇంకా నూనెలు తక్కువగా ఉన్న ఆహారం తీసుకుంటే పక్షవాతం, గుండె జబ్బులకు చెక్ చెప్పడమే కాకుండా ఆరోగ్యంగా ఉండొచ్చు. అంతేకాదు ఈ ఆహారాన్ని తీసుకోవడం వల్ల శరీరానికి పీచుపదార్థాం ఎక్కువగా అందుతాయి. స్థూలకాయులు ఈ ఆహారాన్ని మితంగా తీసుకోవడం వల్ల స్థూలకాయాన్ని కూడా తగ్గించుకోవచ్చు.

రెండో సంతానానికి సిద్ధపడినప్పుడు..



పెళ్లి, పిల్లలు జీవితంలో ఒక భాగం. మొదటి సంతానం కలిగాక, రెండో సంతానానికి మధ్య వైద్యుల సూచన మేరకు అవసరమైన సమయం తీసుకోవాలి. మొదటి కాన్పులోని అనుభవాలు, ఇబ్బందులు, ఎదుర్కొన్న సమస్యలు రెండోసారి ఉండకూడదనుకుంటారు. అలాంటప్పుడు కొన్ని ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. ఆ ప్రణాళికను పాటిస్తూ ఉంటే సమస్యలు తలెత్తకుండా ఉంటాయి. సంతానాన్ని పొందేందుకు నిర్ణయించుకోవాల్సిన పద్ధతులేంటో తెలుసుకుందాం..

కళ్ళ ముందు సరదాగా ఆడుకుంటున్న పిల్లాడిని చూసి ఇంకో బిడ్డని కంటే బాగుండుననుకుంటే సంతానానికి సిద్ధమైనట్లే. ఈ ఆలోచన బాగుందనుకుంటారు కదా. కానీ మొదటి పిల్లవాడిని కన్నదాని కంటే రెండో పిల్లాడిని కనడం కాస్త కష్టంతో కూడుకున్న పనే. రెండో బిడ్డను కనాలనుకుంటే కొన్ని విషయాలను ఆలోచించాకే పరిగణలోకి తీసుకోవాలి.

ఆలోచించి అడుగేయాలి..


కొత్తగా ఇంట్లోకి అడుగుపెట్టిన మొదటి బిడ్డ వల్ల జరిగే మార్పులు సహజమే. కానీ అంతే త్వరగా రెండో బిడ్డకు అలవాటు పడడం కష్టంగా ఉంటుంది. ఒక బిడ్డను చూసుకోవడంతోనే సమయం సరిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో రెండో బిడ్డకు ఎడంగా ఉండడం మంచిది. ఇద్దరు పిల్లలు ఒకే తీరులో ఉండరు. మొదటి బిడ్డ సైలెంట్‌గా ఉంటే, పుట్టబోయే బిడ్డ అల్లరిగా ఉండవచ్చు. ఇలాంటి వేరువేరు ప్రవర్తన కలిగిన వారితో ఎంత వరకు వారిని చూసుకోగలరో ఆలోచించి అడుగేయడం మంచిది. ఇద్దరి మీద శ్రద్ధ పెట్టేందుకు కాస్త ఇబ్బందిగా ఉండొచ్చు. కాబట్టి పరిస్థితుల దృష్ట్యా వ్యవహరించడం మంచిది.

వయసు్స దృష్ట్యా..

పిల్లలను కనడంలో తల్లి వయస్సును కూడా పరిగణలోకి తీసుకోవడం అవసరం. పిల్లలను సరైన వయసులోనే కనాలి. ఒక వేల మీరు 35 సంవత్సరాలు దాటితే ఇంకో బిడ్డను కనాలనుకునే ముందు డాక్టర్‌న్ని సంప్రదించడం మంచిది. అంతే కాకుండా ఆరోగ్యరీత్యా కొన్ని సూచనలు, సలహాలను పాటించాల్సి ఉంటుంది.

ఆర్థిక పరిస్థితులు..

మరో పిల్లాడిని కనడానికి సిద్దపడే ముందు పరిగణలోకి తీసుకోవాల్సిన ముఖ్యమైన మరో విషయం ఆర్థిక పరిస్థితి. అసలే మొదటి బిడ్డ పుట్టడంతో ఎంతో ఖర్చు పెరిగుంటుంది. అంతే కాకుండా బిడ్డ స్కూల్‌కి వెళ్లే వయసు వస్తే ఖర్చులు మరింత పెరుగుతాయి. ఈ రోజుల్లో పిల్లలకు మంచి విద్యను అందివ్వాలంటే వేలాది రూపాయలు ఫీజులుగా చెల్లించి మంచి స్కూల్లో చేర్చాలి. తొలి బిడ్డ ఆరోగ్య సంరక్షణ తదితర పలు బాధ్యతల నడుమ ఇంకో బిడ్డను కనడం వల్ల ఆర్థికంగా తట్టుకోగలమా అని ఒకసారి ఆలోచించుకోవడం మంచిది. ఒకవేళ డబ్బుకు లోటు లేదనుకున్నా ఆరోగ్య పరమైన విషయాలను కూడా పరిగణలోకి తీసుకోవాలి.



ఇద్దరు కలిసి నిర్ణయం

భార్య భర్తల్లో ఎవరో ఒకరు మరో బిడ్డ కోరుకోవడం సాధారణంగా జరుగుతూ ఉంటుంది. కానీ ఇలాంటి పెద్ద నిర్ణయాన్ని ఇద్దరి సమ్మతం లేకుండా తీసుకోవడం బంధానికి మంచిది కాదు. అందువలన ఇద్దరిలో ఎవరికి నచ్చకపోయినా, ఇంకొకరు సర్ది చెప్పడానికి ప్రయత్నించాలి. లేదంటే ఆలోచనను మార్చుకోవాలి. ఈ విషయం గురించి ఇద్దరు కష్ట నష్టాలు, పెరిగే భాద్యతలు ఇలా ప్రతి దాని గురించి చర్చించుకొని మంచి నిర్ణయానికి రావాలి.

'చిటికె'లో సాధ్యం..!



- చక్కెర కలిపిన నీటిలో బంగారు వస్తువులను ఆరగంట నానబెట్టి ఆ తర్వాత సబ్బు నీటితో కడిగితే కొత్త వాటిలా మెరుస్తాయి.
- బంగాళా దుంపలు ఉడిగించిన నీటితో వెండి వస్తువులు తోమితే మరకలు పోయి మెరుస్తూ ఉంటాయి.
- ఉప్పు, నిమ్మరసం కలిపి పింగాణీ పాత్రను తోమితే బాగా మెరుస్తాయి.
- బాగా జిడ్డు పట్టిన పాత్రలను వెనిగర్ వేసి తోమితే ఫలితం ఉంటుంది.
- వెనిగర్‌కు బియ్యంపిండి కలిపి ఇత్తడి పాత్రలను తోమితే పాత్రలు బాగా మెరుస్తాయి.

వేళ్లకు కొత్తందాలు..







చేతికి గాజందం.. ఉంగరం వేలికి అందం. కానీ ఇప్పుడున్న నయా ఫ్యాషన్‌లో ఒక్క వేలికి కాదు, పది వేళ్లకు పది రకాలుగా, సరికొత్త డిజైన్స్‌తో అలరిస్తున్నాయి. రింగ్స్ రూట్ మారింది. సింగిల్, డబుల్, త్రిబుల్ కొత్తగా చబల్ కూడా వచ్చేసింది. మరి అంతగా అలరించే ఆ వెరైటీలేంటో, ఫింగర్స్‌కు ఉండే రింగ్స్ ఏంటో చూసేయండి.









చేతి వేళ్లకు అందాన్నిచ్చే ఉంగరాల్లో ఇప్పుడెన్నో సరికొత్త ట్రెండ్స్ పుట్టుకొచ్చాయి. ఉంగరపు వేలికే ఉంగరం పెట్టుకోవాలనే రూల్ పక్కన పెట్టేసి చేతికున్న అన్ని వేళ్లకూ ఉంగరాలు ధరించే ఫ్యాషన్‌ను ఇప్పుడు అమ్మాయిలు ఫాలో అయిపోతున్నారు. ప్రస్తుతం ఫ్యాషన్ ప్రపంచంలో పరిగెడుతున్న లేటెస్ట్ రింగ్ ట్రెండ్స్ ఇవే!

ఫుల్ ఫింగర్ రింగ్

ఏ వేలు అయినా చూపుడు, మధ్య, ఉంగరం వేలు ఇలా దేనికి పెట్టుకున్నా ఆ వేలు మొత్తాన్ని కప్పేసే ఈ రింగ్ చూపరులకు కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. కాబట్టి ఈ రింగ్ పెట్టుకుంటే చేతికి వేరే జ్యువెలరీ పెట్టుకోవాల్సిన అవసరం లేదు.

టు ఫింగర్ రింగ్

రెండు వేళ్లకూ కలిపి ఒకే రింగ్.. టు ఫింగర్ రింగ్. చేతి వేళ్లలో ఏ రెండు వేళ్లకైనా కలిపి పెట్టుకునేందుకు వీలుండే, ఈ రకం రింగ్‌తో చేతికి నిండుదనం వస్తుంది.

డబుల్ ఫింగర్ రింగ్ విత్ చెయిన్

చూపుడు వేలికి, బొటన వేలికి పెట్టుకునే రెండు ఉంగరాల్ని కలుపుతూ చెయిన్ బిగించి ఉండే ఈ రకం రింగ్ కూడా చూడముచ్చటగా ఉంటుంది. తక్కువ ఆభరణాలతో హెవీ లుక్ తెప్పించాలంటే ఈ రింగ్ పెట్టుకోవాల్సిందే.

మిడి రింగ్

వేలి మధ్యలో పెట్టుకునే ఉంగరాలే కాదు వేలి చివరలో పెట్టుకునే ఉంగరాలు కూడా వచ్చేశాయి. అవే 'మిడి రింగ్స్'. కాస్త చిన్న సైజులో వేలి చివరి జాయింట్ దగ్గరగా పెట్టుకునే ఈ ఉంగరాలు ఇప్పుడున్న లేటెస్ట్ ట్రెండ్.

నెయిల్ రింగ్

వేళ్లకి పెట్టుకున్నట్టే గోళ్లకూ ఉంగరాలు పెట్టుకోవచ్చు. గోరు మొత్తాన్ని కవర్ చేస్తూ కనిపించే ఈ నెయిల్ రింగ్స్ రెండు వేళ్లకు లేదా మొత్తం వేళ్లకు పెట్టుకోవచ్చు.

ఫోర్ ఫింగర్ రింగ్

నాలుగు వేళ్లను కలుపుతూ పెట్టుకునే ఒకే రింగ్ ఇది. వేళ్లను అల్లుకున్నట్టుండే డిజైన్లు ఈ రకం ఉంగరాల ప్రత్యేకత. ఇందులోని వెరైటీలు చూడ ముచ్చటగా ఉంటాయి.

హ్యాండ్ ఫింగర్ రింగ్ బ్రేస్‌లెట్

ఉంగరం, బ్రేస్లెట్ రెంటినీ కలుపుతూ వేలాడే చైన్‌న్నే హ్యాండ్ ఫింగర్ రింగ్ బ్రేస్లెట్ అంటారు. ఫంక్షన్స్‌కి ఇది పర్‌ఫెక్ట్ సెలక్షన్‌గా ఉంటుంది. చేతికి నిండుగా, హుందాగా కనిపించే ఈ రింగ్ పెట్టుకుంటే అందరి కళ్లూ మీవైపే!

త్రివర్ణంతో నయనానందం..



జాతీయ జెండా రంగులు అందరికి తెలిసే ఉంటుంది. ఆ రంగులను సంవత్సరంలో రెండు సార్లు మాత్రమే, జెండాను ఎగురవేసేటపుడు చూస్తాం. అలాంటి ప్రత్యేకమైన రోజును ఇంకాస్త ప్రత్యేకంగా సెలబ్రేట్ చేసుకోవాలంటే కొద్ది పాటి శ్రమ, సమయం అవసరం. అందులోనూ పిల్లలకు సంబంధించి ఆ రోజును మరింత ఉత్సాహంగా గడపాలంటే వారికి ఇష్టమైన ఫుడ్‌ను త్రీ కలర్స్‌తో చేసివ్వండి. పిల్లల సతాయింపు కూడా ఉండదు. రోజూ వండే వంటలోనే చిన్న ప్రయత్నంతో కొన్ని వెరైటీలు చేసి చూడండి.. త్రివర్ణ రంగులతో కూడిన స్వీట్స్, రైస్, బర్ఫీ, పాస్త, ఇడ్లీ, ఊతప్పమ్, బ్రెడ్ స్లైసెస్ ఇలా కొన్ని రకాల వెరైటీలతో వారి ముందు ఉంచండి. హాయిగా, ఇష్టంగా, కనులకు విందుగా కనిపించే రంగులతో కుతూహలంగా తినేస్తారు. మరి మీ ప్రిపరేషన్‌లో మీరు ఉండండి.













మాటే మంత్రం..



జీవితంలో పదిమందిని బాధపెట్టి ఎదగడం గొప్పకాదు.. పదిమంది బాధను తీర్చిపైకి రావడమే గొప్ప..



కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)

హైదరాబాద్	398	విజయవాడ	417
ముంబయి	455	ఢిల్లీ	430
చెన్నై	430	బెంగళూరు	415

బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.

హైదరాబాద్	120	ఢిల్లీ	130
కరీంనగర్	120	ముంబయి	125
వరంగల్	120	చెన్నై	135



సెన్సెక్స్ +86.63
36,195



నిఫ్టీ +18.30
10,849

రూపాయి
₹71.07
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
32,453
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో

ఎస్‌యూవీ–హారియర్ ను ఆవిష్కరించిన టాటా మోటార్స్



విజయక్రాంతి, హైదరాబాద్: టాటా మోటార్స్ నుంచి ఎంతోగానే ఎదురుచూస్తున్న ఎస్‌యూవీ–ది హరియర్‌ను హైదరాబాద్‌లో ఆవిష్కరించింది. టాటా మోటార్స్ నుంచి వచ్చిన సరికొత్త మోడల్ అవుట్ లెట్స్‌లో రూ.12.69 లక్షల ప్రారంభ ధరగా నిర్ణయించారు. ఈ సంధర్బంగా పాసెంజర్ వెహికల్ బిజినెస్ యూనిట్ ప్రెసిడెంట్ మయాంక్ పరీఖ్ మాట్లాడుతూ..హరియర్ కోనుగోలు దారులను అద్బుత డిజైన్‌తో, తిరుగులేని పనితీరుతో ఆకట్టుకుంటుంది అని ఆయన అన్నారు. లాండ్ రోవర్ లెజెండరీ డి8 ఆర్కిటెక్షర్ నుంచి ఒమెగా ఆర్క్‌పై హరియర్ నిర్మితమైందని తెలిపారు.

నానోకు గుడ్‌బై చెప్పనున్న టాటా మోటార్స్..?

ముంబై: రతన్ టాటా కలల కారు నానోకు టాటా మోటార్స్ గుడ్ బై చెప్పే అవకాశాలు ఉన్నాయి. 2020 ఏప్రిల్ నాటికి ఈ కారు తయారీని పూర్తిగా నిలిపేయనున్నట్లు కంపెనీ ప్రతినిధి పరోక్షంగా వెల్లడించారు. బీఎస్VI ప్రమాణాలకు అనుగుణంగా నానోను తీర్చిదిద్దడానికి తాము మరిన్ని పెట్టుబడులు పెట్టే పరిస్థితిలో లేమని టాటా మోటార్స్ ప్యాసెంజర్ వెహికిల్స్ బిజినెస్ యూనిట్ ప్రెసిడెంట్ మయాంక్ పరీక్ చెప్పారు. నానో కారును సనద్ ప్లాంట్‌లో తయారు చేస్తున్నాం. జనవరిలో కొత్తగా కొన్ని భద్రతా నిబంధనలు వచ్చాయి, ఏప్రిల్‌లో మరికొన్ని రానున్నాయి. అలాగే అక్టోబర్‌లో మరికొన్ని.. ఇక 2020 ఏప్రిల్ నాటికి బీఎస్VI ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది.



బిగ్ న్యూ వేగనార్ ఆర్ ను జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ ప్రారంభించారు. సోమాజీ గూడలోని సబూ ఆర్కే ఎస్ ఎరీనాలో జరిగిన కార్యక్రమంలో కిరణ్ పిఎ.స(బిజినెస్ హెడ్ సేల్స్) రమణా రెడ్డి(డిజిఎం సేల్స్) మహ్మద్ హఫీజ్(బ్రాంచ్ హెడ్) లు పాల్గొన్నారు

ఎట్టకేలకు లాభాలు.. కోలుకున్న స్టాక్ మార్కెట్లు

- సెన్సెక్స్ 87, నిఫ్టీ 18 పాయింట్ల లాభం
- లాభాల్లో రిలయన్స్, యస్ బ్యాంక్ షేర్లు



ముంబయి: గత రెండు సెషన్లలో నష్టాలను చవిచూసిన దేశీయ మార్కెట్లు ఎట్టకేలకు గురువారం కోలుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూలతలతో గురువారం ట్రేడింగ్ ఆద్యంతం ఒడుదొడుకులతో సాగిన సూచీలు చివరకు లాభాలతో ముగిశాయి. ఎన్‌ఎస్‌ఈలో యస్‌బ్యాంక్, రిలయన్స్, టీసీఎస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్, టెక్ మహింద్రా షేర్లు లాభపడగా.. టాటామోటార్స్, భారతీ ఇన్ఫ్రాటెల్, యూపీఎల్ లిమిటెడ్, అల్ట్రాటెక్ సిమెంట్, సన్‌ఫార్మా షేర్లు నష్టపోయాయి.

అమెరికా, చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మళ్లీ తెరపైకి రావడంతో అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా సాగాయి. ఈ పరిణామాలపై దృష్టిపెట్టిన దేశీయ మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో గురువారం నాటి సెషన్‌ను సూచీలు మందకొడిగానే ప్రారంభించాయి. ట్రేడింగ్ ఆరంభంలో లాభనష్టాల్లో ఊగిసలాడిన సూచీలు చివరి గంటల్లో కాస్త కోలుకున్నాయి. యస్‌బ్యాంక్, రిలయన్స్ లాంటి దిగ్గజ షేర్లు రాణించడం మార్కెట్‌కు కలిసొచ్చింది. దీంతో గురువారం ట్రేడింగ్‌ను సూచీలు లాభాలతో ముగించాయి. సెన్సెక్స్ 87 పాయింట్లు లాభపడి 16,195 వద్ద, నిఫ్టీ 18 పాయింట్ల లాభంతో 10,850 వద్ద స్థిరపడ్డాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 71.22గా కొనసాగుతోంది.

యస్ బ్యాంక్...కొత్త బాస్

- పరుగులు పెట్టిన యస్ బ్యాంక్ షేర్లు



ఢిల్లీ: ప్రయివేటు రంగ యస్ బ్యాంక్ నూతన ఎండీ, సీఈవోగా రవ్‌నీత్ గిల్ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత సీఈవో రాణా కపూర్ పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది. దీంతో కొత్త సీఈవోగా రవ్‌నీత్ బాధ్యతలు చేపట్టనున్నట్లు యస్ బ్యాంక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. రవ్‌నీత్ నియామకాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఆమోదించినట్లు బ్యాంకు ఆ ప్రకటనలో పేర్కొంది. 2019 మార్చి 1లోగా రవ్‌నీత్ ఈ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం రవ్‌నీత్ డాయిష్ బ్యాంక్ ఇండియా సీఈవోగా పనిచేస్తున్నారు.

యస్ బ్యాంక్ సీఈవో వ్యవహారం ఇటీవల వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. బ్యాంకు సీఈవోగా ఉన్న రాణా కపూర్ పదవీకాలం గతేడాది ఆగస్టు 31తో ముగిసింది. అయితే సీఈవోగా రాణాను పునర్ నియమిస్తూ బ్యాంకు బోర్డు నిర్ణయం తీసుకుంది. మరో మూడేళ్ల పాటు రాణా ఈ పదవిలో కొనసాగుతారని గతంలో ప్రకటించింది. అయితే యస్ బ్యాంక్ ఆర్బీఐ నిబంధనలను ఉల్లంఘించినట్లు ఆరోపణలు రావడంతో మరోసారి రాణాను ఎండీ, సీఈవోగా కొనసాగించేందుకు రిజర్వ్ బ్యాంక్ నిరాకరించింది. వచ్చే ఏడాది జనవరి చివరి వరకు మాత్రమే ఆయన సీఎండీగా కొనసాగుతారని, ఆ లోగా కొత్త సీఈవో, ఎండీని ఎంపికచేయాలని ఆర్బీఐ ఆదేశించింది. ఈ నేపథ్యంలో రవ్‌నీత్‌ను నియమిస్తూ యస్‌బ్యాంక్ ప్రకటన విడుదల చేసింది.

కాగా.. రవ్‌నీత్ నియామకం నేపథ్యంలో స్టాక్ ఎక్స్ఛేంజీల్లో బ్యాంకు షేర్లు అనూహ్యంగా పెరిగాయి. ఒక దశలో షేరు ధర 20శాతం వరకు పెరిగింది. ప్రస్తుతం ఎన్‌ఎస్‌ఈలో బ్యాంకు షేరు ధర 14.32శాతం పెరిగి రూ. 225.50 వద్ద కొనసాగుతోంది.

ఇండియాలో రూ.60,000 కోట్ల పెట్టుబడి

- వేదాంత ఛైర్మెన్ అనిల్ అగర్వాల్



ఢిల్లీ: రానున్న మూడేళ్లలో భారత్‌లో రూ. 60,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు వేదాంత రిసోర్సెస్ ఛైర్మన్ అనిల్ అగర్వాల్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరానికి రెండు మిలియన్ టన్నుల జింక్‌ను ఉత్పత్తి చేయటమే లక్ష్యంగా ఇండియా, ఆఫ్రికాల్లో జింక్ వ్యాపారాన్ని విస్తరించబోతున్నట్లు ఆయన తెలిపారు. చమరు, లోహ వ్యాపార దిగ్గజం వేదాంత లిమిటెడ్ యూనిట్ ద్వారా చమురు, సహజ వాయు రంగాల్లో మూడు బిలియన్ డాలర్ల పెట్టుబడులను పెట్టే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు.

అంతే కాకుండా భారత్‌లో 1,400 టన్నుల వెండిని ఉత్పత్తి చేసే దిశగా కంపెనీ పనిచేయబోతుందన్నారు. దీంతో పాటు మహారాష్ట్రలో గ్లాస్ తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు యోచిస్తున్నట్టు తెలిపారు. దక్షిణాఫ్రికాలో 1.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులను వేదాంత పెట్టాలని నిర్ణయించిందన్నారు. అప్పుల ఊబిలో చిక్కుకున్న ఎస్సార్ స్టీల్ కొనుగోలు రేసు నుంచి తప్పుకున్నట్లు తెలిపారు. అయితే హిందుస్థాన్ జింక్ లిమిటెడ్, భారత్ అల్యూమినియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో ఎప్పుడైతే ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ చేస్తుందో అప్పుడు వాటాలను కొనుగోలు చేయటానికి కంపెనీ సిద్ధంగా ఉందని వెల్లడించారు.

హైదరాబాద్‌లో డెలివరి సేవలను ప్రారంభించిన విజ్జీ



విజయక్రాంతి, హైదరాబాద్: లంచ్ బాక్స్ ఇంటి నుంచి తేవాలన్నా, ఇంట్లో మర్చిపోయిన పెన్ డ్రైవ్, పేపర్స్, పాస్‌పోర్ట్ వంటివి దరి చేరాలన్నా మేమున్నాం అని అంటోంది విజ్జీ. ఫుడ్, గ్రాసరీ డెలివరీ కంపెనీలకు భిన్నంగా ఈ స్టార్టప్ సేవలను విస్తరిస్తోంది. కస్టమర్ కోరితే రూ.10,000 వరకు క్యాష్ సైతం విజ్జీ ఉద్యోగి తీసుకొచ్చి ఇస్తారు. పేటీఎం ద్వారా వినియోగదారుడు ఆ మొత్తాన్ని కంపెనీకి చెల్లించాలి. పేటీఎం లావాదేవీ చార్జీతోపాటు డెలివరీ చార్జీ ఉంటుంది. ఎన్నారైలు రవి బత్తి, రవి గొల్లపూడి నాలుగు నెలల కిందట విజ్జీని ప్రారంభించిన ఈ కంపెనీలో ప్రస్తుతం 15 మంది డెలివరీ బాయ్స్ ఉన్నారు. డిసెంబరు కల్లా ఈ సంఖ్యను 1,000కి చేర్చాలని లక్ష్యం ఉంచుకున్నట్లు రవి బత్తి తెలిపారు. ఇప్పటి వరకు 1,300 మంది కస్టమర్లు 3,000 పైచిలుకు ఆర్డర్లు ఇచ్చారని చెప్పారు. మూడు కిలోమీటర్ల వరకు డెలివరీ చార్జీ రూ.20. ప్రతి అదనపు కిలోమీటరుకు రూ.10 ఉంటుందని రవి గొల్లపూడి పేర్కొన్నారు. డెలివరీ బాయ్స్‌కు రోజుకు 8 గంటలకు గాను నెలకు రూ.14,000 వేతనం, రూ.3,000 పెట్రోల్ అలవెన్స్ ఇస్తున్నామని చెప్పారు. 'ఆహారోత్పత్తుల తయారీదార్లకు డెలివరీ పెద్ద సమస్య. విజ్జీ ఆ బాధ్యతను తీసుకుంటుంది. వారి వ్యాపార వృద్ధికి మా సేవలు ఉపయోగపడుతున్నాయి. వారు తయారు చేసే ఉత్పత్తులను ప్రమోట్ చేస్తాం' అని వివరించారు.

స్పోర్ట్స

ఇండోనేషియా మాస్టర్స్ టోర్నీ క్వార్టర్స్‌కు చేరిన సింధు, శ్రీకాంత్





జకార్తా: భారత స్టార్ షట్లర్స్ పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్‌లు ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీలో క్వార్టర్స్‌కు చేరారు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో భాగంగా మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సింధు 23–21, 21–7 తేడాతో గ్రెగోరియా మరిస్కా (ఇండోనేసియా)పై గెలిచి క్వార్టర్స్‌లోకి ప్రవేశించగా, మరో మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ సైనా 7–21, 21–16, 21–11తో దినార్ అయుస్తిన్ (ఇండోనేసియా)పై గెలుపొందింది. శుక్రవారం జరుగనున్న ప్రిక్వార్టర్స్ ఫైనల్స్‌లో కరోలినా మారిన్ తో సింధు, ఛోచువాంగ్‌తో సైనా నెహ్వాల్ తలపడనున్నారు. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ విభాగంలో ఎనిమిదో సీడ్ శ్రీకాంత్ 21–14, 21–9 తేడాతో కెంటో నిషిమోటో (జపాన్)పై విజయం సాధించాడు. మహిళల సింగిల్స్‌లో సింధు తొలి గేమ్‌ను పోరాడి గెలవగా, రెండో గేమ్‌లో అవలీలగా సొంతం చేసుకున్నారు. కేవలం 37 నిమిషాల పాటు జరిగిన పోరులో సింధు తన అనుభవాన్ని ఉపయోగించి క్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. ఇక పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ ఏకపక్ష విజయం సాధించాడు. తొలి గేమ్‌ను 21–14తో గెలిచిన శ్రీకాంత్ రెండో గేమ్‌లో సులువుగానే గెలుపొందాడు.క్వాలిఫయింగ్ నుంచి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందిన శుభాంకర్ డే 14–21, 21–19, 15–21తో ప్రపంచ మాజీ చాంపియన్, నంబర్‌వన్ విక్టర్ అలెక్సన్ (డెన్మార్క్) చేతిలో పోరాడి ఓడిపోయాడు. ఇతర మ్యాచ్‌లో పారుపల్లి కశ్యప్ 12–21, 16–21తో ఆంథోనీ జిన్‌టింగ్ (ఇండోనేసియా) చేతిలో... సాయిప్రణీత్ 12–21, 16–21తో రియో ఒలింపిక్స్ చాంపియన్ చెన్ లాంగ్ (చైనా) చేతిలో ఓటమి చవిచూశారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సుమిత్ రెడ్డి–మనూ అత్రి (భారత్) ద్వయం 14–21, 21–19, 21–15తో మ్యాడ్స్ కోల్డింగ్ నిక్లాస్ నోర్ (డెన్మార్క్) జోడీపై నెగ్గింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో నేలకుర్తి సిక్కి రెడ్డి–అశ్విని పొన్నప్ప (భారత్) జంట 14–21, 14–21తో జోంగ్ కొల్ఫాన్– ప్రజోంగ్జయ్(థాయ్‌లాండ్) ద్వయం చేతిలో పరాజయం పాలైంది.



ఆస్ట్రేలియా ఓపెన్ ఎవరిది..?

- ఫైనల్స్‌లో అడుగు పెట్టిన నవోమి ఒసాక, క్విటోవా



నవోమీ ఒసాక

మెల్‌బోర్న్: ప్రతిష్టాత్మకమైన ఆస్ట్రేలియా ఓపెన్ తుది అంకానికి చేరుకుంది. ఎన్నో సంచలనాలు నమోదు అయిన ఈ మెగా ఈవెంట్‌లో జపాన్ యువ సంచలన టెన్నిస్ క్రీడాకారిణి నవోమి ఒసాక ఫైనల్‌కి చేరుకొని మరోసారి అందర్నీ ఆశ్చర్య పరిచింది. దీంతో ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్ టైటిల్‌పై ఉత్కంఠత నెలకొంది. ఫైనల్ మ్యాచ్‌లో రెండుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ సాధించిన క్విటోవా ఒకవైపు ఉండగా మరోవైపు గత ఏడాది సెరీనా విలియమ్స్‌ను ఓడించి యుఎస్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్న నవోమీ ఒసాకా ల మధ్య పోరు రసవత్తరంగా ఉండబోతుంది.

గురువారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీ ఫైనల్ మ్యాచ్‌లో జపాన్ 4 సీడ్ నవోమీ ఒసాకా 6–2, 4–6, 6–4 తేడాతో చెక్ రిపబ్లిక్ 7 సీడ్ కరోలినా ప్లిసోవాపై గెలుపొందింది. మరోవైపు మహిళల సింగిల్స్ సెమీ ఫైనల్స్ విభాగంలో డేనియల్ కొల్లిన్స్‌పై 7–6(7/2), 6–0 తేడాతో పెట్రా క్విటోవా విజయం సాధించి తుది పోరుకు అర్హత సాధించింది. రెండుసార్లు వింబుల్డన్ టైటిల్ సాధించిన క్విటోవా ఆస్ట్రేలియా ఓపెన్‌లో తొలిసారిగా ఫైనల్స్‌లోకి వెళ్లింది.

తొలిసెట్‌లో హోరాహోరీగా తలపడిన ఒసాకా 6–2 తో గెలుపొందగా రెండో సెట్‌లో కరోలినా ప్లిస్కోవా రెండో సెట్‌ను 4–6 తో కైవసం చేసుకుంది. మూడో సెట్‌లో ఒసాకా పుంజుకుని 6–4 తేడాతో గెలుచుకుని ఫైనల్‌లోకి ప్రవేశించింది. మ్యాచ్ అనంతరం ఒసాకా మాట్లాడుతూ ...."నేను అనుకున్నట్లుగానే మ్యాచ్ చాలా కఠినంగా సాగింది. తొలిసెట్ విరామం తరువాత ప్లిస్కోవా ఒక్కసారిగా తన దూకుడు పెంచిందని"ఒసాక తెలిపింది. రెండు సార్లు వింబుల్డన్ టైటిల్ గెలిచిన క్విటోవా తొలిసారిగా ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించింది.



క్విటోవా

ఇరువురి మధ్య తొలిసెట్ హోరాహోరీగా సాగింది. గంట యాభై మూడు నిమిషాల పాటు సాగిన మ్యాచ్ సాగింది. రెండోసెట్‌లో మ్యాచ్ ఏకపక్షంగా జరిగింది. తొలిసెట్‌లో ట్రై బ్రేక్‌కు దారి తీసిన తొలిసెట్‌ను క్విటోవా గెలుపొందగా రెండో సెట్‌లో క్విటోవా జోరు దూకుడు ముందు కొల్లిన్స్ తేలిపోయింది.

రెండోసెట్‌లో 6–0 తేడాతో క్విటోవా గెలుపొందింది. 28 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఫైనల్‌కు చేరిన తొలి చెక్ రిపబ్లికన్ క్రీడాకారిణిగా క్విటోవా రికార్డు కెక్కింది. శనివారం జరుగనున్న ఫైనల్‌లో క్విటోవా, ఒసాకాతో తలపడనుంది. గత ఏడాది జరిగిన యూఎస్ ఓపెన్‌లో సెరీనా విలియమ్స్‌పై ఒసాకా విజయం సాధించి యూఎస్ ఓపెన్ గ్రాండ్ స్లామ్‌ను గెలుచుకుంది. ఒసాకాకు తొలి సింగిల్స్ గ్రాండ్ స్లామ్ టైటిల్ కాగా 2011, 2014లో క్విటోవా వింబుల్డన్ సింగిల్స్ విజేతగా నిలిచింది. ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఎవరు గెలిచినా తొలిసారి ఈ టైటిల్‌ను సాధించి రికార్డుల్లోకి ఎక్కనున్నారు.


ఫైనల్స్‌లో స్పెయిన్ బుల్



నాదల్

- సెమీస్‌లో స్టెఫినోస్‌కు షాక్ ఇచ్చిన నాదల్

మెల్‌బోర్న్: స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు చేరుకున్నాడు. కెరీర్‌లో 17 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించిన నాదల్ ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌కు అడుగు దూరంలో ఉన్నాడు. నాలుగో రౌండ్‌లో ఫెదరర్‌ను ఓడించిన గ్రీక్ సంచలన ఆటగాడు స్టెఫినోస్ సిట్సిపాస్ జోరుకు బ్రేక్ వేశాడు. గురువారం జరిగిన సెమీఫైనల్స్‌లో 14 సీడ్ స్టెఫినోస్‌ను 2 సీడ్ నాదల్ 6–2, 6–4, 6–0 తేడాతో వరుస సెట్లలో ఓడించి ఫైనల్స్‌లోకి ప్రవేశించాడు. సుమారు 1 గంట 46 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో నాదల్ పైచేయి సాధించాడు. ఇప్పటి వరకూ జరిగిన 63 మ్యాచ్‌లలో ఈ స్పెయిన్ బుల్ సర్వీస్‌ను చేజార్చుకోకుండా అద్భుతంగా ఆడాడు. శుక్రవారం జరుగనున్న మరో సెమీఫైనల్‌లో సెర్బియా టాప్ సీడ్ జకోవిచ్, ఫ్రాన్స్ 31 సీడ్ లూకస్ పొయిలీ మధ్య జరుగనుంది. ఈ మ్యాచ్‌లో గెలుపొందిన వారితో నాదల్ ఢీ కొట్టనున్నాడు. ఈ టోర్నమెంట్ చాలా గొప్పదని, మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగిందని మ్యాచ్ అనంతరం నాదల్ పేర్కొన్నాడు. కొన్ని నెలల విరామం తర్వాత ఈకోర్టులో ఆడానని, కోర్టులో ఉన్న ప్రేక్షకులు నమ్మశక్యం కాని విధంగా నాకు ఎనర్జీని ఇచ్చారని అన్నాడు. నాలుగో రౌండ్‌లో ఫెదరర్‌ను ఓడించిన ఈ 20 ఏళ్ల గ్రీస్ యువ ఆటగాడి పేరు మారుమోగింది. నాదల్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌లోకి ప్రవేశించడం ఇది ఐదోసారి. ఇక ఈ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిస్తే రెండుసార్లు అన్ని విభాగాల్లో నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచిన మొదటి వ్యక్తిగా రికార్డుల కెక్కుతాడు. సిట్సిపాస్‌కు ఇది రెండో ఆస్ట్రేలియన్ ఓపెన్‌కాగా మొత్తంగా ఏడవ గ్రాండ్‌స్లామ్ ప్రదర్శన. గ్రీస్ నుంచి సిట్సిపాస్ సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించిన తొలి ఆటగాడు కాగా ఇప్పటి వరకూ జరిగిన టోర్నీలలో గ్రీస్ నుంచి పురుషుల, మహిళల సింగిల్స్‌లో కలిపి సెమీస్‌లోకి చేరడం ఇదే ప్రథమం.



Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal - Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD-500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.